fb/prajasakti, www.prajasakti.com

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 45 | విజయవాడ, గురువారం 15 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

చర్చలకు పిలుపు

మధు రామకృష్ణకు పవన్ కళ్యాణ్ ఆహ్వానం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలపై చర్చించేందుకు రావాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణను కోరారు. బుధవారం ఉదయం వారిద్దరికీ పవన్ స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. ఈ మేరకు పవన్‌తో చర్చించేందుకు తాము ఈనెల 16న హైదరాబాద్ వెళుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ బుధవారం తెలిపారు.



హోదా... గోదా!

- రాష్ట్రంలో రాజకీయ వేడి
- పైచేయి కోసం పరస్పర విమర్శలు
- కేంద్రం ప్యాకేజీ ఇస్తుందన్న నమ్మకం ఉంది : చంద్రబాబు
- ప్రజల్ని టిడిపి మోసం చేస్తోంది : వైసిపి
- అంబానీ రాకతో మారిన టిడిపి తీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఎంపిల రాజీనామా ప్రకటనతో రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాజకీయంగా పై చేయి సాధించేందుకు టిడిపి, వైసిపిలు పరస్పర ఆరోపణలకు దిగుతున్నాయి. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఇరు పార్టీల నేతలు పోటీలు పడి విమర్శలకు దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదు కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పాదయాత్రలో ఉన్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అంటే చంద్రబాబుకు భయమని, అందువల్లే తెలుగుదేశం పార్టీ ప్రత్యేకహోదా అంటే భయపడుతోందని, చట్టం ప్రకారం రావాల్సిన నిధులను గట్టిగా అడగడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మాట్లాడిని వైసిపి నేతలు ఆరోపించారు. మరోవైపు టిడిపి మంత్రులు, ఎంపీలు వైసిపికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎంపి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నమ్మకం ఉంది ... అయినా పోరాటం : సిఎం

బుధవారం నిర్వహించిన కోర్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. టిడిపి వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వంపై తమకు ఇప్పటికీ నమ్మకం ఉందని చంద్రబాబు అన్నారు. 'ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ఇస్తుందన్న నమ్మకం ఉంది. అయినా, దీనికోసం నిరంతర పోరాటం చేస్తాం' అని ఆయన ఈ సమావేశంలో చెప్పారు. ప్రత్యేకహోదా రాష్ట్ర ప్రజల హక్కని ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో ప్యాకేజి వస్తుందంటూ బాబు చేసిన మిగతా 9లో

పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ స్కామ్

రూ.11వేల కోట్ల అక్రమ లావాదేవీలు

- ముంబయి శాఖలో 10 మంది సస్పెండ్
- 16% పడిపోయిన షేర్
- వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీపై అనుమానం



ముంబయి : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)లో అతిపెద్ద కుంభకోణం జరిగింది. ఆ బ్యాంకు ముంబయి శాఖలో రూ.11,300 కోట్ల పైగా విలువ చేసే మోసపూరిత లావాదేవీలు చోటు చేసుకున్నాయి. ఇదే విషయాన్ని దేశంలోని రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పిఎన్‌బి బుధవారం స్వయంగా బిఎస్‌ఇకి వెల్లడించింది. అయితే ఈ మోసానికి పాల్పడింది ఎవరో పూర్తి వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం. ఆ శాఖలో పలు మోసపూరితమైన, అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని, కొంతమంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఇలా చేసినట్లు తెలుస్తోందని ఆ బ్యాంకు పేర్కొంది. ఈ ఘటనపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర దర్యాప్తు సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది. కాగా ఈ వ్యవహారం పూర్తి వివరాలను ఆ బ్యాంకు వెల్లడించకపోవడం గమనార్హం. ఇందుకు బాధ్యులైన 10 మంది సిబ్బందిని సస్పెండ్ చేసింది. ఈ నగదును విదేశీ ఖాతాలకు తరలించినట్టు కూడా పిఎన్‌బి ధ్రువీకరించింది. 1.77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.11వేల కోట్ల పైనా) విలువ మిగతా 9లో

హామీల సాధన కోసం నిరంతర పోరాటం

- వామపక్ష పార్టీల నిర్ణయం
- రాష్ట్రానికి బిజెపి, టిడిపి ద్రోహం
- దశలవారీ ఉద్యమ కార్యాచరణ
- 18న విజయవాడలో సదస్సు
- 23న గుంటూరులో దళితుల ఆత్మగౌరవ సభ
- 24న విశాఖలో రైల్వేజోన్‌పై సమావేశం
- మార్చి 6న పార్లమెంటు ఎదుట నిరసన
- రాష్ట్ర బంద్‌కు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు

2

బ్యాంకుల్లో డబ్బుల్లేవ్



- అష్టకష్టాలు పడుతున్న సామాన్య జనం
- సమస్యపై వివరాలు సేకరిస్తున్న సిఎం పేషీ
- సత్వర చర్యలకు ఆర్థిక శాఖకు ఆదేశాలు
- బాదుడు వద్దంటూ రిజర్వ్‌బ్యాంకుకు విజ్ఞప్తులు
- ఇది ఎఫ్ఆర్‌డిఐ ప్రభావమేనా?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బ్యాంకుల్లో నగదు కొరత రాష్ట్ర ప్రభుత్వాన్ని వేధిస్తోంది. ఎటిఎంలలో నగదు లేకపోవడం, ఖాతాల్లో ఉన్న నగదుపై బ్యాంకులు విధిస్తున్న ఆంక్షలు, సర్‌ఛార్జీల రూపంలో అదనపు వసూళ్లు జనంపై భారంగా మారిపోతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనం నుంచి ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు కూడా వాస్తవ పరిస్థితులపై నివేదికల్ని సిద్ధంచేశారు. ముఖ్యంగా మూడు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారుల నుంచి వచ్చిన నివేదికలతో వాస్తవాలు వెలుగులోకొస్తున్నాయి. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఉన్నట్లు గుర్తించడంతో ప్రభుత్వం ఆందోళన వ్యక్తం మిగతా 9లో

రూ.5,000 కోట్లు పంపండి : చంద్రబాబు లేఖ

ఆంధ్రప్రదేశ్‌లో డబ్బు కొరత తీవ్రంగా ఉందని, నోట్ల రద్దు నాటి పరిస్థితులు నెలకొన్నాయని, వెంటనే రూ.5,000 కోట్లు పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, ఆర్‌బిఐ గవర్నర్, ప్రాంతీయ గవర్నర్లకు లేఖ రాశారు. బ్యాంకుల్లో నగదు నిల్వలు తగ్గినట్లు తెలుస్తోందన్నారు. దీని ప్రభావంతో ఎటిఎంలలో నగదు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఐదువేల కోట్లు కరెన్సీని రాష్ట్రానికి పంపాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించిన సొమ్మును కూడా తీసుకోలేని స్థితిలో రైతులు ఉన్నారని వివరించారు. అన్ని వర్గాల ప్రజలపై నోట్లలోటు ప్రభావం పడుతోందని తెలిపారు.

అర్చకుల ఆకలి కేకలు

16న రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం

- కనీస వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు
- సుప్రీంకోర్టు తీర్పు అమలుకై పోరాటం
- అర్చక సంక్షేమ నిధి ఏర్పాటుకై డిమాండ్
- 23వేల ఆలయాల్లో లక్షా10 వేలమంది ఆందోళన



తిరుపతి గంగమ్మ గుడి ఎదుట నల్లరిబ్బన్లతో నిరసన తెలియజేస్తున్న అర్చకులకు మద్దతు తెలియజేస్తున్న సిటు నాయకులు సుబ్రమణ్యం (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ ప్రతినిధి

దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు కనీస వేతనాల్లేక అర్ధాకలితో అర్చకత్వ విధులను నిర్వహిస్తున్నారు. చాలీచాలని ఆదాయంతో తమకుటుంబాలను పోషించుకోవడం కష్టసాధ్యంగా మారిందని, తెలంగాణా తరహాలో తమకూ పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ బాట పట్టారు. ఈ నెల 16 రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. రాష్ట్రంలో 23 వేల ఆలయాలు ఉన్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖవెల్లడిస్తోంది. వీటిలో విజయవాడ కనకదుర్గ,శ్రీకాళహస్తీశ్వర, కాణిపాక వరసిద్ధి వినాయక, శ్రీశైలం మిగతా 9లో

బోళ్ల బుల్లిరామయ్య కన్నుమూత

- సిఎం, మంత్రులు, ప్రముఖుల నివాళి
- నేడు తాటిపాకలో అంత్యక్రియలు



తణుకులో మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రముఖ పారిశ్రామికవేత్త, కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య(91) పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని తన స్వగృహంలో కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం కన్నుమూశారు. తూర్పుగోదావరి జిల్లా తాటిపాకలో బోళ్ల వీరవెంకన్న, రామలక్ష్మి దంపతులకు బుల్లిరామయ్య 1926 జులై 9న జన్మించారు. 1953లో ఆంధ్రా సుగర్స్‌లో మేనేజింగ్ డైరెక్టర్ మిగతా 9లో

శాశ్వత ఉద్యోగాలతోనే పేదరిక నిర్మూలన

భారత్‌కు ప్రపంచ బ్యాంకు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : భారత్‌లో స్వయం ఉపాధి కంటే స్థిరమైన, వేతనాలతో కూడిన ఉద్యోగాలు కల్పించడం ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ప్రపంచబ్యాంకు మంగళవారం ఒక నివేదికలో స్పష్టం చేసింది. భారత స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి (2047) ప్రపంచ మధ్యతరగతి జాబితాలో చేరాలనే లక్ష్యం నెరవేరాలంటే స్వయం ఉపాధి కన్నా శాశ్వత ఉద్యోగాలు పెరగుదలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచబ్యాంకు నివేదించింది. సిస్టమేటిక్ కంట్రీ డయాగ్నస్టిక్ (ఎస్‌సిడి) డ్రాఫ్ట్ ఫర్ ఇండియా పేరిట విడుదలైన ఈ నివేదిక భారత్‌పై రూపొందించడం ఇదే తొలిసారి. తీవ్ర అసమానతలు నెలకొన్న భారత్‌లో క్రమబద్ధమైన, వేతనాలతో కూడిన ఉద్యోగాలు సృష్టించడం తక్షణ ప్రాధాన్యత అని బ్యాంక్ పేర్కొంది. ఇలాంటి ఉద్యోగాలతోనే దేశంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపింది. అలాగే కేవలం ఉద్యోగాల సంఖ్య పెరగడం ముఖ్యం కాదని, ఏ తరహా ఉద్యోగాలనేది కూడా ముఖ్యమేనని వ్యాఖ్యానించింది. ప్రపంచ మధ్యతరగతి జాబితాలో భారత్ చేరాలంటే వేతన జీవులు ఎక్కువ మంది వుండాలని, భారత్‌లో ప్రస్తుతం ఈ సంఖ్య తక్కువగా వుందని పేర్కొంది.

'భారత్‌లో మధ్య తరగతి ప్రజల కోసం సృష్టించబడుతున్న ఉద్యోగాల్లో కేవలం ఐదు వంతు మాత్రమే వేతనాలతో కూడిన ఉద్యోగాలు' అని తన వెబ్‌సైట్‌లో ఉంచిన నివేదికలో ప్రపంచ బ్యాంక్ తెలిపింది. దశాబ్దాల నుంచి భారత్ దిగువ మధ్యతరగతి ఆదాయం గల దేశంగా వుందని, ఈ పరిస్థితి మెరుగుపడితేనే ప్రపంచ జాబితాలో భారత్ స్థానం పెరుగుతుందని బ్యాంక్ తెలిపింది. ఆర్థిక సర్వే 2017-18 ప్రకారం భారత్‌లో తలసరి ఆదాయం ఏడాదికి మిగతా 9లో

రాజధాని నిర్మాణంలో వేగం పెంచాలి : సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణంలో వేగం పెంచాలని, నిర్ణీత కాలంలో పనుల్ని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాజధాని నిర్మాణంపై సిఆర్‌డిఎ, ఎడిసి అధికారులు , సర్వీస్ ప్రొవైడర్లతో సచివాలయంలో బుధవారం సిఎం సమావేశమయ్యారు. ఎపి డ్రోన్ కార్పోరేషన్ సహకారంతో 15 రోజులకోసారి డ్రోన్లతో తీసిన చిత్రాల్ని తనకు చూపించాలన్నారు. రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. నిర్మాణ పనుల్ని నిరంతరం పర్యవేక్షించాలని అధికారుల్ని ఆదేశించారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తేనే పెట్టుబడులు వస్తాయన్నారు.

పనులు ప్రారంభిద్దాం

అనంతపురంలో ఈ నెల 22న ఫ్రేమ్‌వర్క్ పనుల్ని ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటార్స్ ఎండి కూఖ్యున్ సిఎం చంద్రబాబును ఆహ్వానించారు.



సిపిఎం అఖిలభారత మహాసభ నిర్వహణకు 20 కమిటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 22వ అఖిల భారత మహాసభ ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరుగనుంది. ఈ మహాసభను విజయవంతం చేయడానికి ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా 20 నిర్వహణా కమిటీల్ని ఏర్పాటు చేసి, బాధ్యుల్ని నియమించింది. రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతుకు శిక్షణ ఇవ్వనున్నాయి. అఖిల భారత మహాసభలు జరిగే నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సెమినార్లు నిర్వహిస్తాయి. జిల్లాల వారీగా మెగా క్యాంపెయిన్ నిర్వహిస్తాయి.

కమిటీలు- బాధ్యులు

కాన్ఫరెన్స్ హాల్ : బి వెంకట్, భోజనాలు : చుక్కరాములు, ఎం సాయిబాబు, వసతులు : జూలకంటి రంగారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ : ఎం శ్రీనివాస్, హైదరాబాద్ ఫెస్ట్ : చెరుపల్లి సీతారాములు, కల్చరల్ ఫెస్ట్ : తమ్మినేని వీరభద్రం, నంద్యాల నర్సింహారెడ్డి, సెమినార్లు : టి జ్యోతి, జి రాములు, వలంటీర్స్, రెడ్‌షర్ట్ మార్చింగ్ : జి నాగయ్య, నిధులు : తమ్మినేని వీరభద్రం, డిజి నర్సింహారావు, బి వెంకట్, సాహిత్యం : ఎస్ వీరయ్య, ప్రచారం : జూలకంటి రంగారెడ్డి, పి సుదర్శన్, బహిరంగ సభ : నంద్యాల నర్సింహారెడ్డి, మీడియా : బి వెంకట్, ఎస్ రమ, జె బాబూరావు, ప్రభుత్వ సంప్రదింపులు : సున్నం రాజయ్య, జూలకంటి రంగారెడ్డి, శానిటేషన్ మరియు వాషింగ్ : పి ఆశయ్య, సోషల్ మీడియా : ఎస్ వినయ్‌కుమార్, హెల్త్ : రమ, టెంట్‌హౌజ్ : భూపాల్, సావనీర్ : ఆర్ సుధాభాస్కర్, ప్రచార సామగ్రి : జె వెంకటేశ్, జె బాబూరావు బాధ్యతలు నిర్వహిస్తారు.



పొడి వాతావరణం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో నాలుగురోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. పగలు ఎండలు, రాత్రి వేళల్లో కొద్దిగా చలి ప్రభావం ఉంటుందని వివరించింది. ఆగ్నేయ అరేబియాలో నెలకొన్న అల్పపీడన ద్రోణి గురువారం నాటికి లక్ష్యద్వీప్‌వైపునకు చేరుకోనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంపై ఇది ఎలాంటి ప్రభావమూ చూపదని నిపుణులు చెబుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ ప్రభావం చూపించగా, తర్వాత పాక్షిక మేఘావృతంతో వాతావరణం చల్లబడింది.

ప్రజ్ఞ

1. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
2. ఈ ఏడాది రేడియో దినోత్సవం నినాదం?
3. ప్రపంచ సంపన్న నగరాల్లో ముంబయి స్థానం?
4. ఇటీవల మృతి చెందిన పర్వతి గోష్ ప్రత్యేకత?
5. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ (సిఐఎఈ) ఎక్కడ ఉంది?

సమాధానాలు 7లో

అశోక్‌బాబుకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

తమ ఆదేశాల్ని అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కారంగా ఎందుకు పరిగణించకూడదో స్పష్టం చేయాలని ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబుకు హైకోర్టు నోటీసు జారీ చేసింది. హైదరాబాద్ గన్‌ఫౌండ్రీ ఏరియాలో ఉన్న ఏపీ ఎన్జీవో సంఘ భవనంలో నాలుగు గదులు, ఒక హాలు భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘానికి ఇవ్వాలన్న తమ ఆదేశాల్ని ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నించింది. హైకోర్టు ఆదేశాల్ని అమలు చేయలేదంటూ భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్, అశోక్‌బాబుకు నోటీసు జారీ చేసింది. విచారణ నెలరోజులకు వాయిదా వేసింది.

హామీల సాధన కోసం నిరంతర పోరాటం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని దశలవారీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్‌కుమార్ ఆధ్యక్షతన 10 వామపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. ఈ వివ రాల్ని మీడియాకు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు సుందరరామరాజు, ఎస్‌యుసిఐ(సి) నాయకులు అమర్‌నాథ్, సుధీర్, ఎంసిపిఐయు నాయకులు వెంకటరెడ్డి, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పొలారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన 11 జాతీయ విద్యా సంస్థల ప్రస్తావనే లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల్ని నిరసిస్తూ దశలవారీ ఉద్యమాలు చేపట్టాలని సమావేశం తీర్మానించిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు అంశం పెద్ద సమస్యగా పరిణమించిందన్నారు. దీనికోసం వామపక్ష పార్టీల నుంచి జిల్లాల వారీగా ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి చట్టంలో సూచించిన అంశాల సాధన కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాలని సూచించారు. చంద్రబాబు నాయుడు హోదా కంటే ప్యాకేజీనే మేలన్నారని, ఇప్పుడు ఏదీ రాలేదనీ ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమల్లో మోడీ, చంద్రబాబు మాట తప్పారని, ప్రజల్ని మోసగించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలో 10 వామపక్ష పార్టీలు ఉద్యమ కార్యాచరణను రూపొందించాయని వివరించారు. ఈ ఉద్యమంలో భాగంగా అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతల్ని కలుపుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ నెల 18న విజయవాడలో ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని చెప్పారు. దీనికి రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నేతలు, విద్యార్థి, ఉద్యోగ, యువజన, మహిళా, రైతు, కార్మిక సంఘాలు తరలివస్తాయని పేర్కొన్నారు. గొట్టిపాడులో దళితులపై పెత్తందారుల దాడిని నిరసిస్తూ ఈనెల 23న 'చలో గుంటూరు' కార్యక్రమానికి వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళిత, బహుజన సంఘాలతో కలిసి గుంటూరులో వేలాది మందితో భారీ నిరసన సభను నిర్వహించనున్నామని చెప్పారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకొచ్చాక దళితులు, మైనారిటీలు, అణగారిన వర్గాలపై పెద్దఎత్తున దాడులు పెరిగిపోతున్నాయని, వారంతా అభద్రతా భావంతో ఉన్నారని తెలిపారు. విశాఖ రైల్వేజోన్, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన కోసం ఈ నెల 24న విశాఖపట్నంలో భారీ సభకు కార్యాచరణ రూపొందించామన్నారు. మార్చి6న వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ఢిల్లీలో పార్లమెంటు ముందు నిరసన తెలుపుతామన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, రాష్ట్ర సమస్యల పరిష్కారంపై కేంద్రం దిగొచ్చే వరకూ పోరాటాన్ని చేపడతామని వారు వివరించారు. దీనికోసం వామపక్ష పార్టీలు ఐక్యంగా కింది స్థాయి వరకూ పోరాటాల ప్రణాళిక రూపొందించాయన్నారు. ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యార్థులు, ప్రజాతంత్రవాదులు ఈ పోరాటాలకు కలిసి రావాలని కోరారు. రాష్ట్రానికి చెందిన కొన్ని రాజకీయ పార్టీలు మోడీకి భయపడటాన్నీ, దోబూచులాడటాన్నీ విడనాడి ప్రత్యక్షంగా ఉద్యమంలోకి రావాలని సూచించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఇటీవల నిర్వహించిన బంద్‌కు సహకరించిన ప్రజలకు, మద్దతు తెలిపిన ప్రతిపక్ష వైసిపి, కాంగ్రెస్, జనసేన పార్టీలకు, ప్రజాసంఘాలకూ ధన్యవాదాలు తెలిపారు. అధికార టిడిపి నేతలూ పరోక్షంగా బంద్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. బిజెపి మినహా రాష్ట్రంలో అన్ని పార్టీలూ జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నాయన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కేటాయింపులు, రాజధానికి నిధుల కేటాయింపు తదితర విభజన హామీలపై ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే భావనతో ప్రజలున్నారని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర బిజెపి నేతలు ప్రజల్ని మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి చెందిన బిజెపి నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఎపికి జరిగిన అన్యాయాన్ని బిజెపి ఆధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించామన్నారు. త్వరలో వామపక్ష పార్టీల ఆధ్వర్యాన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని, దీనికి అన్ని రంగాల నుండి నిపుణుల్ని ఆహ్వానించి లోతుగా చర్చిస్తామని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

రాష్ట్రంలో ఎపిపి కాగిత పరిశ్రమ

సిఎంతో కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాగిత తయారీ సంస్థ ఆసియా పల్స్ పేపర్ (ఎపిపి)ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. భారతదేశంలోనే అతిపెద్ద కాగిత తయారీ కేంద్రాన్ని ఏపీలో నెలకొల్పేందుకు భూమిని కేటాయించాలని సిఎంను వారు కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్ని పరిశీలించాలని వారికి సూచించారు. భూమిని కేటాయించిన రెండున్నరేళ్లలో ఉత్పత్తులు ప్రారంభిస్తామని సిఎంకు వివరించారు. రోజుకి సరాసరి నాలుగు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పరిశ్రమను నెలకొల్పుతున్నామని, ఇందులో నాలుగో వంతు దేశీయ మార్కెట్‌కే కేటాయిస్తామన్నారు.



సిఎంను కలిసిన బేయర్ కంపెనీ ప్రతినిధులు

జర్మనీకి చెందిన ఆగ్రో కెమికల్స్ సంస్థ బేయర్ ఏపీ రైతులకు పంట రక్షణ, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటల్ ఫార్మింగ్‌లో సహకారాన్ని అందించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు తమ ప్రతిపాదనల్ని సిఎంకు వివరించారు. భూసార పరీక్షల్లో అధునాతన పరికరాలు, సిసి కెమెరాలు, డ్రోన్ల సాయాన్ని తీసుకుంటామన్నారు. సమగ్ర ప్రతిపాదనలతో వస్తే పూర్తి సహకారం అందిస్తామని సిఎం వారికి హామీ ఇచ్చారు.

సిమెంట్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం

పలు సిమెంట్ కంపెనీల ప్రతినిధులు సిఎంతో సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాలకు ప్రస్తుతం అందిస్తున్న ధరకే మరో ఏడాది పాటు సిమెంట్ సరఫరా చేస్తామని చంద్రబాబుకు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంకాస్త తక్కువ ధరకు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వానికి అందించే సిమెంట్‌ను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కియో ఆహ్వానం

ఈ నెల 22న ఫ్రేమ్‌వర్క్ పనుల్ని ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటార్స్ ఎండి కూఖ్యున్ సిఎం చంద్రబాబును ఆహ్వానించారు.

హిందువులు కాని ఉద్యోగుల్ని తొలగించడం చెల్లదు : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

తాను హిందువును కాదని చెప్పి ఉద్యోగంలో చేరాక వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ తిరుమల తిరుపతి దేవస్థానం ఎలా నోటీసులు జారీ చేస్తుందని హైకోర్టు ప్రశ్నించింది. తాము హిందూవేతరులనే విషయాన్ని గోప్యంగా ఉంచి, హిందువని చెప్పి ఉద్యోగంలో చేరిన వారికి నోటీసు జారీ చేశారంటే అర్థం చేసుకోవచ్చునని హైకోర్టు అభిప్రాయపడింది. హిందూవేతర్లను ఉద్యోగం నుంచి తొలగిస్తామని టిటిడి నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ క్రిస్టియన్, ముస్లిం మతాలకు చెందిన ఉద్యోగులు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ రిట్‌ను విచారిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇన్నేళ్లపాటు ఉద్యోగాలు చేసిన వారిని తొలగిస్తామంటే వారంతా ఎక్కడి వెళ్లాలని, వారికి ఎవరు ఉద్యోగాలిస్తారని, వారి కుటుంబాలు ఏం కావాలని బెంచ్ టిటిడిని ప్రశ్నించింది. నాలుగో తరగతి పనివాళ్లు, తోటపనివాళ్లు, పారిశుద్ధ్య పనివాళ్ళను తొలగించేస్తామనడం చెల్లదని, వారి నియామక ఉత్తర్వుల సమయంలో హిందువేతరులు అనర్హులనే షరతు పెట్టలేదని బెంచ్ గుర్తు చేసింది. సిబ్బంది సేవల నిబంధనల్లోని 9(6) ప్రకారం తమను తొలగించడం చెల్లదని హిందూవేతర ఉద్యోగుల వాదన. 1998 నుంచి 2004 మధ్య కాలంలో వీరంతా నియమితులయ్యారు. హిందూ సంప్రదాయాల్ని కాపాడతామని వారిచ్చిన హామీపై ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. హిందూవేతరులపై పలు ఫిర్యాదులొస్తున్నాయని టిటిడి న్యాయవాది చెప్పారు. వీరి నియామకాలు చెల్లవని ప్రకటించాలంటూ దేవాదాయ శాఖ లాయర్ వాదించారు. వివరాలు సమర్పించే నిమిత్తం కేసు విచారణను 19కి వాయిదా వేశారు.

నవంబరు నాటికి 10 లక్షల ఎల్ఇడి వీధి దీపాలు : మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ పంచాయతీల్లో నవంబరు నాటికి 10 లక్షల ఎల్ఇడి వీధి దీపాల్ని ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసు లిమిటెడ్ (ఇఇఎస్ఎల్) ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఎల్ఇడి వీధి దీపాల ఏర్పాటుపై పంచాయతీరాజ్, ఇఇఎస్ఎల్ అధికారులతో సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఇడి వీధి దీపాలకు అవసరమైన థర్డ్ వైర్‌ను మార్చి 15 లోపు విద్యుత్తు శాఖ ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలోనూ దళితవాడల నుంచే ఎల్ఇడి దీపాల ఏర్పాటు పనుల్ని ప్రారంభించాలన్నారు. పని చేస్తున్న, పని చేయని వీధి దీపాల్ని ప్రతి రోజూ రియల్ టైంలో పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేయాలన్నారు. ఈ నెల 15 నుంచి ప్రతి రోజూ 10 వేల దీపాల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇఇఎస్ఎల్ ప్రతినిధులు మంత్రికి వివరించారు. చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలో 5,237 గ్రామాల్లో ఎల్ఇడి వీధి దీపాల్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 1,56,773 వీధి దీపాల్ని అమర్చినట్లు చెప్పారు. వీటిని సిసిఎంఎస్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు, జాయింట్ కమిషనర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

2011 గ్రూప్-1లో అక్రమాల్లేవు

ఎపిపిఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఎపిపిఎస్సీ) 2011 గ్రూప్-1లో ఎలాంటి అక్రమాలూ జరగలేదని చైర్మన్ ఉదయభాస్కర్ తెలిపారు. అక్రమాలు జరిగాయని మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపడేశారు. మార్కుల జాబితా విడుదల చేసి అక్రమాలు చేశారంటూ 2011 గ్రూప్-1 అభ్యర్థులు మంగళవారం గవర్నర్ నరసింహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశపై విజయవాడలోని ఎపిపిఎస్సీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2011 గ్రూప్-1కు 294 మందిని ఇంటర్వ్యూలకు పిలిచామని, ఇంటర్వ్యూ పూర్తయ్యే వరకు మార్కుల జాబితా బయటకు తెలపకూడదని చెప్పారు. బయటకు ఎలా వచ్చాయో విచారణ జరిపిస్తామన్నారు. దీనిపై పోలీసుల్ని ఆశ్రయిస్తామన్నారు. ఇంటర్వ్యూల్ని ఎపిపిఎస్సీ పారదర్శకంగా జరుపుతుందని, వీటిల్లో ఎలాంటి అక్రమాలకూ తావులేదని ఆయన స్పష్టం చేశారు.

సముద్రంలో మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ, విశాఖ

విశాఖ తీరంలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. సముద్ర స్నానానికి వెళ్లి విశాఖలోని సాగర్‌నగర్‌కు చెందిన ఇద్దరు మునిగి చనిపోయారు. మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మూడోవార్డు ఇందిరానగర్‌కు చెందిన కొన్ని కుటుంబాలు శివరాత్రి స్నానాల కోసం సీతకొండకు ఎదురుగా ఉన్న బీచ్‌కు వెళ్లాయి. దువ్వి వెంకట శివరామప్రసాద్(49) తన కుటుంబ సభ్యులతో స్నానానికి దిగారు. అదే సమయంలో కుమారులు బంతితో ఆడుతున్నారు. దూరంగా వెళ్ళిపోయిన బంతిని తీసే ప్రయత్నంలో పెద్ద కెరటం తాకిడికి కుమారుడు యశ్వంత్ కొట్టుకుపోయాడు. కుమారుడిని రక్షించే క్రమంలో తండ్రి శివరామప్రసాద్, అక్కడే స్నానం చేస్తున్న కిర్లంపల్లి రమణ(45) ప్రయత్నించిన వారంతా కొట్టుకుపోయారు. వీరి సమీపంలోనే ఉన్న గజ ఈతగాళ్ళు వీరిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే శివరామప్రసాద్, రమణ మృతి చెందారు. యశ్వంత్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడు.

జూన్ 2న 200 అన్న క్యాంటీన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జూన్ 2న లక్ష జనాభా దాటిన 33 మున్సిపాల్టీలలో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సచివాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరులోని ఇందిర క్యాంటీన్ల తరహాలో అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మిస్తామని మంత్రి తెలిపారు. మొదటి విడతగా 200 అన్న క్యాంటీన్లకు సొంతభవనాలు నిర్మిస్తామన్నారు. కార్మికులకు అందుబాటులో ఉండేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి సంబంధించిన ప్రాంతాల్ని అధికారులు ఇప్పటికే గుర్తించారన్నారు. సిఎం చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఏ సమావేశంలో రాజధాని పరిధిలో చేపట్టిన రోడ్లు, సీవరేజ్, విద్యుదీకరణ పనులపై సమీక్షించామన్నారు. 34 రోడ్లలో 24 రోడ్ల పనులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది చివరినాటికి రోడ్లు పూర్తి చేయాలని సిఎం ఆదేశించారన్నారు. మిగతా 10 రోడ్లకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం 3,840 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నా, కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారు పనుల్ని పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని మంత్రి సూచించారు.

కోరలు చాచిన నిరుద్యోగం

ఉపాధి ఉత్తిదే..

- పిఎంఇజిపికి 4 లక్షల దరఖాస్తులు..50 వేలమందికే రుణాలు
- నిరుద్యోగ సమస్యకు నిరాదరణే
- మోడీ సర్కార్‌లో రోజ్‌గార్ తీరిది..

ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలిస్తామని మోడీ చెప్పిన మాటలు ఆచరణలో మాత్రం నిరుద్యోగాన్ని పెంచిందని సాక్షాత్తు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదిక వెల్లడించటం చర్చనీయాంశమైంది. నాలుగేళ్లలో ఉపాధి అవకాశాలు పెరగకపోగా.. 2017లో ఉన్న ఉద్యోగాలు కోల్పోవటం సర్వత్రా ఆందోళనకలిగిస్తున్నది. 2016లో కల్పించిన ఉద్యోగాలు గత పదేళ్లలో ఎన్నడూలేనంత తక్కువగా ఉన్నాయన్న వాస్తవాలు వెలుగుచూశాయి. 2017లో ఉద్యోగాల కల్పన మైనస్‌లో వెళ్లటం తీవ్రమైన విషయంగా పరిశీలకులు భావిస్తున్నారు.



"ప్రతి ఏటా రెండు కోట్లమందికి ఉద్యోగాలు కల్పిస్తాం.
- 2014 ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి మోడీ"



"2018-19 బడ్జెట్‌లో పీఎంఈజీపీ కింద 7.5లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.
- ఫిబ్రవరి 1,2018 పార్లమెంటులో జైట్లీ"

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్ :

గత 8 ఏళ్లలో ఎన్నడూలేనంతగా మోడీ పాలనలో నిరుద్యోగం తాండవం చేస్తున్నదని ఐఎల్ఓ నివేదిక వివరించింది. ఇలాంటి పరిస్థితుల్లో స్వయం ఉపాధికి మోడీ సర్కారు ఇచ్చిన రుణాలు అంతంతేనని స్పష్టమవుతున్నది.

4 లక్షల దరఖాస్తులకు 12 శాతానికే రుణాలు

2017లో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పిఎంఇజిపి కింద నాలుగులక్షలకుపైనే యువత ఉపాధికోసం దరఖాస్తు చేసుకుంటే... అందులో కేవలం 50 వేల మందికి మాత్రమే రుణాలిచ్చారు. దీని ప్రకారం కేవలం 12 శాతం మాత్రమే రుణాలిచ్చినట్టు రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. మిగతా 88 శాతం నిరుద్యోగులు పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించారు.

పిఎంఇజిపి పథకం తీరు తెన్నులెంటి.?

పిఎంఇజిపి ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన అంటారు. ఈ పథకం 2008-09లో ప్రారంభమైంది. స్వయం ఉపాధికల్పించే విధంగా అమల్లోకి తెచ్చింది. 18 ఏండ్లకు పైబడిన నిరుద్యోగులు ఉపాధి కల్పించుకునేలా.. రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షల వరకు, ఉత్పత్తి రంగంలో రూ. పది లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు రుణాలు తీసుకోవచ్చు. ఈ పథకం కింద 90 శాతం వరకు రుణం మంజూరవుతుంది. ప్రాజెక్టు వ్యయం 25 శాతం, అర్బన్ ప్రాంతాల్లో 15 శాతం సబ్సిడీని ప్రభుత్వం సమకూర్చుతుంది.

గణాంకాలేమంటున్నాయి.?

పిఎంఇజిపి పోర్టల్ ప్రకారం 2017 ఏప్రిల్ నుంచి 2018 ఫిబ్రవరి 13 వరకు 4,03,988 మంది యువకులు ఉపాధిరుణాల కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 3,49,208 దరఖాస్తులు కలెక్టర్ల నేతృత్వంలో ఏర్పడిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీల ముందుంచారు. అందులో 2,52,536 దరఖాస్తులను మంజూరుచేస్తూ.. బ్యాంకులకు పంపారు. వాటిలో కేవలం 49,721 దరఖాస్తులకు ఆయా బ్యాంకు అధికారులు రుణ అనుమతులిచ్చాయి.

నిపుణులేమంటున్నారంటే..

ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఫిస్మో) జనరల్ సెక్రెటరీ భరద్వాజ మాట్లాడుతూ..బ్యాంకుల్లో ప్రాసెసింగ్ విధానం సరళతరంగా ఉండదని, దీన్ని నిరుద్యోగ యువత పూర్తి చేయలేకపోతుందని వివరించారు. ఈ ప్రాసెస్‌కు ప్రధానంగా అవినీతి కీలకపాత్ర పోషిస్తున్నది. ఇలాంటి పలు సాకులు చూపించడంతో నిరుద్యోగ యువతకు రుణాలు దక్కటం లేదని తెలిపారు.

పేరుకే కేటాయింపులు..?

నిరుద్యోగం, ఉపాధి అంశాల్లో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న మోడీ సర్కారు పిఎంఇజిపి టార్గెట్‌ను గణనీయంగా పెంచేసింది. 2018 బడ్జెట్‌లో ఆర్థికమంత్రి జైట్లీ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,800 కోట్ల కేటాయిస్తున్నట్టు చెప్పారు. 2017లో ఇది రూ. 1,024 కోట్లు మాత్రమే. ఈ లెక్కన 776 కోట్లు అధికంగా పెంచింది. 2018-19లో 7.04లక్షల మంది ఉపాధికల్పించాలని టార్గెట్ పెట్టుకోగా, గత బడ్జెట్‌లో 56,500 మైక్రో యూనిట్లు, 4.52 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించింది. కానీ బడ్జెట్ కేటాయింపులు పెంచుకుని మోడీ సర్కారు మురిసిపోతే.. యువతకు ఉపాధి ఏ విధంగా దొరుకుతుందో అర్థం కావటంలేదని నిరుద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఓ వైపు బ్యాంకుల వద్ద పేరుకుపోయే మొండి బకాయిలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు నిరుద్యోగుల దరఖాస్తులను బ్యాంకులకు పంపి చేతులు దులుపుకుంటున్నది. స్వయం ఉపాధి పట్ల చిత్తశుద్ధి ఉంటే..యువత నిలదొక్కుకునేలా కేంద్రం చొరవ తీసుకోవాల్సిన అవసరముందని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సంక్షిప్తం

అమరావతి మ్యూజియానికి 7.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి వారసత్వ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి వారసత్వ కేంద్రం, మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.7.5 కోట్లు మంజూరు చేస్తూ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ వారసత్వ కమిషన్ సిఇఓ నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ నిధుల్ని మంజూరు చేసినట్లు తెలిపారు. రెండు దశలుగా మ్యూజియం నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఏప్రిల్ 27న పాలిసెట్ 41 కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ ఇతర సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ ఏప్రిల్ 27న నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి చదివిన విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. ఏప్రిల్ 27 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుంది. 1.50లక్షల మంది అభ్యర్థులు పరీక్ష రాసే అవకాశముంది.

టెట్ పొరపాట్లపై మంత్రి గంటా ఆగ్రహం

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షా కేంద్రాల కేటాయింపులో పొరపాట్లపై మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడమేంటని మంత్రి ప్రశ్నించారు. దరఖాస్తులో ఆప్షన్లు పెట్టకపోయినా కొందరికి పక్క రాష్ట్రాల్లో, మరికొందరికి దూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాల్ని ఎలా కేటాయించారన్నారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు సంబంధించి ఇబ్బందులు తొలగిపోయాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టెట్‌పై నిర్వహణపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించనున్నారు.

తిరుపతి నుంచి ఢిల్లీకి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ తిరుపతి నుంచి ఢిల్లీ వరకూ సైకిల్ యాత్రను బుధవారం తిరుపతి అలిపిరి పాదాల మండపం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి కోలా వెంకట్ మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటకు కేంద్రం కట్టుబడాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తేనే ఆంధ్రా ప్రజలకు నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. కొత్త పరిశ్రమలు నెలకొల్పి, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు.



మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రీశైలంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-శ్రీశైలం (కర్నూలు)

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. 9వ రోజున ఉదయం నుంచి రాత్రి వరకూ మండపారాధనలు, పంచావరణార్చనలు, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం వంటి కార్యక్రమాలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. గంగాధర మండపం వద్దనున్న రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించిన రథానికి సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. రథశాల నుంచి నందిగుడి వరకూ రథాన్ని లాగి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ రథాన్ని 11 రకాల పుష్పాలతో అలంకరించారు.

రథోత్సవంలో నందికొట్కూరుకు చెందిన లక్ష్మీనారాయణచే నాదస్వరం, నంద్యాలకు చెందిన రత్నకుమారి, సంగారెడ్డికి చెందిన పద్మలతలచే కోలాటం, కర్ణాటక మదుకండికి చెందిన మహాలక్ష్మీ జాంద్‌పతక్, ప్రకాశం జిల్లా దొడ్డవరానికి చెందిన వెంకటేశ్వర్లు చెక్కభజన, తూర్పుగోదావరి జిల్లా పి.పార్వతి పగటివేషాల ప్రదర్శన, పలురకాల జానపద కళానృత్యాలు గ్రామోత్సవంలో నిర్వహించారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చిన యాత్రికులను అలరించేందుకు పుష్కరిణి వద్ద, శివదీక్ష శిబిరాల్లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

మిర్చి రైతు కంట్లో కారం

● కర్నూలు వ్యాపారుల సిండికేట్ ● ధర భారీగా పతనం

ప్రజాశక్తి కర్నూలు ప్రతినిధి

మిర్చి రైతును వ్యాపారులు నిలువునా దోపిడి చేస్తున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధర రాక విలవిల్లాడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ క్వింటాలు రూ.10వేలు పైబడి ధర పలికింది. ఇప్పుడు మిర్చి పంట మార్కెట్‌కు ఎక్కువగా వస్తుండడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి అమాంతంగా ధరను తగ్గించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాలు ధర రూ.1800 నుంచి రూ.8,500 దాకా ఉంది. గతేడాది సగటున క్వింటాలు రూ.10 వేలుకు పైబడి పలకగా.. ఈ ఏడాది సగటున రూ.5వేలు ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటాలు రూ.4,500 నుంచి రూ.5,500 ధరకు వేలం పాడారు. వేలం అయితే రూ.10వేలు ధర వస్తుందని రైతులు మార్కెటింగ్ శాఖ అధికారుల ముందు ఆందోళనకు దిగారు. మార్కెటింగ్ శాఖ అధికారులు టెండర్ కోట్ చేసిన ధర కంటే రూ.వెయ్యి అధికంగా చెల్లించి ఇవ్వాలని వ్యాపారులకు ఆదేశాలను జారీ చేశారు. వారు రూ.వెయ్యి అదనంగా చెల్లించేందుకు ముందుకు రాకుండా.. టెండర్ వేసిన మిరపను కాటా వేయకుండా తాము కొనుగోలు చేయలేమంటూ వెళ్లిపోయారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో మిరపను సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుంది. వాతవారణం అనుకూలించి తెగుళ్లు రాకపోతే ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. అయితే ఈఏడాది వాతావారణం అనుకూలించకపోవడంతోపాటు తెగుళ్లు కూడా విజృంభించాయి. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల మధ్యనే దిగుబడి వచ్చింది. కనీసంగా క్వింటాలు రూ.10 వేల ధర పలికితేగాని రైతాంగం పెట్టిన పెట్టుబడి పోగా అంతో ఇంతో మిగిలే పరిస్థితి ఉంటుంది. అలా కాకుండా రూ.5 వేలు వస్తే తాము నష్టాల్లో కూరుకుపోక తప్పదని రైతులు అందోళన చెందుతున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్ కాకుండా రైతాంగానికి గిట్టుబాటు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



రూ.10వేలు ధర వస్తేనే గిట్టుబాటు

మిరపకు పెట్టుబడి ఎక్కువ. ఎకరాకు రూ.లక్షకు పైబడి అవుతోంది. క్వింటాలుకు రూ.10 వేలు ధర వస్తేగానీ గిట్టుబాటు కాదు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.5,500 అడుగుతు న్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదు.

– చంద్ర, దేవనకొండ

వ్యాపారులంతా సిండికేట్

వ్యాపారులు సిండికేట్‌గా మారి మార్కెట్‌లో తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమ సమస్యకు పరిష్కారం దొరకటంలేదు. అధికారులకు వ్యాపారులకు ఏమాత్రం భయపడని పరిస్థితి వుంది.

– కృష్ణమూర్తి పి.కోటకొండ, దేవనకొండ మండలం

రైతులకు అన్యాయం జరగనివ్వం

మిర్చి రైతులకు ఏమాత్రం అన్యాయం జరగకుండా చూస్తాం వ్యాపారులు మోసం చేయాలని చూస్తే చర్యలు తీసుకుంటాం.మార్కెట్‌లోకి సరుకు తీసుకవచ్చే రైతులకు పూర్తిగా మద్దతు ధర కల్పించేలా చర్యలుతీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి సెక్రటరీ మార్కెట్‌యార్డు కర్నూలు

శ్రీపాద మహాసంస్థానంలో సిసి పుటేజీ మాయం

విచారణ చేపట్టిన ఆర్‌జెసి

ఇఒ దారబాబుపై చర్యకు ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పుగోదావరి)



విచారణ చేస్తున్న ఆర్‌జెసి త్రినాధరావు

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో వ్యవహారాలపై దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాథరావు బుధవారం విచారణ జరిపారు. మహాసంస్థానం ఇఒగా చందక దారబాబు ఉన్న సమయంలో అదనపు సిబ్బంది నియామకం, జీతాల పెంపు, అన్నవరం సిబ్బంది, పాదగయ సిబ్బంది మధ్య వివాదం, అన్నవరం సిబ్బందిలో ఒకరిపై దారబాబు దాడి చేసినట్లు ఫిర్యాదులు దేవాదాయశాఖకు అందాయి. దీంతో, ఆ శాఖ కమిషనర్ అనురాధ ఇచ్చిన ఆదేశాలపై ఆర్‌జెసి బుధవారం విచారణ చేశారు. అన్నవరం సిబ్బంది, పాదగయ ఇఒల మధ్య ఈ నెల 10న వివాదం జరిగిన నాటి నుంచి సిసి పుటేజీ అందుబాటులో లేదని, ఈ నెల 12 నుంచే అందుబాటులో ఉందని ఆయన గుర్తించారు. డిప్యూటీ కమిషనర్ డిఎల్ రమేష్‌బాబుతో కలిసి పలు రికార్డులను తనిఖీ చేశారు. అన్నవరం ఇఒ జితేంద్ర నుంచి వివరాలు సేకరించారు. అదనపు సిబ్బంది, జీతాల పెంపు జరిపినట్లు ప్రాథమికంగా జరిపిన విచారణలో వెల్లడైందని ఆర్‌జెసి మీడియాకు వివరించారు. దేవాదాయశాఖ స్వాధీనం చేసుకునే నాటికి 76 మంది సభ్యులు ఉన్నట్లు నివేదిక ఇచ్చారని, వాస్తవంగా 63 మందే ఉన్నారని చెప్పారు. వీరిలో ఎనిమిదిమందిని మహాసంస్థానం, ఐదుగురిని సేవా సంఘం నుంచి అదనంగా ఉన్నట్లు గుర్తించారు. పాత సిబ్బందినే విధుల్లోకి తీసుకున్నారా, కొత్తగా నియమించారా అనేది పూర్తిస్థాయిలో పరిశీలిస్తామన్నారు. సంస్థానం నుంచి 21 మంది, సేవా సంఘం నుంచి 33 మందికి జీతాలను రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకూ పెంచినట్లు గుర్తించామన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో పెంచిన జీతాలు సిబ్బందికి ఇచ్చారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

మేయర్ శ్రీధర్‌ను తొలగించాలి

బుద్ధా వెంకన్నతో టిడిపి కార్పొరేటర్లు


ప్రజాశక్తి - విజయవాడ

అనుచితంగా వ్యవహరిస్తున్న నగర మేయర్ కోనేరు శ్రీధర్‌ను తొలగించి ఆ స్థానంలో మరొకరికి అవకాశం కల్పించాలని అత్యధిక మంది కార్పొరేటర్లు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని టిడిపి అర్బన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామమోహనరావు, మేయర్ శ్రీధర్ మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో టిడిపి కార్పొరేటర్లతో ఎంపి కేశినేని భవన్‌లో బుద్దా వెంకన్న బుధవారం సమావేశం నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య విభేదాల నేపథ్యంలో అధినాయకత్వం ఆదేశం మేరకు కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించామన్నారు. రొటేషన్ పద్ధతిపై సామాజిక తరగతుల వారీగా పదవుల పంపిణీ జరిగేలా చూడాలని కార్పొరేటర్లు తెలిపారన్నారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్‌ను కూడా మార్చాలనే అభిప్రాయాన్ని కార్పొరేటర్లు వ్యక్తం చేశారని చెప్పారు. సమన్వయ లోపం వల్లే వివాదం తలెత్తిందని అన్నారు.

పెన్షన్ కోసం టెన్షన్

నేటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర నగదు కొరత నెలకొంది. ఇది పించన్ల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపింది. పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదు అందుబాటులో లేకపోవడంతో పంపిణీ నెమ్మదిగా సాగుతోంది. పింఛన్ల పంపిణీకి గురువారం సాయంత్రంతో గడువు ముగుస్తుంది. ఇప్పటికీ వేలాది మందికి పింఛన్లు అందలేదు. వరుసగా మూడు నెలలపాటు పింఛను అందుకోలేనివారి పింఛను రద్దవుతుందని అధికారులు చెప్తున్నారు. దీంతో వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛనుదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి 2,84,846 మందికి పింఛన్ల అందజేతకు రూ.30.56 కోట్ల అవసరం కాగా, ఇప్పటివరకూ 1,90,317 మందికి రూ.20.36 కోట్లను మాత్రమే పంపిణీ చేశారు. బ్యాంకు అధికారులు ఆయా మండలాలకు సర్దుబాటు చేసిన నగదు మేరకు పింఛనుదార్లకు అందజేస్తున్నారు. ఇంకా 94,529 మందికి రూ.10.20 కోట్లను అందజేయాల్సి ఉంది. ఇందులో బ్యాంకు అధికారులు రూ.ఐదు కోట్లను సర్దుబాటు చేశారు. మిగిలిన మొత్తాన్ని సర్దుబాటు చేస్తామని అధికారులు చెప్తున్నారు. గురువారం ఒక్క రోజు మాత్రమే పింఛన్ల పంపిణీకి చివరిరోజు. మిగిలిపోయిన వారందరికీ పింఛన్లు అందుతాయన్నది సందేహాస్పదంగా ఉంది.

మూడు నెలల పాటు తీసుకోని పింఛన్లు రద్దు

వరుసగా మూడు నెలల పాటు పింఛను అందని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అటువంటి వారు 774 మంది ఉన్నారు. వేలిముద్రలు పడలేదని, పింఛన్ల పంపిణీ సమయంలో గ్రామంలో అందుబాటులోలేరని, మరుగుదొడ్డి నిర్మించుకోలేదని ఇలా వివిధ కారణాలతో గత రెండు నెలలుగా అధికారులు పింఛను పంపిణీ చేయలేదు. ఇప్పుడు నగదు కొరత సమస్య తలెత్తడంతో పింఛను అందుతుందో? లేదో? అని పింఛనుదారులు ఆందోళన నెలకొంది. ఈ నెల పింఛను అందుకోని పక్షంలో వారి మూడు నెలల డబ్బులు వెనక్కి వెళ్లిపోతాయి. మరుగుదొడ్లు నిర్మించుకోని వారికి కూడా పింఛన్లు పంపిణీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. నగదు కొరత లేకుండా చూసి అందరికీ పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పింఛనుదారులు కోరుతున్నారు.

సంపాదకీయం

ఐక్యంగా కదులుదాం!

ప్రత్యేకహోదా కోసం లోక్‌సభ ఎంపి పదవులకు రాజీనామాలు చేస్తామన్న వైసిపి ప్రకటనతో రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాల మధ్య రాజకీయ ఎత్తులు పైఎత్తుల పర్వానికి తెరలేచింది. పార్లమెంటు మలివిడత సమావేశాలు ఏప్రిల్ 5 వరకు జరుగుతాయి. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం హోదా ప్రకటించకపోతే 6న లోక్‌సభ ఎంపిలు రాజీనామా చేస్తారని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. నిజానికి ఎంపిల రాజీనామా గురించి గతంలోనే ప్రకటించిన ఆయన అంతలోనే పిల్లి మొగ్గలు వేశారు. నొప్పించక, తానొవ్వక అన్న చందంగా అటు కేంద్రంలో బిజెపిని నొప్పించకుండా, మరోవైపు బిజెపి ప్రభుత్వం చేసిన ద్రోహం గురించి ప్రస్తావించకుండా ఉండలేక వైసిపి చాలా విన్యాసాలే చేసింది. నెపాన్ని కేవలం తెలుగు దేశం ప్రభుత్వం మీద నెట్టేసి, బిజెపిని రక్షించడానికి ప్రయత్నించింది. రానున్న ఎన్నికల్లో బిజెపితో దోస్తీ ఆలోచనే దాన్ని అటువంటి విన్యాసాలవైపు నెట్టిందని రాజకీయాలు తెలిసిన వారెవరైనా ఇట్టే గ్రహిస్తారు. అయితే ఈసారి ఎంపిల రాజీనామా గురించి ప్రకటించడమే కాకుండా స్పష్టంగా తేదీ కూడా ప్రకటించడానికి నరేంద్రమోడీ సర్కారుపై రాష్ట్ర ప్రజానీకంలో వ్యక్తమవుతున్న ఆగ్రహమే కారణం. పదేళ్ల పాటు హోదా ఇస్తామని, విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి, తీరా అధికారంలోకొచ్చాక తెప్ప తగలేసిన కేంద్ర ప్రభుత్వ నిర్వాకంపై ఇటీవల వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు వచ్చిన భారీ స్పందన జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షంగా చూశారు. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేదిశగా వామపక్షాలు నిరంతర పోరాట కార్యాక్రమాన్ని రూపొందించాయి. బృహత్తర పోరాటానికి సంసిద్ధమవుతున్నాయి. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కూడా తనదైన శైలిలో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామని తొలుత ప్రకటించిన ఆయన పునర్వ్యవస్థీకరణ చట్టం ఇప్పటివరకు అమలైన తీరు, కేంద్ర ప్రభుత్వం నుండి అందిన నిధుల నిగ్గు తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వివిధ పార్టీలు, సంఘాల నేతలతో ఆయన చర్చలు జరుపుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాలంటే అన్ని పార్టీలూ కలిసి పోరాడాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని హోదాలో రాహుల్‌గాంధీ ఇప్పటికే పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కూడా తన శక్తిమేరకు ఆందోళనలకు మద్దతిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలతో పాటు వివిధ ప్రజా, వర్గ సంఘాలు కూడా విభజన హామీల అమలుకోసం ఇప్పటికే ఉద్యమిస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అనివార్యంగా టిడిపి మీద రాజకీయంగా పైచేయి సాధించడం కోసం ఎంపిల రాజీనామా అంశాన్ని తెరమీదకు తెచ్చింది. దీనిపై టిడిపి నాయకులు ఎంతగా కలవర పడుతున్నారో వారి ప్రకటనలే తెలియజేస్తున్నాయి. ప్రజానీకంలో వ్యక్తమవుతున్న ఐక్యతను వినియోగించుకుని ప్రత్యే హోదా కోసం, విభజన చట్టంలోని అంశాల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన టిడిపి ప్రభుత్వం ప్రత్యేక హోదా విషయాన్నే ప్రస్తావించకుండా ప్యాకేజీల పేరుతో ఇప్పటికీ ప్రజల్ని మోసగించడానికే ప్రయత్నిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి మిత్రపక్షంగా ఉంటూనే మరోవైపు నిరంతర పోరాటం అంటూ టిడిపి నాయకులు ఆడుతున్న నాటకాలు క్రమంగా ప్రజల ముందు ఆవిష్కృతమవుతున్నాయి. దీనికి తోడు వైసిపి రాజీనామాల ప్రకటన, వామపక్షాల ఉద్యమం, జనసేన నేత పవన్ కల్యాణ్ చొరవ ఇవన్నీ టిడిపికి పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టుగా మారాయి. బిజెపితో లాలూచీ కుస్తీ విడిచిపెడితే స్వప్రయోజనాలకు నష్టం జరుగుతుందన్న బాధ ఒకవైపు, హోదాపై పోరాడకపోతే ప్రజలకు తమ నిజస్వరూపం తెలిసిపోతుందన్న భయం మరోవైపు దాన్ని ఊపిరాడనివ్వడం లేదు. అందుకే వైసిపి నేత జగన్‌పై విమర్శలమాటున, కేంద్రం ఇచ్చిన నిధుల లెక్కల గురించి ఇచ్చే లీకు వార్తల మాటున దాక్కోడానికి అది ప్రయత్నిస్తోంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంతవరకు బహిరంగంగా స్పందించలేదు. ఆయన ఆగ్రహంగా ఉన్నారంటూ ఒక పథకం ప్రకారం టిడిపి వర్గాలు లీకు వార్తలతో, పొంతన లేని ప్రకటనలతో ప్రజల్ని గందరగోళంలో ముంచడానికి ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల పట్ల చంద్రబాబుకు, ఆయన నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రత్యేకహోదా, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాల అమలుకోసం ఉద్యమిస్తున్న అన్ని పార్టీలను, సంఘాలను కలుపుకుని ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకువెళ్ళాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర సర్కారును నిలదీసి రాష్ట్ర ప్రజల హక్కుల్ని సాధించాలి.

ఇదీ విషయం



ట్రిపుల్ తలాక్ చెప్పేస్తే
కమలానికి మంట...
కలిసి కాపురమంటే
జనంతోని తంటా!

ఆంధ్రావని చంద్రునికి
మోడీ ఓ గ్రహణం...
అధికారపు దాహంతో
హస్తిన చుట్టూ భ్రమణం!

- కొల్లూరు వెంకట్

గుజరాత్! త్రిపుర! ఏది మోడల్ రాష్ట్రం?

విశ్లేషణ

ప్రస్తుతం త్రిపుర శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈశాన్య రాష్ట్రం గురించి మరోసారి జాతీయ స్థాయిలో చర్చ సాగుతోంది. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా సిపిఎం నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండడం, అదే సమయంలో కాంగ్రెస్‌ని కబ్జా చేసిన బిజెపి ఎన్నికల బరిలో నిలుస్తున్న నేపథ్యంలో ఆసక్తికర చర్చ ముందుకొచ్చింది. దేశంలో మతోన్మాద బిజెపి విధానాలకు విరుగుడుగా ప్రత్యామ్నాయ విధానాలు కోరుతున్న వారికి మార్క్సిస్టులు మార్గదర్శకంగా వున్నారు. ప్రత్యామ్నాయ పాలనా విధానాలకు మచ్చుతునకగా ఉన్న త్రిపురలోనే వారికి బ్రేకులు వేయాలని బిజెపి అధిష్టానం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగా అస్త్రశస్త్రాలతో ప్రధానంగా అబద్ధాలే ఆయుధంగా ప్రచారంలోకి దిగుతున్నట్టు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా విస్తరించాలన్న కాంక్షతో పలు రాష్ట్రాల్లో బిజెపి అమలు చేస్తున్న విధానాలనే త్రిపురలో కూడా ముందుకు తెచ్చింది. ప్రచారహోరుతో ప్రజలను మభ్యపెట్టగలిగిన చోట ఓట్లతో అధికారంలోకి రావడం, అది సాధ్యం కాకపోతే గెలిచిన వారిని మభ్యపెట్టి తాను అధికారం చేపట్టడం బిజెపి విధానంగా మారిపోయింది. వరుసగా అరుణాచల్ ప్రదేశ్, గోవా, నాగాలాండ్ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు దేశమంతా చూసింది. త్రిపురలో కూడా అదే తరహాలో ఎన్నికలకు ముందే కాంగ్రెస్ వారిని కలుపుకుంది. ఈసారి బిజెపి తరుపున బరిలో దిగిన 51 మంది అభ్యర్థుల్లో 41 మంది కాంగ్రెస్ నుంచి ఇటీవలే కమలం గూటికి చేరిన వారే. దీన్నిబట్టే త్రిపురలో తామే ప్రత్యామ్నాయం అని చెప్పుకుంటున్న బిజెపి నేతల అసలు బుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఇంత చేసినా త్రిపురలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఛాలెంజ్ చేయలేమన్న ఆందోళనతో ఆఖరికి దేశాన్ని చీల్చాలని కోరుకుంటున్న ఐపిటీఎఫ్‌తో పొత్తు పెట్టుకుని తన కుహనా దేశభక్తిని చాటుకుంది. భారత్ మాతాకి జై అంటూనే... భారతదేశంలో మేముండమని చెబుతున్న వారితో కలిసి ఎన్నికల్లో దిగడం వారి అనైతిక వైఖరికి అద్దం పడుతోంది. బిజెపి తమది 'గుజరాత్ మోడల్' అభివృద్ధిగా చెప్పుకుంటున్న తరుణంలో ప్రజానుకూల త్రిపుర విధానాల తీరును పరిశీలిస్తే వాస్తవం బోధపడుతుంది.



వెన్నెల శంకర్





> చిన్న చిన్న పదవుల్లో ఉన్నవాళ్లే అవినీతి ఊబిలో కనిపిస్తుంటే సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉండి, సాధారణ జీవితం గడుపుతూ నిరాడంబరతకు నిలువుటద్దంగా మాణిక్ సర్కార్ నిలిచారు. గుజరాత్‌లో మోడీ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రి ఏకంగా అనేక ఆరోపణలతో పదవిని త్యజించాల్సిన స్థితి ఉంటే, త్రిపురలో దానికి భిన్నమైన పరిస్థితి ప్రత్యామ్నాయ విధానాలను ప్రస్ఫుటంగా చాటుతోంది.

అక్షరాస్యత.. ఆరోగ్యం.. నేరాలు..

వాస్తవానికి గుజరాత్‌తో త్రిపురను పోల్చడం ఏరకంగా చూసినా సమర్థనీయం కాదు. జనాభా పరంగానూ, అవకాశాల రీత్యాను, భౌగోళిక కారణాలతోనూ, వనరుల రీత్యానూ అన్నింటా గుజరాత్ ముందున్నా... అక్షరాస్యత, ఆరోగ్యం వంటి అనేక అంశాలలో త్రిపుర కంటే ఎంతగానో వెనకబడి వుంది. 1970లో ఏర్పడిన త్రిపుర రాష్ట్రం ఆనాటికి అక్షరాస్యతలో దేశంలో 17వ స్థానంలో ఉంది. అయితే తాజా అంచనాల ప్రకారం 98 శాతం అక్షరాస్యతతో అందరికన్నా ముందుంది. 37 లక్షల జనాభా కలిగిన రాష్ట్రమే అయినప్పటికీ అక్షరాస్యత ద్వారా అందరిలో చైతన్యం నింపడం అవసరమని భావించిన కమ్యూనిస్టు సర్కారు విధానాల ఫలితమే ఈ విజయం అని చెప్పవచ్చు. మూడు దశాబ్దాలుగా త్రిపురను కమ్యూనిస్టులే పాలించారు. అదే సమయంలో 1998 నుంచి గుజరాత్‌ను బిజెపినే పాలిస్తోంది. అక్షరాస్యతలో గుజరాత్ దేశంలోనే 18వ స్థానంలో (కేవలం 79 శాతమే) వుంది. అందులోనూ మహిళల అక్షరాస్యతా శాతం 70కి లోపు ఉండడం గమనార్హం. ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు నేటికీ నిరక్షరాస్యులుగానే ఉన్నారు. స్త్రీ పురుష నిష్పత్తిలో చూస్తే ప్రతి వెయ్యి మంది పురుషులకు గుజరాత్‌లో 919 మంది మాత్రమే మహిళలున్నారు. అదే సమయంలో త్రిపురలో ఆ సంఖ్య 962గా ఉంది. జాతీయ సగటు కన్నా త్రిపుర ముందంజలో ఉంటే, గుజరాత్ మాత్రం బాగా వెనుకబడిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. ఆరోగ్యరంగంలో చూసినా ఆఖరికి ఏఎన్ఎం పోస్టుల భర్తీలో కూడా గుజరాత్ ప్రభుత్వం విఫలమైంది. కేటాయించిన పోస్టుల్లో 10.7 శాతం ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే సమయంలో వైద్యుల విషయంలో అయితే ఏకంగా 27.8 శాతం ఖాళీలున్నాయి. సబ్ సెంటర్ల విషయంలో 2005 నాటికి గుజరాత్‌లో 7,274 ఉంటే 2015 నాటికి వాటిని 8,063కి పెంచారు. అంటే పదేళ్లలో 800 సబ్ సెంటర్లను మాత్రమే పెంచారు. అదే సమయంలో త్రిపురలో 532 నుంచి 1017కి దాదాపుగా రెట్టింపు చేశారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీ లను కూడా త్రిపుర ప్రభుత్వం దాదాపు రెట్టింపు చేసింది. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారికంగా చెప్పిన లెక్కలే. అంటే విద్యలోనే కాకుండా ప్రజారోగ్యం విషయంలోనూ త్రిపుర కమ్యూనిస్టు ప్రభుత్వ తీరుకు, గుజరాత్ బిజెపి పాలన సుదూరంలో ఉన్నట్టు కనిపిస్తోంది. ప్రజా సంక్షేమం విషయంలో కమ్యూనిస్టుల చిత్తశుద్ధికి ఇవి అద్దం పడుతున్నాయి.

కేంద్ర నేర గణాంకాల శాఖ వార్షిక నివేదిక ప్రకారం 2009లో త్రిపురలో నమోదైన 359 కేసుల విచారణ పూర్తి చేస్తే అది 2015కి వచ్చేసరికి 917కి చేరింది. త్రిపుర పోలీస్ విభాగం పని తీరుకు ఇది నిదర్శనం. అదే సమయంలో గుజరాత్‌లో 2009లో 2737 కేసుల పరిశోధన పూర్తి చేస్తే, అది 2015 నాటికి 611కి పడిపోయింది. పోనీ ఈ కాలంలో గుజరాత్‌లో నేరాల సంఖ్య తగ్గిందా అంటే నమోదైన కేసుల సంఖ్య 8.58 లక్షల నుంచి 8.97 లక్షలకు పెరిగింది. ప్రజలకు రక్షణ లేని స్థితిలో గుజరాత్ కనిపిస్తోందన్నది కేంద్ర ప్రభుత్వ తాజా నివేదిక చెప్తోంది. అయినా గుజరాత్ మోడల్ అంటూ మీడియాలో ఊదరగొట్టడం, కొన్ని బిల్డింగులు, కొద్దిమంది సాధించిన అభివృద్ధిని చూపించి అంతా బాగుందని చెప్పడానికి బిజెపి నేతలు ప్రయత్నిస్తున్నారు. వాటికి తోడు ఘర్షణలు, మత విద్వేషాలకు గుజరాత్ కేంద్రంగా నిలవడంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల పాత్ర అందరికీ తెలుసు. ఇక అదానీ, అంబానీల లాభాల కోసం గుజరాత్ ప్రభుత్వం కొన్ని చట్టాలను సైతం సవరించి, మరికొన్నింటిని విస్మరించి ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరించిందో అనేక మార్లు రుజువయ్యింది. కాలుష్యం కారణంగా కోస్తా గుజరాత్‌లో పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. కానీ త్రిపురలో మాత్రం దానికి పూర్తి భిన్నంగా వుంది. ప్రస్తుతం త్రిపురలో గుజరాత్ మాదిరిగా ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు కనిపించవు. అదే సమయంలో మత ఘర్షణలకు అవకాశం లేదు. సామాజిక విద్వేషం రగల్చడానికి చేస్తున్న ప్రయత్నాలను కూడా త్రిపుర ప్రభుత్వం సహించడం లేదని లెక్కలే చెబుతున్నాయి. 31.8 శాతం ఎస్టీలు, 17.8 శాతం ఎస్సీలు ఉన్న రాష్ట్రంలో సామాజిక సమతుల్యత కోసం త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఉపాధి హామీ పనుల కల్పనలో, కూలీ చెల్లింపుల్లో ఆదర్శంగా నిలుస్తోంది.

ఆలోచించాల్సిన సమయం

త్రిపుర ముఖ్యమంత్రి పాలనాదక్షతను ఏడీఆర్ సంస్థ తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. నిరుపేద ముఖ్యమంత్రిగా, నిజాయితీపరుడైన నేతగా సిపిఎం ముఖ్యమంత్రి పాలనాదక్షత అర్థమవుతోంది. చిన్న చిన్న పదవుల్లో ఉన్నవాళ్లే అవినీతి ఊబిలో కనిపిస్తుంటే సుదీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉండి, సాధారణ జీవితం గడుపుతూ నిరాడంబరతకు నిలువుటద్దంగా మాణిక్ సర్కార్ నిలిచారు. గుజరాత్‌లో మోడీ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రి ఏకంగా అనేక ఆరోపణలతో పదవిని త్యజించాల్సిన స్థితి ఉంటే, త్రిపురలో దానికి భిన్నమైన పరిస్థితి ప్రత్యామ్నాయ విధానాలను ప్రస్ఫుటంగా చాటుతోంది. అందుకే త్రిపుర, గుజరాత్‌లోని పాలనా తీరును గమనించిన తర్వాత ప్రజలకు ఉపయోగపడే విధానాల గురించి ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సి ఉంది. ప్రచార హోరులో ప్రజానుకూల విధానాల ఫలితాలను సామాన్యుడికి అర్థం కాకుండా చేయడానికి రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. మీడియా మొత్తం 'మోడియా'గా వ్యవహరిస్తోంది. సమస్యలు, పరిష్కారాలు కాకుండా, వ్యక్తులు, వ్యాఖ్యానాలతో గడుపుతోంది. ఈ నేపథ్యంలో ప్రజా పాలనా తీరును గమనించి, ప్రత్యామ్నాయ విధానాల పాలనా విశిష్టత గురించి వీలయిన మార్గాల్లో విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ✦

మాటకు మాట



✦ ఎర్రకోటలో కాషాయ ప్రభంజనం- త్రిపురపై బిజెపి కథనం
ఎవరి ఆశలు వారివి..కుప్పకూలేదాక కలలు కనొచ్చుగా!



✦ మీరు సూపర్- చంద్రబాబుతో ముఖేశ్ అంబానీ
సూపర్ డూపర్‌గా మీ ప్రయోజనాలు నెరవేరుస్తుంటారు కదా!



✦ ఆలయాల్లో అధిక ధరలు- శివరాత్రి వేడుకల వార్తా కథనాలు
ఆలయమంటేనే అధిక లాభాల పంట కదా.. శివశివా..



✦ ఎందులో ఎంత తిన్నామో చెప్పాలి- మంత్రి అయ్యన్న పాత్రుడు
చెప్పండి మరి...అది తిన్న వాళ్లకు కదా తెలుస్తుంది..



✦ టిడిపి ఎంపిలు సభ్యత నెరుగరు- సోము వీర్రాజు
అదే తెలిస్తే మీతో నాలుగేళ్లు వుంటారా ఏంటి?

✦ విభజన హామీలపై ఉధృత పోరాటం- మధు
అదేగా జనం మీ నుంచి కోరేది



✦ రాజీనామాలతో దశలవారి పోరాటం - జగన్
చాలా సార్లు అసలు దశ దాకా రాలేదనే డౌటు



✦ వైసిపి వి పిల్లిమొగ్గలు- టిడిపి
మీవి పొలిటికల్ మొగ్గులు

✦ మళ్లీ తెరపైకి రథయాత్ర: వార్త
ఎన్నికల వేళ కమలనాథులు ప్రయోగించే పాశుపతాస్త్రం

- పీపీ

జన వాక్యం

బాలల సంరక్షణ ఇలాగా!

బాలల సంరక్షణ కోసం రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జిల్లా స్థాయి బాలల సంరక్షణ కమిటీలు పని చేస్తాయి. ఈ కమిటీల నియామకం బాలల కోసం దశాబ్దాలుగా పనిచేస్తోన్న స్వచ్ఛంద సంస్థలను, బాలల హక్కుల కార్యకర్తలను నివ్వెరపరిచింది. బాలలతో సంబంధం లేని, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన లేని వారికి రాజకీయ ప్రమేయం గల వారికి వీటిలో అవకాశం కల్పించారనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలల సంరక్షణ కమిటీ చాలా బాధ్యతాయుతమైనది. ఇందులో పని చేసే వ్యక్తులు ముఖ్యంగా బాలలతో స్నేహ పూర్వకంగా మెలగాలి. అంతేకాదు, ఈ సంరక్షణ కమిటీ 24 గంటలూ నిరంతర జాగురూకతతో పిల్లల కోసం పని చేయాలి. అయితే ఇప్పుడు ఇంటర్వ్యూలో అర్హత పొందిన వారు కాక కొత్త వ్యక్తులు బాలల సంరక్షణ కమిటీలో చోటు దక్కించుకున్నారు. ఇందుకు ప్రధానంగా రాజకీయ ఒత్తిళ్లే కారణం. ప్రభుత్వాలు ఈ విధంగా ప్రవర్తించడం వల్ల బాలల సంరక్షణ గాలిలో దీపంగా మిగిలింది. ఇప్పటికే మన రాష్ట్రం బాల్య వివాహాలలో, బాలలపై అఘాయిత్యాలలో ముందు వరుసలో ఉంది. ఇక ఇటువంటి రాజకీయ కమిటీలతో ఏం సంరక్షణ సాధిస్తారు? ఈ అంశాన్ని మేధావులు, కార్యకర్తలు తీవ్రంగా పరిగణించాలి.


బి. కళ్యాణి,
బాలల హక్కుల వేదిక, విశాఖపట్నం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

జాకబ్ జుమా తిరుగుబాటు స్వరం!


అంతర్జాతీయం

పదవి నుంచి గౌరవప్రదంగా తప్పుకోవాలని దక్షిణాఫ్రికా పాలక కూటమి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) జాతీయ కార్యవర్గం చేసిన నిర్ణయాన్ని దేశాధ్యక్షుడు జాకబ్ జుమా తిరస్కరించటంతో అక్కడ తీవ్రమైన రాజకీయ సంక్షోభం ఏర్పడింది. సోమవారం రాత్రి ఆయనకు రెండురోజుల గడువు ఇస్తూ ఎన్ఎన్‌సి చేసిన తీర్మానాన్ని స్వయంగా పార్టీ నేతలు అందచేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే తప్పుకోమని కోరాం తప్ప గడువు విధించలేదని ఎఎన్‌సి ప్రధాన కార్యదర్శి ఏస్ మగాషులే మంగళవారం నాడు చెప్పారు. తాను రాజీనామా చేసేది లేదని ఏం చేసుకుంటారో చేసుకోండని జుమా ఎఎన్‌సి నేతలకు చెప్పినట్లు తాజా వార్తలు తెలిపాయి. జుమా బింకాలు పోతున్నాడా లేక నిజంగానే రాజీనామా చేయకుండా తొలగింపు వరకు తెచ్చుకుంటారా అన్నది చూడాల్సి వుంది. ఒక వేళ రాజీనామా చేస్తే ఉపాధ్యక్షుడిగా వున్న ఎఎన్‌సి అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా వెంటనే తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారు. తరువాత ఆయనను లేదా మరొకరిని పాలక పక్షం అధ్యక్షుడిగా ఎన్నుకుంటుంది. ప్రతిపక్ష ఎకనమిక్ ఫ్రీడమ్ పార్టీ జుమాపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం స్పీకర్ పరిశీలనలో వుంది. ఒకవేళ రాజీనామాకు తిరస్కరించినట్లయితే అది ఈ నెల 22న పార్లమెంట్‌లో చర్చకు రావచ్చు. దాన్ని పాలక పక్షం బలపరిచి 75 ఏళ్ల జుమాకు ఉద్వాసన పలకవచ్చని చెబుతున్నారు. లేదా పాలక పక్షమే మరొక తీర్మానం ప్రవేశ పెట్టవచ్చు. ఒకవేళ అదే జరిగితే ముందుగా తమ తీర్మానాన్ని చేపట్టాలని ఫ్రీడమ్ పార్టీ పట్టుబట్టవచ్చు. జాకబ్ జుమా రాజీనామా చేసి పదవి నుంచి తప్పుకోవాలని పాలక త్రిపక్ష కూటమిలోని దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఏసిపి) గత కొద్ది నెలలుగా డిమాండ్ చేస్తోంది. మరో పక్షమైన కార్మిక సంఘాల కూటమి (కొసాటు) కూడా రాజీనామా చేయాలని కోరింది. చివరకు ఎఎన్‌సి కార్యవర్గం సుదీర్ఘ తర్జనభర్జనల అనంతరం జుమా రాజీనామా కోరుతూ తీర్మానించింది.



ఎం కోటేశ్వరరావు

గత రెండు దశాబ్దాలలో ఎఎన్‌సి ఇద్దరు అధ్యక్షులను రాజీనామా చేయాలని కోరింది. 2008లో తాబో ఎంబెకీ పార్టీ ఆదేశాన్ని శిరసావహించి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో 2009లో జాకబ్ జుమా అధ్యక్షుడయ్యారు. ఈ ఇద్దరూ తమ రాజకీయ జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా ప్రారంభించి ఎఎన్‌సి నేతలుగా ఎదిగారు. చివరకు పార్టీ క్రమశిక్షణా చర్యలకు గురయ్యారు. జుమా పాలనలో అనేక అవినీతి ఆరోపణలు, ఆశ్రిత పక్షపాతం వంటి ఆరోపణలతో పాటు అనేక రంగాలలో వైఫల్యం కారణంగా 2016లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎఎన్‌సి అనేక పరాజయాలు చవిచూసింది. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పరువు ప్రతిష్టలు నిలబడాలంటే, కార్పొరేట్ వ్యతిరేక చర్యలు తీసుకొనేందుకు గాను జాకబ్ జుమా రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ముందుగా కమ్యూనిస్టు పార్టీ లేవనెత్తింది. దాంతో ఆగ్రహించిన జుమా



కమ్యూనిస్టు మంత్రి ఒకరిని మంత్రి వర్గం నుంచి తొలగించారు. జుమాపై చర్య తీసుకోని పక్షంలో తాము అధికార కూటమి నుంచి వైదొలుగుతామని, అవసరమైతే వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికలలో వంటరిగా పోటీ చేస్తామని కమ్యూనిస్టులు హెచ్చరించారు. వత్తిడికి తట్టుకోలేని జుమా తాను రాజీనామా చేస్తానని... అయితే అది మూడు నెలల్లోనో ఆరు నెలల్లోనో... తనకు ఇష్టమైనపుడు మాత్రమే చేస్తానంటూ మొరాయిస్తూ వచ్చాడు. అయితే డిసెంబరులో ఎఎన్‌సి పార్టీ అధ్యక్షుడిగా జుమాను తొలగించి సిరిల్ రాంఫోసా ఎన్నికైన తరువాత ఎఎన్‌సి కార్యవర్గం ఏదో ఒక నిర్ణయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దానిలో భాగంగానే పదవి నుంచి మర్యాదపూర్వకంగా తప్పుకోవాలని కోరింది. దానికి జుమా తిరస్కరించటంతో అల్టిమేటం జారీ చేయాల్సి వచ్చింది.

జాత్యహంకార పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరులో ఆయుధాలు పట్టిన జాకబ్ జుమా అనేక మంది ఇతర నేతల మాదిరిగానే జైలు పాలయ్యారు. యువనేతగా దేశం దృష్టిని ఆకర్షించిన ఆయన 1997లో ఎఎన్‌సి ఉపాధ్యక్షుడిగా, 1999లో దేశ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తరువాత ఐరోపా కంపెనీతో జరిగిన ఆయుధ లావాదేవీలలో చోటు చేసుకున్న అక్రమాలతో జుమాకు సంబంధం వున్నట్లు ఆరోపణలు వచ్చాయి. జుమా ఆర్థిక సలహాదారు నిందితుడిగా తేలాడు. జుమా 2005లో పదవీచ్యుతుడయ్యాడు. తానెలాంటి అక్రమాలకు పాల్పడలేదని, అధ్యక్షుడు తాబో ఎంబెకీ అక్రమాలను వ్యతిరేకించినందుకు తనను కేసులలో ఇరికించారని చేసిన వాదనలను ఏఎన్‌సి నాయకత్వం విశ్వసించింది. దాంతో ఎంబెకీని రాజీనామా చేయించి ఆ స్థానంలో జుమాను 2009లో అధ్యక్షుడిగా నియమించారు. ఇటీవల జుమాపై 18 అంశాలలో వచ్చిన అవినీతి, ఆరోపణలపై విచారణను ఎదుర్కోవాల్సిందేనని ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయన్స్ దాఖలు చేసిన కేసులో సుప్రీం కోర్టు గతేడాది స్పష్టం చేసింది. తాను అమాయకుడిని అన్న జుమా వాదనను కోర్టు కొట్టివేసింది. డిసెంబరు 13న ఇచ్చిన తీర్పులో జుమా, అతని అనుచరులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆమేరకు జనవరిలో ఒక కమిషన్ ఏర్పడింది. ఒక అవినీతి నివేదికను తొక్కిపెట్టటంలో జుమా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు మరో కేసులో న్యాయస్థానం స్పష్టం చేసింది. భారతీయ సంతతికి చెందిన గుప్తా కుటుంబం జుమాతో వున్న సంబంధాలను ఉపయోగించుకొని అనేక ప్రభుత్వ కాంట్రాక్టులను పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కోర్టు తీర్పుల తరువాత వారం రోజులకే డిసెంబరు 18న జుమాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి సిరిల్ రాంఫోసాను ఎన్నుకున్నారు. ఉద్వాసనకు గురికానట్లయితే మరొక పద్నాలుగు నెలలపాటు జుమా అధికారంలో వుండవచ్చు. అక్కడి రాజ్యాంగం ప్రకారం ఒకరు రెండు విడతలు మాత్రమే పదవికి అర్హత వుంటుంది.

1994లో శ్వేత జాతి పాలన అంతమైన తరువాత ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అనుసరించినవి స్థూలంగా నయా ఉదారవాద విధానాలు తప్ప మరొకటి కాదు. పర్యవసానంగా జనంలో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. ఎఎన్‌సి కూటమి జాత్యహంకార పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఒక విశాల వేదిక మాత్రమే. జాత్యహంకార పాలన అంతమై జాతీయ ప్రజాస్వామిక విప్లవ సాధన దిశగా ఎఎన్‌సి పోరాడింది. జాతీయ ప్రజాస్వామిక విప్లవదశ 1994లో అంతమైంది. తరువాత ఎఎన్‌సిలో కమ్యూనిస్టు పార్టీ, కొసాటో కొనసాగటమే కొత్త పరిణామం. పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగించాలనే ఎఎన్‌సి నాయకత్వం కుడివైపు, మిగతా రెండు పక్షాలు ఎడమవైపు లాగినప్పటికీ అంతిమంగా మొగ్గు కుడివైపే వుంది. వివిధ ఎన్నికలలో తగిలిన ఎదురుదెబ్బలు, పలు తరగతులలో పెరుగుతున్న అసంతృప్తి కారణంగా కమ్యూనిస్టు పార్టీలో పునరాలోచనలో పడింది. ఎఎన్‌సి నుంచి విడగొట్టుకోవాలనే ఆలోచన దానిలో ప్రారంభమైంది. పార్టీలు వేర్వేరుగా వున్నప్పటికీ చట్టసభలకు ఎఎన్‌సి గుర్తు మీదనే మూడు పక్షాలూ పోటీ చేస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల నాటికి ఈ కూటమి ఇలాగే వుంటుందా అన్నది ఒక పెద్ద ప్రశ్న. తాము వచ్చే ఎన్నికలలో విడిగా పోటీ చేస్తామని కమ్యూనిస్టు పార్టీ నాయకులు చెబుతున్నారు. కింది శాఖలలో అలాంటి చర్చను అనుమతిస్తున్నారు. రానున్న ఎన్నికలలో విడిగా ప్రచారం చేయాలని కమ్యూనిస్టు పార్టీ మహాసభ గతేడాది నిర్ణయించింది. అవసరమైతే వచ్చే ఎన్నికలలో విడిగా పోటీ చేసే దిశలో ఇదొక అడుగుగా చెప్పవచ్చు. ఎఎన్‌సి పాలనలో అవినీతికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు గళమెత్తుతున్నారు. తొమ్మిది సంవత్సరాల క్రితం ఏ కమ్యూనిస్టు పార్టీ జాకబ్ జుమాను బలపరిచిందో అదే పార్టీ అతడిని తొలగించాలని ముందుగా గళమెత్తింది. అనేక అంశాలపై పార్టీ విబేధిస్తున్నది. అందువలన వచ్చే ఎన్నికల నాటికి అది దేశాన్ని నడిపించేందుకు తనదైన పంథాలో పయనిస్తుందా అన్నది ఆసక్తి కలిగించే అంశం. అదే అయితే కమ్యూనిస్టు పార్టీ, కొసాటు ఒకవైపు, ఎఎన్‌సి మరోవైపు అధికారం కోసం పోటీపడినా ఆశ్చర్యం లేదు. ✦



క్యాప్సికంతో క్యా బాత్ హై

క్యాప్సికం అంటే టమాటా, క్యాప్సికంతో చేసే కూరలే గుర్తొస్తాయి. ఎప్పుడూ ఒకే రుచిని ఆస్వాదిస్తే ఏం మజా ఉంటుంది! అప్పుడప్పుడు హోటళ్లలో మాత్రమే వండే రుచులను మన ఇంట్లోనూ వండి రుచి చూసేయాలి. అందుకే తక్కువ సమయంలో ఇంట్లో చేసుకోగల క్యాప్సికం రుచులను మీకోసం ఇస్తున్నాం. మీరూ ప్రయత్నించండి.

దోకియా

కావలసిన పదార్థాలు: దోక్లాపిండి- కప్పు, పెరుగు- రెండు కప్పులు, ఉప్పు- అర స్పూన్, మిఠాయి దానే-పావు స్పూన్, గ్రీన్ క్యాప్సికమ్ - 8-10, గ్రీన్‌చిల్లీ పేస్ట్ - టీస్పూన్, అల్లంపేస్ట్- అర స్పూన్, పంచదార రెండు స్పూన్‌లు, నిమ్మరసం రెండు టీస్పూన్‌లు, తరిగిన కూరగాయ, ముక్కలు- అరకప్పు, నూనె- రెండు టీస్పూన్‌లు, ఆవాలు- స్పూన్, కరివేపాకు- తగినంత



తయారుచేసే విధానం: దోకలా పిండి, పెరుగుతోపాటు ఉప్పు, మిఠాయిదానే కలిపి నాలుగంటల పాటు అలా వదిలేయండి. నూనె వేడిచేసి ఆవాలు, కరివేపాకు వేసి వేయించండి. మిగిలిన అన్నిపదార్థాలు ఒక్కొక్కటిగా కలిపేయండి. ఆవిరిపై ఉడికే విధంగా మూత పెట్టి ఉంచండి.


గిల్డ్ క్యాప్సికమ్ లబబ్దార్

కావలసిన పదార్థాలు: క్యాప్సికమ్- పావుకిలో, టమాటాలు- పావుకిలో, ఉల్లిపాయలు- 100గ్రా., అల్లంవెల్లుల్లిముద్ద- టీస్పూను, నూనె- 4 టేబుల్‌స్పూన్లు, కారం- అర టీస్పూను, దనియాలపొడి- పావు టీస్పూను, గరంమసాలా- పావు టీస్పూను, జీలకర్ర- పావు టీస్పూను, ఎండుమిర్చి-మూడు, ఉప్పు-తగినంత.



తయారుచేసే విధానం: క్యాప్సికమ్‌లను శుభ్రంగా కడిగి, పొడిబట్టతో తుడిచేయాలి. తరవాత వాటికి నూనె పట్టించి గ్యాస్ మంటపై నల్లగా అయ్యేవరకూ కాల్చాలి. ఇప్పుడు వీటిని ఓ గిన్నెలో వేసి క్లింగ్ ఫిల్మ్ (ఆహారపదార్థాలను కప్పి ఉంచే ప్లాస్టిక్ కాగితం)తో ఆ గిన్నెను కప్పేసి పదినిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత అందులో నుంచి క్యాప్సికమ్‌లను బయటకు తీసి, నల్లగా కాలిన పొరను చాకుతో తీసేయాలి. గింజలూ తీసేసి క్యాప్సికమ్‌ను ముక్కలుగా కోయాలి. టమాటాలను గుజ్జులా చేయాలి. నాన్‌స్టిక్ పాన్ తీసుకుని నూనె వేసి కాగాక, ఉల్లిముక్కలు వేసి బంగారువర్ణంలో వేయించాలి. తరవాత అల్లంవెల్లుల్లి, కారం, ధనియాలపొడి వేసి కాసేపు వేయించాలి. ఇప్పుడు టమాటా గుజ్జు, ఉప్పు వేసి నూనె బయటకు వచ్చేవరకూ ఉడికించాలి. తరువాత క్యాప్సికమ్ ముక్కలు వేసి మరికాసేపు ఉడికించాలి. చిన్నపాన్‌లో నూనె వేసి జీలకర్ర, ఎండుమిర్చితో తాలింపు చేసి, గ్రేవీలో కలపాలి. చివరగా గరంమసాలా కూడా చల్లి, దించాలి.

పలావు



కావలసిన పదార్థాలు : పొడిగా ఉడకబెట్టుకున్న అన్నం- కప్పు, క్యాప్సికం పెద్దవి - రెండు, ఉల్లిపాయ - ఒకటి, జీడిపప్పు, బాదం- నాలుగు, బటర్ - రెండు టేబుల్ స్పూన్లు


రైస్ మసాలా కోసం: వేరుశనగలు- రెండు టేబుల్ స్పూన్లు, ధనియాలు- రెండు టేబుల్ స్పూన్లు, మినపప్పు - టేబుల్ స్పూన్, ఎండుమిర్చి- నాలుగు, జీలకర్ర, ఆవాలు- టేబుల్ స్పూన్ (అవసరమైతే)

తయారుచేసే విధానం : పాన్‌ని కొంచెం వేడి చేశాక అందులో మనం తీసిపెట్టుకున్న మసాలా దినుసులను వేసి, వేయించుకోవాలి. అవి చల్లారిన తర్వాత వాటిని మెత్తగా నూరుకోవాలి. క్యాప్సికం, ఉల్లిపాయలను తరిగి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద పాన్ పెట్టుకొని, కొంచెం వేడిచేసిన తర్వాత అందులో రెండు టేబుల్ స్పూన్ల బటర్‌ని వేసి కరగబెట్టాలి. అందులో ఉల్లిపాయ ముక్కల్ని వేసి వేయించాలి. అందులో కరివేపాకు, క్యాప్సికం వేసి మూడు నిమిషాలపాటు వేయించాలి. తర్వాత జీడిపప్పు, బాదం వేసి, అందులో రుచికి సరిపడా ఉప్పువేసుకోవాలి. వీటన్నింటినీ మూడు నిమిషాలపాటు ఫ్రై చేసుకోవాలి. క్యాప్సికం ముక్కలు మెత్తబడిన తర్వాత అందులో ముందుగా రెడీచేసి పెట్టుకున్న మసాలా పొడిని వేసుకోవాలి. సిమ్‌లో పెట్టి మూడు నిమిషాలు ఫ్రై చేయాలి. ముందుగా ఉడకబెట్టుకొని చల్లార్చిన అన్నాన్ని అందులో కలుపుకోవాలి. అన్నం ఆ మిశ్రమంలో బాగా కలిసేలా తిప్పి, మూడు నిమిషాలు ఉడకనివ్వాలి. అందులో కొంచెం కొత్తిమీర తరుగు వేసి, స్టవ్ ఆపేయాలి. అంతే ఘుమఘుమలాడే క్యాప్సికం రైస్ రెడీ. అన్నం మిగిలినప్పుడు ఇలా చేసుకొని తింటే వెరైటీగానూ రుచిగానూ ఉంటుంది.

ఎదురొస్తే... కీడా?!

మనిషి వివేకం నుంచి పుట్టిన శ్రమ ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికి అతనిని నాగరికునిగా తీర్చిదిద్దుతోంది. కానీ కొన్నిరకాల నమ్మకాలు మనిషికి విచక్షణ ఉందా? అని సందేహించేలా చేస్తుంటాయి. ఆధునికమైన వేషభాషలతో ఉన్నవారూ మూఢ నమ్మకాల ఊబి నుంచి బయటపడలేకపోవడమే కాకుండా రకరకాల అసత్యాలతో అది సైన్సే అనే విధంగా మిగిలినవారిని నమ్మిస్తుండడం నిత్యకృత్యమైపోయింది.

చాలా మందికి తాము ఎక్కడికైనా, ఏపనిమీదైనా వెళ్లేటప్పుడు ఎదురుపడిన వారిని బట్టీ ఫలితం ఉంటుందనే నమ్మకం ఉండడం చూస్తుంటాం. ఎక్కడికైనా వెళ్తున్నా లేదా ఒకచోట కూర్చొని ఉన్నా ఎదురుగా పిల్లి / నల్లపిల్లి కన్పిస్తే చాలా కీడు జరిగిపోతుందని కొందరు భయంతో వణికిపోతుంటారు. ఇది చాలా ప్రాంతాల్లో బలంగా స్థిరపడిపోయింది. ఈ మూఢనమ్మకాన్ని చాలామంది అనుసరిస్తుంటారు. ఎక్కడికైనా బయలుదేరినప్పుడు పిల్లి ఎదురొస్తే చెడు జరుగుతుందని నమ్ముతారు. ఇది ఎంతలా అంటే తాము ఎక్కాల్సిన బస్సు టైమ్ దగ్గర పడుతున్నా కొంత సమయం ఆగాకే బయల్దేరుతుంటారు. అలాంటప్పుడు ఒక్కోసారి బస్సునూ మిస్సయిపోతుంటారు. అప్పుడసలు పనే జరగదు కదా?! అసలు ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదు. కాకపోతే ఇంట్లో పాలు, పెరుగు మనం ఏమరుపుగా ఉన్నప్పుడు స్వాహా చేస్తుంది. అంతేతప్ప, అంతకన్నా నష్టమేమీ లేదు. పైగా అది ఉండడం వల్ల ఎలుకల బెడద ఉండదు. చాలామంది రైతులు పిల్లుల్ని అందుకోసమే మాలిమి చేసుకుంటారు. పాశ్చాత్య దేశాల్లో ఇది పెంపుడు జంతువు కూడా. నష్టం కలిగితే వారందరికీ కలగాలి కదా?!



ఎప్పుడూ ఎదురు పడకుండా ఉండాలని భావించేవారి జాబితాలో ఒంటరి మహిళలూ ఉన్నారు. భర్త చనిపోయిన మహిళ చాలా కీడు తీసుకొస్తుందనీ, ఆమె ఎదురొస్తే హాని జరుగుతుందనీ ఎన్నో మూఢనమ్మకాల్ని ప్రచారం చేస్తుంటారు. దేశంలో వీరి పట్ల జంతువుల కంటే దారుణంగా చాలామంది వ్యవహరిస్తుంటారు. ఒంటరి మహిళలు ఎటువంటి ఆభరణాలు ధరించడానికి అనుమతి లేదనీ, ఆమె జీవితాంతం తెల్ల దుస్తులు మాత్రమే ధరించాలనీ నియమ నిబంధనలు పెడుతుంటారు. ఆమె కారం, పులుపు, మసాలా ఆహారాలు తినకూడదనీ, శాకాహారం మాత్రమే తినాలనే నియమాలు అమలు చేస్తుంటారు. ఇది అమానుషం. ఇదంతా ఇటీవల కొందరు బ్రేక్ చేస్తున్నారు. వాళ్లూ రంగుచీరలు కడుతున్నారు. అందరితోపాటే ఆహారం తీసుకుంటున్నారు. ఆమేరకు అలాంటివారిని అభినందించాలి, ఆహ్వానించాలి. ఇంకా చేతనైతే అలాంటివారికి అండగా నిలవాలి.

తమకు ఎదురుపడేవారిలో కొంతమంది చూపుల్లో చెడు ఉంటుందనీ, అది చాలా హాని కలిగిస్తుందనే మూఢనమ్మకం చాలామందిలో ఉంటుంది. కొందరి కళ్ళు చెడు కలిగిస్తాయనే ప్రచారాన్నీ వారంతా నమ్ముతుంటారు. తమను చూసి ఎదుటివారు అసూయపడడం, లేదా ఎక్కువగా ప్రశంసించడం ద్వారా చెడు చూపులు ప్రసరించి తమకు కీడు కలుగుతుందని భావిస్తుంటారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు కలిగితే అందువల్లే అని అనుమానిస్తుంటారు. ఇదంతా అపోహ మాత్రమే. ఎవరికీ అలాంటి అతీంద్రియశక్తులు ఉండవు. ఎవరి కళ్లూ, చూపులు నష్టం కలిగించేదీ ఉండదు. ఇలాంటి బలహీనతల్నే ఆసరాగా చేసుకుని రకరకాల యంత్రాలు, దిష్టికాయలు, ఉంగరాలు అమ్ముతూ బాగా సొమ్ము చేసుకునే మోసగాళ్లు మనచుట్టూనే ఉన్నారు. మనం వీటి నుండి బయటపడకుండా టీవీ మాధ్యమం కూడా గంటల గంటలు వీటిని ఊదరగొట్టి, ఆలోచనల కాలుష్యాన్ని పెంచుతున్నాయి. వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

విచక్షణతో గుర్తిస్తే

ఎదురుకావటం అనేది సహజమైన విషయమే. దీనికీ చేసే పనులకూ ఎలాంటి సంబంధమూ ఉండదు. చేసేపనిపై అంచనా, ప్రణాళిక, ఆచరణ, అంకితభావం ఉంటే చాలు.. ఫలితాలు సాధించవచ్చనేది శాస్త్రీయంగా రుజువైన విషయం. ఒకవేళ ఫలితం రాకపోతే, పొరపాటు ఎక్కడో తెలుసుకోవాలి.. ఆమేరకు సరిజేసుకోవాలి. అంతేకాని మూఢత్వంలో కొట్టుకుపోకూడదు. గుండెపోటు వచ్చినప్పుడు పిల్లి ఎదురైందని ఆసుపత్రికి వెళ్లకపోతే ప్రాణమే పోతుంది. ఇలాంటప్పుడు ఆచరణలో మూఢత్వానికి పక్కనపెట్టేవారే ఎక్కువ. అందుకే సమాజంలో సంఘజీవులుగా అందరం సమానమనే భావనతో సత్సంబంధాలతో మెలగాలి. ఆ మార్పే మనలో రావాల్సింది. ఆ వైపుకే అడుగులు వేద్దాం. ★

చపాతీ క్యాప్సికమ్ రోల్స్

కావలసిన పదార్థాలు: గోధుమ పిండి- రెండుకప్పులు, క్యాప్సికమ్- రెండు (సన్నగా నిలువుగా కట్ చేసి పెట్టుకోవాలి), టమాటాలు- రెండు (ముక్కలుగా చేసుకోవాలి), ఉల్లిపాయ(పెద్దది)- ఒకటి (ముక్కలుగా చేసుకోవాలి), పచ్చిమిర్చి- రెండు (ముక్కలుగా చేసుకోవాలి), మిరియాల పొడి- టేబుల్ స్పూను, జీలకర్ర పొడి- టేబుల్ స్పూను, పసుపు- అర టీ స్పూను, టమాటా కెచప్- టేబుల్ స్పూను, ఉప్పు- రుచికి సరిపడ, నీరు- తగినంత, నూనె- తగినంత.

తయారుచేసే విధానం: ముందుగా గోధుమపిండిలో ఉప్పు వేసి మెత్తగా తడిపి, పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేసి కాగిన తరువాత పచ్చిమిరపకాయలు, ఉల్లిపాయలు వేసి బాగా వేగనివ్వాలి. అనంతరం క్యాప్సికమ్, టమాటా ముక్కలూ వేసి కొద్దిసేపు ఉడికించాలి. అవసరం అనుకుంటే కొద్దిగా నీరు పోసి ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. దించే ముందు జీలకర్ర పొడి, ఉప్పు, టమాటా కెచప్ వేసుకొని, కొద్దిసేపు పొయ్యి మీద ఉంచి దించేయాలి. ఇప్పుడు తడిపి పెట్టుకున్న పిండితో చపాతీలు వొత్తుకోవాలి. చపాతీని కాల్చిన తరువాత ఒకవైపు సిద్ధం చేసి పెట్టుకున్న క్యాప్సికమ్ కర్రీని పెట్టి రోల్స్‌గా చుట్టుకోవాలి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా లేదా మధ్యాహ్నం లంచ్‌బాక్స్‌లోకి ఇవి భలే రుచిగా ఉంటాయి.



పనీర్ మసాలా

కావలసిన పదార్థాలు : ఉల్లిపాయ తరుగు - ముప్పావు కప్పు, అల్లం-వెల్లుల్లి పేస్టు- టీస్పూను, టమాటా తరుగు- కప్పు, పనీర్ తరుగు- ముప్పావు కప్పు, క్యాప్సికం తరుగు (పెద్ద ముక్కలు)- కప్పు, జీడిపప్పులు- ఆరు, ఉప్పు- తగినంత.

మసాలా పొడికి: పసుపు- పావు టీస్పూను, కారం, గరం మసాలా పొడి- ఒక్కో టీస్పూను చొప్పున, ధనియాలపొడి- ఒకటిన్నర టీస్పూను.

సీజనింగ్‌కు: నూనె- ఒకటిన్నర టేబుల్‌స్పూను, జీలకర్ర- టీస్పూను.

తయారుచేసే విధానం : జీడిపప్పుల్ని వేడినీళ్లల్లో పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తర్వాత కొన్నినీళ్లు పోసి, వాటిని గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడిచేసి జీలకర్ర, ఉల్లి తరుగు వేసి బంగారురంగుకి వచ్చేవరకూ వేయించాలి. తర్వాత అల్లంవెల్లుల్లి పేస్టు వేసి కాసేపు వేయించాలి. టమాటా ముక్కలు, పసుపు, ధనియాలపొడి, కారం, గరంమసాలా పొడి వేసి కలపాలి. టమాటాలు ఉడికాక క్యాప్సికం ముక్కలు ఉడికించాలి. ఆ తర్వాత పనీర్ ముక్కలు వేసి మసాలాలో అవి కలిసే వరకూ వేయించాలి. తర్వాత జీడిపప్పు పేస్టు వేసి, ఐదు నిమిషాలు ఉంచి కప్పు నీళ్లు పోసి ఉడికించాలి. తర్వాత స్టవ్ మీద నుంచి పాన్‌ను దించి, కొత్తిమీర తరుగు చల్లాలి. పరాఠా, నాన్, పులావ్, రోటీలతో రుచిగా ఉంటుంది.



కూరకే రుచి తెస్తుంది

క్యాప్సికం మంచి కూరగాయ. దీనిలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. ఫైబర్, ఫోలిక్ యాసిడ్ కూడా ఎక్కువగా ఉంటాయి. దీని కాంబినేషన్‌లో ఏ కూరైనా చాలా రుచిగా ఉంటుంది.



- జానకి బడుగు
పోషకాహార నిపుణులు

కాఫీతో మరింత కాలం!

అందరూ హాయిగా జీవించాలనే కోరుకుంటారు. ఒత్తిడితో బాధపడేవారికైతే ఈ కోరిక కాస్త ఎక్కువగానే ఉంటుంది. అయితే కాఫీ వ్యాధిగ్రస్తులకు ఉపయోగం అంటున్నారు పరిశోధకులు. ముఖ్యంగా తీవ్రమైన కిడ్నీవ్యాధితో బాధపడేవారికి మరింత మంచిదని చెబుతున్నారు. పరిశోధనల్లో భాగంగా వచ్చిన ఫలితాలను గమనిస్తే కాఫీ ఎక్కువగా తాగేవారిలో 24 శాతం వరకూ మరణించే అవకాశాలు తగ్గే అవకాశాలు కనిపించినట్లు తెలిసింది. ఒక మోస్తరుగా తాగే వారికైతే 12 నుంచి 22 శాతం వరకూ తగ్గొచ్చని చెబుతున్నారు పరిశోధకులు. అయితే ఈ ఫలితాలు కిడ్నీ వ్యాధి ఉన్నవారికే ఎక్కువగా వర్తింపజేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది చాలా సులువైన మార్గమే కాకుండా చికిత్స పరంగా ఫలితాలనిచ్చిందని పోర్చుగల్‌లోని సెంట్రల్ హాస్పిటల్ లిస్బో నార్‌కి చెందిన డాక్టర్ మైగ్యువల్ బిలోట్టే వియెరా అన్నారు. అయితే దీని గురించి మరింత అధ్యయనం చేసి, వైద్యపరంగా కచ్చితమైన నిర్ధారణలు రావాల్సి ఉంది. అందుకు మరికొంత సమయం పడుతుందనీ వారు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ కాఫీ వల్ల సికెడి వారికి మేలు చేకూరే అవకాశం ఉంటుందంటే సంతోషకరమైన విషయమే. అమెరికన్ కెమికల్ సొసైటీ జర్నల్ ఆఫ్ నేచురల్ ప్రొడక్ట్స్ వారు చెప్పిన ప్రకారం కాఫీ తాగడం వల్ల డయాబెటీస్ సమస్య రాకుండా చేసుకోవచ్చని తెలుస్తుంది. ★



మహిళా స్వావలంబనే లక్ష్యం



ప్రభుత్వాలు మహిళలకు అది చేస్తాం... ఇది చేస్తున్నాం... అని ప్రచారానికి ఖర్చు చేసే మొత్తంలో వాస్తవంగా వెచ్చిస్తున్నది చాలా స్వల్పమే. అంతేకాదు, చదువుకున్న వాళ్లంతా పట్టణాలు, నగరాల్లో ఉండి తమపని తాము, తమ జీవితం తాము చూసుకుంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారికి ఎవరు సహకారం అందిస్తారు..? వారి బతుకులు ఎప్పుడు బాగుపడుతాయి..? వారి జీవితాల్లో మార్పు ఎప్పుడు వస్తుంది..? రాదు కదా? అవును, రాదు. సరిగ్గా ఇలా ఆలోచించాడు కాబట్టే ఆ యువకుడు పెద్ద కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారి బాగు కోసం తాను చేస్తున్న ఉద్యోగాన్నీ వదిలిపెట్టేశాడు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు.



అతని పేరు నీల్ కామత్. బెంగళూరు వాసి. ముంబైలో లార్సన్ అండ్ టూబ్రో అనే పెద్ద కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. విలాసవంతమైన జీవితం, కష్టాలు లేని జీవనం గడుపుతున్నా నీల్ కామత్‌కు ఏదో లోటుగా అనిపించేది. మనమంతా పట్టణాలు, నగరాల్లో ఉండి మన బతుకు మనం బతికితే గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారిని ఎవరు పట్టించుకుంటారు..? అన్న ఆలోచన అతనికి వచ్చింది. వెంటనే చేస్తున్న ఉద్యోగానికి స్వస్తి పలికాడు. తన సొంత ప్రాంతానికి తిరుగు ప్రయాణమయ్యాడు. అలా అతను బెంగళూరు వచ్చేశాడు. ఆ తరువాత ఎస్‌బీఐ యూత్ ఫర్ ఇండియా, బేర్ ఫుట్ కాలేజీ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఒక ప్రాజెక్టులో సేవలు అందించడానికి చేరాడు. కొన్నినెలల తర్వాత అతను ఆ ప్రాజెక్టులో భాగంగా ఉత్తరాఖండ్, కేరళ ప్రాంతాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాడు.



అక్కడ ఉండే మహిళలకు తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించాడు. తేనెటీగలను ఎలా పెంచాలి? ఎన్ని రోజులకు తేనె వస్తుంది? వాటి సంరక్షణ ఎలా? అనే పలు అంశాలపై అతను తోటి వాలంటీర్లతో కలిసి మహిళలకు శిక్షణ ఇస్తున్నాడు. దీంతో ఇప్పుడు అక్కడి మహిళలు విజయవంతంగా తేనెటీగలను పెంచుతున్నారు. త్వరలో వారు తేనె తీసి, విక్రయాలూ ప్రారంభించనున్నారు. అయితే నీల్ కామత్ ఇక్కడితో ఆగనని, ఇంకా ఎంతోమందికి ఇలాంటి సేవలందిస్తానని చెబుతున్నాడు. అతని ఆశయం తప్పకుండా నెరవేరాలని ఆశిద్దాం. ★

జీవన సౌరభం

ఓడి పోయావని ఆగిపోకు.. తిరిగి ప్రయత్నిస్తే విజయం నీదే.

మీ కోసం

పూరీపిండిలో కొంచెం చక్కెర కలిపితే చాలా సేపటివరకూ తాజాగా ఉంటాయి.



సెన్సెక్స్ ↓ 145
34,155

నిఫ్టీ ↓ 39
10,500

రూపాయి ↑ 23 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.08

ఉచిత
వైద్య సహాయం..

అటవీ సిబ్బందికి ఉచిత వైద్యం కోసం అపోలో హాస్పిటల్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని కొణిదెల, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ సిఇఒ కరణ్ భల్లా ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు 18 రాష్ట్రాల్లోని అడవుల్లో ప్రత్యక్షంగా పని చేస్తున్న అటవీ సిబ్బందికి ఉచిత వైద్య సహాయం అందించనున్నారు.



జాగ్గల్ ప్రచారకర్తగా పాండ్యా

పేమెంట్స్, గ్రూపు డైనింగ్ కంపెనీ జాగ్గల్ తమ ప్రచారకర్తగా ప్రముఖ క్రికెటర్ హార్థిక పాండ్యాను నియమించుకుంది. ఆ కంపెనీ డైనింగ్ డీల్స్, కార్పొరేట్ కార్డులు, రివార్డులు, లాయల్టీ సిస్టమ్‌లకు పాండ్యా ప్రచారం చేయనున్నారు. జాగ్గల్‌కు దేశ వ్యాప్తంగా 25 లక్షల ఖాతాదారులున్నారు.



బ్యాంకింగ్ షేర్ల కుదేలు

సెన్సెక్స్ 145 పాయింట్ల పతనం

ముంబయి : మొండి బాకీల పరిష్కారానికి ఆర్‌బిఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలు బ్యాంకింగ్ షేర్లపై ఒత్తిడిని పెంచాయి.మరోవైపు పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,300 కోట్ల పైగా కుంభకోణం చోటు చేసుకోవడంతో ఆ సూచీ అమాంతం పడిపోవడంతో పాటు ఇతర బ్యాంకింగ్ సూచీలను ప్రభావితం చేసింది. ఈ పరిణామాల మధ్య బుధవారం నిఫ్టీలో పిఎస్‌యు బ్యాంకింగ్ సూచీ 4.8 శాతం పడిపోయింది. 2018లో బ్యాంకింగ్ సూచీ ఈ స్థాయిలో పడిపోవడం ఇది రెండో సారి. ఇది వరకు కేంద్రం పిఎస్‌బిలకు రూ.88వేల కోట్ల మూలధనం మాత్రమే సమకూర్చగలమని ప్రకటించడంతో జనవరి 25న బ్యాంకింగ్ సూచీ అత్యధికంగా 5.2 శాతం తగ్గింది. తాజాగా పిఎన్‌బి, బ్యాంకు ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్, అలహాబాద్ బ్యాంకు, కెనరా బ్యాంకు సూచీలు 5 శాతం పైగా విలువ కోల్పోయాయి. ఒక్క పిఎన్‌బినే 10 శాతం మేర నష్టపోయి రూ.146కు దిగజారింది.

బ్యాంకు సూచీల పతనానికి తోడు యూరోపియన్‌లో బలహీన పరిణామాలు చోటు చేసుకోవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 144.52 పాయింట్లు లేదా 0.42 శాతం తగ్గి 34,155.95కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 38.85 పాయింట్లు లేదా 0.37 శాతం తగ్గి 10,500.90కు దిగజారింది. బిఎస్‌ఇలో రంగాల వారిగా పిఎస్‌యు సూచీ 1.8 శాతం, బ్యాంకింగ్ 1.62 శాతం, వైద్య 0.69 శాతం, విద్యుత్ 0.68 శాతం చొప్పున నష్టపోయి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. మరోవైపు కాపిటల్ గూడ్స్ సూచీ 0.33 శాతం, రియాల్టీ 0.19 శాతం, మౌలిక వసతులు 0.12 శాతం, లోహ 0.02 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్‌లో కోల్ ఇండియా, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, రిలయన్స్, విప్రో షేర్లు అధిక లాభాలు సాధించగా, యస్ బ్యాంకు, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంకు, ఓఎన్‌జిసి, సన్‌ఫార్మా సూచీలు అధిక నష్టాలు చవి చూశాయి.

ఇరాన్‌లో ఒవిఎల్ భారీ పెట్టుబడులు..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఒఎన్‌జిసి విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్) ఇరాన్‌లోని పెర్షియన్ గల్ఫ్‌తో కలిసి ఫర్జాద్ బి గ్యాస్ ఫీల్డ్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధం అవుతోంది. ఈ సంస్థలు టెహ్రాన్‌లో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో ఒవిఎల్ రూ.6.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సిద్ధం కాగా ధరల వద్ద సందిగ్ధం నెలకొంది. ఆ దేశం ఈ పెట్టుబడులకు అమోదం తెలపాల్సి ఉంది.

జిఎంఆర్ ఇన్‌ఫ్రాకు 566 కోట్ల నష్టాలు

క్యూ3లో తగ్గిన ఆదాయం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.565.94 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. 2016-17 ఇదే క్యూ3లో రూ.643.44 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,295.83 కోట్లకు పడిపోయింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.2,587.26 కోట్ల ఆదాయం నమోదు చేసింది. గత త్రైమాసికంలో కంపెనీ మొత్తం వ్యయం రూ.2,623.74 కోట్ల నుంచి రూ.2,487.90 కోట్లకు తగ్గింది.

గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీగా ఉన్న జిఎంఆర్ గ్రూపు ప్రస్తుతం విమానాశ్రయాలు, ఇంధన, రవాణ, పట్టణ మౌలిక వసతుల రంగంలో వ్యాపారాలు కలిగి ఉంది. హైద రాబాద్, న్యూఢిల్లీ, మట్కాన్, గోవాలో విమానాశ్రయాల నిర్వహణ చేస్తోంది. స్మార్ట్‌సిటీల ఏర్పాటులోనూ భాగ స్వామ్యం అవుతుంది. బుధవారం బిఎస్‌ఇలో జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ షేర్ 1.75 శాతం తగ్గి రూ.19.70 వద్ద ముగిసింది.



నిరాశపర్చిన సన్ ఫార్మా

ప్రముఖ ఔషధ ఉత్ప త్తుల కంపెనీ సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ 2017-18 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో పేలవ మైన ఆర్థిక ఫలితాలు ప్రక టించింది. ఈ త్రైమాసికంలో బ్యాంకు నికర లాభాలు 75 శాతం పడిపోయి రూ.365 కోట్లకు పరిమితమ య్యాయి. కంపెనీ అమ్మకాలు 35 శాతం క్షీణించి 328 మిలియన్ డాలర్లకు తగ్గాయి. అమెరికా అమ్మకాల్లో 14 శాతం తగ్గి రూ.6590 కోట్లకు క్షీణించాయి. ఈ ప్రభావం కంపెనీ ఆర్థిక ఫలి తాలపై ప్రభావం చూపింది. బుధవారం బిఎస్‌ఇలో ఈ కంపెనీ షేర్ 2.53 శాతం పతనమై రూ.574.45 వద్ద ముగిసింది.

రాణించిన ఎన్‌సిసి

హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న నిర్మాణ కంపెనీ ఎన్‌సిసి లిమిటెడ్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2017-18 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 72 శాతం వృద్ధితో రూ.100 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 3.5 శాతం తగ్గి రూ.1879 కోట్లుగా నమోదయ్యాయి. 2016-17 ఇదే క్యూ3లో రూ.1943 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. బుధవారం బిఎస్‌ఇలో ఎన్‌సిసి షేర్ విలువ 6.75 శాతం పెరిగి రూ.126.50 వద్ద ముగిసింది. నిర్మాణ రంగంలో మరింత రాణించడానికి ప్రణాళికలు రూపొందిస్తు న్నామని ఎన్‌సిసి మేనేజింగ్ డైరెక్టర్ ఎ రంగ రాజు పేర్కొ న్నారు. మూలధన అవసరాల కోసం ఈ కంపెనీ నిధులు సమీకరిస్తోందన్నారు. ఇందుకోసం గత నెలలో క్యూఐపి ఇష్యూ ద్వారా రూ.550 కోట్లు సమీకరించింది. 2017-18 తొలి తొమ్మిది మాసాల్లో ఎన్‌సిసి రూ.21614 కోట్ల విలువ చేసే ఆర్డర్లు పొందిందని రాజు తెలిపారు. ప్రస్తుతం చేతిలో రూ.31627 కోట్ల విలువ చేసే ఆర్డర్లున్నాయని అన్నారు.

చిన్న మొత్తాల పథకాల్లో మార్పులు

న్యూఢిల్లీ : చిన్నమొత్తాల పొదుపు పథకాల్లో మార్పులు తీసుకువచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీములో పెట్టుబడి పెట్టిన వారు అత్యవసర వైద్యం, పిల్లల ఉన్నత విద్య అవసరాల కోసం ఐదేళ్ల గడవుకు ముందే వారి ఖాతాలను మూసి వేసుకు నేందుకు ఆర్థిక మంత్రిత్వశాఖ అనుమ తించింది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫి కెట్స్, పిపిఎఫ్ లాంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల కింద పెట్టుబడి పెట్టిన వారు అత్య వసరమైతే గడవు తీరకముందే మూసివేసు కునేందుకు అనుమతించింది. అదే విధంగా చిన్నమొత్తాల పొదుపు పథకా ల్లో పెట్టుబడి పెట్టిన వారు మరణిస్తే వారి క్లెయిములను సత్వరం పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. పోస్టాఫీసు పొదుపు ఖాతాలు, జాతీయ పిపిఎఫ్, సుకన్య సమద్ధి యోజన ఖాతాలన్నీ చిన్నమొత్తాల పొదుపు పథకాలుగా పరిగణిస్తారు.

టాబ్లెట్స్ ఇండియా నుంచి 'రెస్యూనెట్'

హైదరాబాద్ : టాబ్లెట్స్ ఇండియా తాజాగా మరో వినూత్నమైన ప్రొబయోటిక్ 'రెస్యూనెట్'ను విడుదల చేసింది. నవజాత శిశు వుల్లో రోగనిరోధక శక్తి అభివద్ధి చేసేందుకు, రోగనిరోధక స్పందనను మాడ్యు లేట్ చేసేందుకు ఇది తోడ్పడుతుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. జపాన్‌కు చెందిన మోరి నాగా మిల్క్ ఇండస్ట్రీ సంస్థ ద్వారా ప్రొబయో టిక్ బైఫైడొబాక్టీరియమ్ బ్రెవ్ ఎం-16వి నుంచి దీన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపింది. తన పోర్ట్‌ఫోలియోను మరింత విస్తృతం చేసుకో వడంలో భాగంగా దీన్ని భారత మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాంఘిక నేర్పరులు అంటే ఎవరు?

ప్రజ్ఞ



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

ఒక వ్యక్తి తన జీవితంలో దైనందిన కార్యక్రమాలను సమర్థవంతంగా, తెలికగా నిర్వహించగలిగే సామర్థ్యాన్ని 'ప్రజ్ఞ' అంటారు. ప్రజ్ఞ అనేది ఒక గమ్యంగా అనుకొంటే జ్ఞానం, స్మృతి, ప్రావీణ్యత, సృజనాత్మకత, సహజ సామర్థ్యం అనేవి ప్రజ్ఞను చేరుకొనే మార్గాలు.

ప్రజ్ఞకు కొన్ని నిర్వచనాలు

- అభ్యసించగలిగే సామర్థ్యమే ప్రజ్ఞ - **డేర్‌బాన్**
- అమూర్తంగా ఆలోచించగలిగే సామర్థ్యమే ప్రజ్ఞ - **టెర్మన్**
- మనలో ఉండే గ్రహణశక్తి ప్రజ్ఞ - **గాల్టన్**
- గత అనుభవాల సహాయంతో సహజ ప్రవత్తిని మెరుగుపరచుకోగలిగే సామర్థ్యమే ప్రజ్ఞ - **మెక్ డూగల్**
- భౌతిక, సామాజిక పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తించగలిగే సామర్థ్యమే ప్రజ్ఞ - **జీన్ పియాజె**
- ఒక ప్రయోజనాన్ని పొందేందుకు, హేతుబద్ధత కలిగి, పరిసరాలతో సర్దుబాటును పెంపొందించుకునే సామర్థ్యమే ప్రజ్ఞ - **వెష్లర్**
- కొత్త పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతంగా సర్దుబాటు చేసుకోగలిగే సామర్థ్యమే ప్రజ్ఞ - **విలియం జేమ్స్**

పరస్పర సంబంధాలను రాబట్టే వ్యక్తి అంతర్గతశక్తియే ప్రజ్ఞ **- స్పియర్‌మెన్**

ప్రజ్ఞ అనేది ఒక అభ్యసనా శక్తి, అమూర్త ఆలోచనా శక్తి, సర్దుబాటు చేసుకొనే శక్తి, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనే శక్తి, సమస్య పరిష్కారశక్తి, వ్యక్తి యొక్క గ్రాహకశక్తి, పరిసరాలతో అనుగుణ్యతా పెంపొందించే శక్తి, సాంఘిక వ్యవహారాలను చక్కదిద్దే శక్తి, వ్యక్తుల మధ్య సంబంధాలను అర్థంచేసుకునే శక్తి, క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొనే శక్తి.

ప్రజ్ఞా లక్షణాలు : ప్రజ్ఞ వ్యక్తి కలిగి ఉండే సహజ అంతర్గతశక్తి, జాతి, మత, లింగభేదాలు ప్రజ్ఞకు లేవు. ప్రజ్ఞ వ్యక్తులందరిలో ఒకేలా ఉండదు. ప్రజ్ఞా పాటవాల్లో వైయుక్తిక భేదాలుంటాయి. ప్రజ్ఞ పై అనువంశికతా ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది కౌమారదశ వరకూ కొనసాగుతుంది. విషయ అభ్యసన, నూతన పరిస్థితులకు సర్దుబాటు జరుగుతుంది. దీనివల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుంది. సమైక్య ఆలోచన ఉన్నవారికి ప్రజ్ఞ అధికమని, విభిన్న ఆలోచన ఉన్నవారికి సృజనాత్మకత ఎక్కువని గిల్‌ఫర్డ్ తెలియజేశాడు.


ప్రజ్ఞా రకాలు : థార్న్‌డైక్ ప్రజ్ఞను మూడు రకాలుగా ఉంటుందని తెలియజేశాడు

1. అమూర్త ప్రజ్ఞ : మాటలను, గుర్తులను, భావాలను, నమూనాలను, సంఖ్యలను, చిహ్నాలను, అర్థంచేసుకొని నేర్పుగా ఉపయోగించే సామర్థ్యాన్ని అమూర్త ప్రజ్ఞ అంటారు. శాబ్దిక అంశాలలో, సంఖ్యా అంశాలలో ఇది కనిపిస్తుంది.
ఉదా : విద్యార్థి దైనందిన జీవితంలో, గణిత సమస్యలను స్వయంగా పరిష్కరించగలగటం.

2. యాంత్రిక ప్రజ్ఞ : యంత్ర పరికరాలను, చాలకకౌశలాలను, భౌతిక పరికరాలను సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యాన్ని యాంత్రిక ప్రజ్ఞ అంటారు. ఇది వృత్తి సంబంధ కృత్యనిర్వహణలో కనిపిస్తుంది.
ఉదా : క్రికెట్ ఆటగాడు బ్యాట్‌ను సులువుగా, నైపుణ్యంగా ఉపయోగించడం.

3. సాంఘిక ప్రజ్ఞ : వ్యక్తి తన చుట్టూ ఉండే సమాజంలోని ఇతరుల సమస్యలు, ఉద్వేగాలు తెలుసుకొని తెలివిగా వ్యవహరించి.. వారి సహాయంతో తమ పనులను చక్కబెట్టుకొనే సామర్థ్యాన్ని సామాజిక ప్రజ్ఞ అంటారు.
ఉదా : సేల్స్‌మేన్ కస్టమర్‌ను ఒప్పించి తన ప్రొడక్టును అమ్మగలగడం.

గార్డెనర్ బహుళ ప్రజ్ఞా సిద్ధాంతం



హోవార్డ్ గార్డెనర్ తను పరిశోధనల బహుళ ప్రజ్ఞా ఫలితాలను గ్రంథస్థం చేస్తూ **'ఫ్రేమ్స్ ఆఫ్ మైండ్ : ద థియరీ ఆఫ్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్'** అనే పుస్తకాన్ని 1983లో ప్రచురించాడు. ఇతని పరిశోధనా ఫలితాలను బట్టి ఎనిమిది రకాల ప్రజ్ఞాంశాలు గుర్తించబడ్డాయి.

1.శాబ్దిక భాషా సంబంధ ప్రజ్ఞ : భాషను సమర్థవంతంగా ఉపయోగించడంలో, సందర్భోచిత పదాల వాడుకలో ఈ ప్రజ్ఞ ప్రధానపాత్ర పోషిస్తుంది. రాయడంలో, చదవడంలో, మాట్లాడటంలో సంబంధం కలది. వీటిని ఉపయోగించే కవులు, రచయితలను **'పదనేర్పరులు'** అంటారు.

2. గణిత తార్కిక ప్రజ్ఞ : సంఖ్యలను, గణితసూత్రాలను ఉపయోగించి, తార్కిక పద్ధతుల ద్వారా చిక్కు సమస్యలను సాధించడంలో ఈ ప్రజ్ఞ ఉపయోగపడుతుంది. ఈ గణిత శాస్త్రజ్ఞులు, గణాంక నిపుణులను **'సంఖ్యా నేర్పరులు'** అంటారు.



3. సంగీత సంబంధ ప్రజ్ఞ : సంగీతాన్ని నేర్చుకొని రాగం, శృతి, లయలను గుర్తించడంతోపాటు వాటిని సృష్టించగలిగే వారికి ఉండే ప్రజ్ఞ. పాటలను త్వరగా గుర్తించడంతో పాటు, సంగీతపరమైన అంశాలను గుర్తించడంలో నేర్పును కలిగి ఉంటారు. వీరిని **'సంగీత నేర్పరులు'** అంటారు.

4. దృశ్య ప్రాదేశిక ప్రజ్ఞ : చిత్రాల ద్వారా, ఆకారాల ద్వారా, విషయావగాహన పొందే సామర్థ్యాన్ని ప్రాదేశిక సామర్థ్యం అంటారు. వీరు ఊహాత్మక చిత్రీకరణలో నేర్పరులు. శిల్పులు, చిత్రకారులు, ఆర్కిటెక్టులు వంటి వారిని **'చిత్రనేర్పరులు'** లేదా **'కళలో నేర్పరులు'** అని అంటారు.

5. శారీరక కండర స్పర్శాత్మక ప్రజ్ఞ : వ్యక్తి శారీరక కదలికలను, వస్తువులను, ఉపయోగించడంలో గల సామర్థ్యాన్ని శారీరక కండల స్పర్శాత్మక ప్రజ్ఞ అంటారు. డ్యాన్స్ మాస్టర్లు, క్రీడాకారులు ఇందులో మంచి ప్రజ్ఞ కలిగివుంటారు. వీరిని **'శారీరక నేర్పరులు'** అంటారు.

6. సాంఘిక ప్రజ్ఞ : ఇతరుల మానసిక, ఉద్వేగాత్మక స్థితులను, ప్రేరణలను సున్నితంగా గ్రహించి, స్పందించే సామర్థ్యం. ఈ సామర్థ్యాన్ని రాజకీయ నాయకులు, సంఘసేవకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కలిగివుంటారు. వీరిని **'సాంఘిక నేర్పరులు'** అంటారు.

7. వ్యక్త్యంతర ప్రజ్ఞ : తమ గురించి తాము తెలుసుకోవడంలో అంటే తన బలాల్ని, బలహీనతల్ని, శక్తి సామర్థ్యాలను, ఆలోచనా విధానాల్ని, అనుభూతుల్ని, తెలుసుకొనేట్లు చేసే ప్రజ్ఞ. సాంఘిక విలువలు, అభిరుచులు, సర్దుబాట్లు తాము గుర్తించేట్లు చేస్తుంది. ఈ ధోరణి గల తత్వవేత్తలు, మేధావులను **'స్వీయ నేర్పరులు'** అంటారు.

8. సహజ ప్రజ్ఞ : మన చుట్టూవున్న వాస్తవ ప్రపంచాన్ని, జీవనిర్జీవ ప్రకృతిని ఆస్వాదించడంలో, వాటిని భేదాలు, పోలికలు ఆధారంగా వర్గీకరించడం, వ్యక్తీకరించడం ఈ సహజ ప్రజ్ఞలో ఉంటుంది. జీవశాస్త్రజ్ఞులు, పర్యావరణ శాస్త్రవేత్తలు ఈ సహజప్రజ్ఞను కలిగి ఉంటారు. వీరిని **'ప్రకృతి నేర్పరులు'** అంటారు.

★

ఉద్యోగాలు

సెంట్రల్ రైల్వేలో 21 ఉద్యోగాలు

ముంబైలోని సెంట్రల్ రైల్వే ప్రధాన కార్యాలయం 21 స్పోర్ట్స్ కోటా ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

క్రీడా విభాగాల వారీ ఖాళీలు: లెవెల్ 5/4 పే కేటగిరీలో స్విమ్మింగ్ (వ్యక్తిగత మెడ్లే)-1(పురుషులు), అథ్లెటిక్స్ (5 వేల మీటర్లు)-1 (మహిళలు), బాస్కెట్‌బాల్ (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), క్రికెట్ (ఆల్‌రౌండర్)-2 (పురుషులు-1 +మహిళలు-1), లెవెల్ 3/2లో పే కేటగిరీలో స్విమ్మింగ్ (బ్యాక్‌స్ట్రోక్)-1 (పురుషులు), వాటర్‌పోలో (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), అథ్లెటిక్స్ (5 వేల మీటర్లు)-1 (మహిళలు), బాస్కెట్‌బాల్ (ఆల్‌రౌండర్)-1 (పురుషులు), బాక్సింగ్ (+91 కిలోలు అండ్ 81 కిలోలు)-2 (పురుషులు), బ్రిడ్జ్ (బ్రిడ్జ్ ప్లేయర్)-1 (పురుషులు), క్యూ స్పోర్ట్స్ (స్నూకర్)-1 (పురుషులు), క్రికెట్ (ఆల్‌రౌండర్)-2 (పురుషులు-1 + మహిళలు-1), పవర్ లిఫ్టింగ్ (63 కిలోలు)-1 (మహిళలు), షూటింగ్ (0.22 రైఫిల్ 3 పొజిషన్)-1 (పురుషులు/మహిళలు), వాలీబాల్ (సెంటర్ బ్లాకర్ అండ్ అటాకర్)-2 (మహిళలు)-2, రెజ్లింగ్ ఫ్రీ స్టయిల్ (74 కిలోలు అండ్ 86 కిలోలు)-2 (పురుషులు).

వేతనశ్రేణి: లెవెల్ 5/4 కేటగిరీకి రూ.29,200-92,300/ రూ.25,500-రూ.81,100, లెవెల్ 3/2 కేటగిరీలో రూ.21,700-69,100/ రూ.19,900-రూ.63,200.

అర్హతలు: లెవెల్ 5/4 కేటగిరీలోని పోస్టులకు ఏదైనా గ్రాడ్యుయేషన్, లెవెల్ 3/2 కేటగిరీ పోస్టులకు ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్య లేదా పదోతరగతితోపాటు యాక్ట్ అప్రెంటీస్ కోర్స్/ ఐటీఐ (ఎన్‌సీవీటీ/ ఎస్‌సీవీటీ). అలాగే పోస్టును బట్టి సంబంధిత క్రీడా విభాగంలో ఒలింపిక్స్/ అంతర్జాతీయ/ జాతీయ/ అంతర్రాష్ట్ర/ రాష్ట్ర/ విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో సీనియర్/ జూనియర్ స్థాయిలో కనీసం తృతీయస్థానం పొంది ఉండాలి/ ప్రాతినిథ్యం వహించి ఉండాలి.

వయసు: 2018, జులై 1 నాటికి 18-25 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక: క్రీడల్లో సాధించిన విజయాలు, ట్రయల్, ఆఫ్టర్ ట్రయల్.

దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ మహిళ/ మైనార్టీ/ ఆర్థికంగా వెనుకబడిన కేటగిరీల అభ్యర్థులకు రూ.250.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: ఫిబ్రవరి 20, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్: www.cr.indianrailways.gov.in, www.indianrailways.gov.in

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌లో 21 ఉద్యోగాలు

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ (ఏఐఈఎల్).. 21 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: కో-ఆర్డినేటర్ (ఫ్లైట్ ఆపరేషన్స్/ డిస్పాచ్)-2, మేనేజర్ (ఫ్లైట్ డిస్పాచ్)-3, సీనియర్ ఆఫీసర్ (ఫ్లైట్ డిస్పాచ్)-2, ఆఫీసర్ (కాక్‌పిట్/ కేబిన్ క్ర్యూ షెడ్యూలింగ్)-1, అసిస్టెంట్ టెక్నికల్ లైబ్రరీ-1, రూట్ మేనేజర్-1, ఆఫీసర్ (సేల్స్)-1, ఆఫీసర్ (ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్)-2, సీనియర్ అసిస్టెంట్ (ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్)-6, సీనియర్ ఆఫీసర్ (కేటరింగ్ సర్వీసెస్)-1.

అర్హతలు: సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంటర్మీడియెట్/ గ్రాడ్యుయేషన్/ ఎంబీఏ/ డిప్లొమా (హోటల్ మేనేజ్‌మెంట్). అలాగే నిబంధనల మేర అనుభవం, కంప్యూటర్ ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, ప్రీ-మెడికల్ ఎగ్జామినేషన్.

దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోపు. (ఫిబ్రవరి 26 చివరి తేదీ)

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.airindiaexpress.in

ప్రభుత్వ పథకాల్లో దళితులకు ప్రాధాన్యత : కెఇ

ప్రజాశక్తి - కర్నూల్‌కలెక్టరేట్

ప్రభుత్వ పథకాల్లో దళితులకు ప్రాధాన్యత కల్పిస్తామని డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో దామోదరం సంజీవయ్య 97వ జయంతి వేడుకలను సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఎస్వీమోహన్‌రెడ్డి, ఐజయ్య, మాజీ మంత్రి మారెప్పతోపాటు పలువురు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. తొలుత ఆయన కాంస్య విగ్రహానికి నేతలు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

జయంతి వేడుకలు

కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ సర్కిల్‌లో దామోదరం సంజీవయ్య 97వ జయంతి వేడుకలను సందర్భంగా బుధవారం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న డిప్యూటి సిఎం కెఇ.కృష్ణమూర్తి



చిత్తశుద్ధి ఉంటే రాజీనామా చేయించండి


ప్రత్యేకహోదాపై చంద్రబాబుకు ముద్రగడ లేఖ

ప్రజాశక్తి - కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్రం మీద ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే ఓటుకు నోటు కేసుకు భయపడకుండా ప్రత్యేక హోదా కోసం కేంద్రంలో ఉన్న టిడిపి మంత్రులు, ఎంపీలతో రాజీనామా చేయించాలని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను ఆయన బుధవారం విడుదల చేశారు. హోదా కోసం ప్రత్యక్షంగా రోడ్డుపైకి వస్తే ఉద్యమానికి సహకారం అందిస్తామన్నారు. ప్రత్యేకహోదా లేదా ప్యాకేజీ సాధన కోసం తెరవెనుక రాజకీయాలు చేస్తూ పవన్ కళ్యాణ్‌ను బలిచేయడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. 'తిరుపతిలో మోడీ బహిరంగ సభలో ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు, 10 ఏళ్లుకావాలన్నారు. ఆ తరువాత ప్రత్యేకహోదా సంజీవని కాదని, హోదా కన్నా ప్యాకేజీ ముద్దు అన్నారు. ఓటుకు నోటు కేసులో మోడీ కాపాడారని, మోడీ దైవంతో సమానమని అన్నారు' అంటూ ముద్రగడ గుర్తు చేశారు. ప్రస్తుతం హామీలు అమలుచేయని ప్రధాని అంటూ ప్రజలను మోసగించడం ఎంతవరకూ సమంజసమన్నారు. ప్రధాని ఇచ్చిన హామీలు లాంటివి చంద్రబాబు కూడా రాష్ట్ర ప్రజలకు ఎన్నో ఇచ్చారని, వాటిలో ఎన్ని అమలు చేశారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను ప్రశ్నించే పురంధేశ్వరి, సోము వీర్రాజుతోపాటు తన వంటి వారిని దొంగలు, జగన్‌కు అమ్ముడుపోయారంటూ ఎదురుదాడి చేయించడం అలవాటుగా మారిపోయిందన్నారు.

మాజీ ఎమ్మెల్యే కృష్ణారావు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎం.వి. కృష్ణా రావు(87) అనారోగ్యంతో హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో బుధవారం మృతి చెందారు. కొద్దిరోజులుగా తీవ్ర అస్వస్థతతో ఆయన బాధపడ్డారు. కృష్ణా జిల్లా పెద్దపాలుపర్రు గ్రామంలో 12.12.1931లో జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఎ, పిహెచ్‌డి పూర్తి చేశారు. తండ్రికి వ్యాపారరీత్యా సహకరిస్తూ ఇచ్ఛాపురంలో ఉండేవారు. 1982లో ఎన్‌టిఆర్ టిడిపి స్థాపించిన తర్వాత ఆ పార్టీలో చేరి 1983 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 1985, 1989, 1999లో కూడా టిడిపి ఎమ్మెల్యేగా పనిచేశారు. టిడిపి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా, మైన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. 2004 ఎన్నికల్లో టికెట్ ఇవ్వడానికి టిడిపి నిరాకరించడంతో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఏర్పడిన వైసిపిలోకి వెళ్లారు. 2014 ఎన్నికల తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయనకు భార్య శేషమాంబ, కుమారుడు సతీష్, కుమార్తెలు గీత, లత ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం హైదరాబాద్‌లో జరగనున్నాయి.

ఎంవి కృష్ణారావు మృతికి సిఎం చంద్రబాబు సంతాపం

ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎంవి కృష్ణారావు మృతికి సిఎం చంద్రబాబు సంతాపాన్ని తెలిపారు. టిడిపి తరపున నాలుగుసార్లు శాసనసభకు ఎన్నికైన ఆయన మృతి ఉత్తరాంధ్ర జిల్లాలకు తీరని లోటని సంతాప సందేశంలో చంద్రబాబు పేర్కొన్నారు.

మెట్టగా సాగర్ ఆయకట్టు

- జలాశయంలో నీరున్నా మూడేళ్లుగా విడుదల చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి

సాగర్ ఆయకట్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీంతో ప్రకాశం జిల్లాలో లక్షల ఎకరాల మాగాణి పొలాలు మెట్ట భూములుగా మారాయి. జలాశయంలో పుష్కలంగా నీరున్నా ఆయకట్టును నిలపలేకపోతోంది. రాష్ట్రంలో డెల్టాకు పట్టిసీమ, ప్రకాశం బ్యారేజీ ద్వారా, రాయలసీమకు శ్రీశైలం ద్వారా నీరిస్తోంది. మధ్యలో ఉన్న ఆయకట్టును పట్టించుకోకుండా వదిలేసింది.

రాష్ట్రంలో మనకు కృష్ణా జలాలతోపాటు గోదావరి జలాలు ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్నాయి. ఇందుకోసం గతంలో నిర్మించిన భారీ జలాశయాలు ఇప్పుడు ఉమ్మడి ప్రాజెక్టులుగా మారిపోయాయి. దీంతో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల్లో సాగర్ ఆయకట్టుకు సమస్య తలెత్తింది. ఈ ఏడాది శ్రీశైలం డ్యాం నిండినందున రాయలసీమకు నీటిని పుష్కలంగా అందిస్తున్నారు. అదే సమయంలో సాగర్‌కూ 570 అడుగుల మేర నీటిని శ్రీశైలం డ్యాం నుంచి వదిలారు. అయినా సాగర్ ఆయకట్టుకు నీరివ్వలేదు. మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా మాగాణి పూర్తిగా మెట్టగా మారింది. డెల్టాకు పట్టిసీమ నుంచి, ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని ఇచ్చారు. ఇక్కడ నీటి సమస్య రాలేదు. మాగాణితోపాటు ఆరుతడి పంటలకూ నీటిని అందించారు. మధ్యలో ఉన్న సాగర్ ఆయకట్టునే పూర్తిగా వదిలేశారు.

మూడేళ్లుగా మాగాణి భూములు ఎడారి

సాగర్ కుడి కాలువ కింద మూడేళ్లుగా నీరివ్వనందున లక్షలాది ఎకరాల మాగాణి భూమి ఎడారిగా మారింది. ఈ కాలువ పరిధిలో గుంటూరు, ప్రకాశం జిల్లాలున్నాయి.



ప్రకాశం జిల్లా ఇంకొల్లు ప్రాంతంలో మాగాణి పండాల్సిన భూముల్లో మిర్చి సాగు చేసిన రైతులు

గుంటూరు జిల్లాకు 80 టిఎంసిలు, ప్రకాశం జిల్లాకు 60 టిఎంసిలు నీటిని ఇస్తారు. గుంటూరు జిల్లాలో మాగాణి, ఆరుతడి కలిపి 6 లక్షలు ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రకాశం జిల్లాలో మాగాణి, ఆరుతడి 4.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నీటి సరఫరాలో ఏటా అన్యాయం జరుగుతోందని రైతులు ఆందోళనలు చేసినా.. ప్రభుత్వం నీటి పంపకాల్లో సరైన పద్ధతి అవలంభించలేదు. దీంతో ప్రకాశం జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగు చేపట్టారు. ఇదొక నిర్లక్ష్యమైతే ఇప్పుడు నీటిని పూర్తిగా నిలిపేశారు. తాగునీటి కోసం కూడా పెద్ద ఎత్తున పోరాడితే తప్ప కాలువలకు నీరు విడుదల చేయడం లేదు. మూడేళ్లుగా నీరు ఇవ్వనందున వరి, ఇతర ఆరుతడి పంటలకు బదులు కంది, జొన్న పంటలు వేస్తున్నారు. అయినా ఏ పంటా చేతికి రాలేదు.

ఈ ఏడాది సాగర్ జలాశయంలో 570 అడుగుల మేరకు నీరు చేరింది. ఈ నీరు కుడి కాలువ పరిధిలోని ఆయకట్టుకు సరిపోతుంది. అయినా మాగాణికి నీరివ్వలేమని ప్రభుత్వం ప్రకటించింది. 2004లో 530 అడుగుల నీరున్నా మాగాణికి నీరిచ్చారు. అప్పట్లో రైతులు ఆందోళనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నీరున్నా ఇవ్వలేదు. కారణం ఇరు రాష్ట్రాల మధ్య పంపకాల్లో పేచీలే. ఈ నేపథ్యంలో ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల నీటి వివాదాలపై ఢిల్లీలో ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు, కృష్ణా, గోదావరి బోర్డు అధికారులు, చీఫ్ ఇంజినీర్లు, కేంద్ర జలవనరుల శాఖ అధికారులు హాజరుకానున్నారు. గురువారం జరిగే సమావేశంలో కృష్ణా గోదావరి జలాల పంపకాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం.

కార్పొరేట్లకు ప్రభుత్వాలు ఊడిగం

సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నాయని సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు విమర్శించారు. విజయవాడ హాకర్స్ అండ్ తోపుడు బండ్ల యూనియన్ 6వ మహాసభ విజయవాడలోని రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ.. బాబు వస్తే జాబు వస్తుందని ఎన్నికలకు ముందు ప్రచారం చేశారని, అధికారంలో వచ్చిన తరువాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని అన్నారు. హాకర్స్ యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉంటే యూనియన్ పటిష్టంగా ఉంటుందన్నారు. ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వాలు చిన్న చిన్న వ్యాపారాలను తొలగించి కార్పొరేట్ సంస్థలను పెంచి పోషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. హాకర్లకు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. కనీసం గుర్తింపు కార్డులూ మంజూరు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

పవన్ కల్యాణ్ పర్యటనను అడ్డుకుంటాం

గిరిజనులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ఆదివాసీ సేనా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల ఐదో తేదీన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆదివాసీల ర్యాలీ సందర్భంగా చోటు చేసుకున్న సంఘటనలో గిరిజన యువకులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఆదివాసీ సేనా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారులు, ఆదివాసీలతో చర్చిస్తూనే పోలీసులు మోసపూరితంగా కేసులు నమోదు చేశారని విమర్శించారు. అరెస్ట్ చేసిన పది మందినీ తక్షణమే విడుదల చేయాలని, బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం చట్టబద్ధత లేకుండా తీర్మానం చేశారని చెప్పారు. ఆదివాసీల డిమాండ్లు, సమస్యలపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు అవగాహన లేదన్నారు. ఎస్‌టిల్లో చేర్చాలంటూ మత్స్యకారులు నిర్వహిస్తోన్న దీక్షలకు సంఘీభావం తెలపడానికి వస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అడ్డుకుంటామని, ఈ నెల 17న జిల్లాలోని అన్ని గిరిజన మండలాల్లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తామని చెప్పారు.

నిట్ యాజమాన్యం విఫలం

ఎస్ఎఫ్ఐ పశ్చిమగోదావరి జిల్లా (అప్‌ల్యాండ్) నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లిగూడెం(పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) కళాశాలలో విద్యార్థుల మధ్య నెలకొన్న ప్రాంతీయ విభేదాల పరిష్కారంలో యాజమాన్యం వైఫల్యం వల్లే ర్యాగింగ్ వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని, వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పశ్చిమగోదావరి జిల్లా (అప్‌ల్యాండ్) అధ్యక్ష కార్యదర్శులు కె.అనిల్, పి.సాయికృష్ణ అన్నారు. నిట్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి మేధావులను అందించే విశ్వవిద్యాలయాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. విద్యార్థుల్లో ఏర్పడుతున్న ప్రాంతీయ విభేదాలను యాజమాన్యం పరిష్కరించలేకపోవడం, సరైన రీతిలో స్పందించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని, వారికి నష్టం వాటిల్లితే ఆందోళన చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వి.మహేష్, సతీష్ పాల్గొన్నారు.

19న తెలుగునాడు టీచర్ల సంఘం ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సరైన కేటాయింపులు లేకపోవడంతో టిడిపి ప్రత్యక్ష కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా వివిధ వర్గాలకు చెందిన వారితో ఆందోళనలు చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు చేయాలని నిర్ణయించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ల ఎదుట 19న ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ బుధవారం తెలిపారు. విభజన కష్టాల్లో ఉన్న ఏపిని ఆదుకోకపోగా చట్టంలోని హామీలను కూడా నెరవేర్చటం లేదని పేర్కొన్నారు. టిడిపి నుంచి విడిపోయి బిజెపి స్వతంత్రంగా పోటీ చేస్తే ఆ పార్టీకి డిపాజిట్లు దక్కవన్నారు. ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు టిడిపి పెట్టిన భిక్షే అని విమర్శించారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా బిజెపి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, నిధులు సక్రమంగా కేటాయించకపోతే బిజెపితో అమీతుమీకి సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

రైల్వేజోన్ కోసం వామపక్షాల ర్యాలీ



విశాఖలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు లోకనాథం, గంగారావు, పైడిరాజు తదితరులు

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించాలని, విభజన హామీలను అమలు చేయాలని విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆశీలుమెట్ట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ సర్కిల్, గుడివాడ గురున్నాథరావు జంక్షన్ మీదుగా తిరిగి గాంధీ విగ్రహం వద్దకు చేరారు. అనంతరం అక్కడ ఉన్న జంక్షన్‌లో మోకాళ్లపై నిల్చుని రైల్వేజోన్ విజయవాడ కేంద్రంగా ఏర్పాటుకు బిజెపి, టిడిపి చేస్తున్న చర్యలను నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తొలుత జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు కె.లోకనాథం, గంగారావు, సిపిఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడారు.

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అసెంబ్లీలో కూడా తీర్మానం చేశారని తెలిపారు. వీటన్నింటినీ పక్కనపెట్టి విజయవాడ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయడమంటే ఉత్తరాంధ్ర ప్రజలను వంచన చేయడమేనని పేర్కొన్నారు. కెకెలైన్‌తో కూడిన విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గసభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్. బి.జగన్, నగర కమిటీ సభ్యులు మణి, కృష్ణారావు, సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు డి.మార్కేండేయులు, సహాయ కార్యదర్శి జెడి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ ఇవ్వాల్సిందే

శ్రీకాకుళం ఎంపి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విభజన చట్టంలో పొందుపరిచిన విశాఖ రైల్వేజోన్ ఇవ్వాల్సిందేనని, దీనిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ప్రజాసదన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్ పరిధిలోకి వాల్తేరు, గుంతకల్లు, విజయవాడ, గుంటూరు రైల్వే డివిజన్లను, రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్లను తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఖుర్దా డివిజన్‌లో ఉన్న పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న ఏడు రైల్వేస్టేషన్లనూ విశాఖ రైల్వేజోన్‌లో ఉంచాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ పరిధిలోని ఏడు స్టేషన్లు అభివృద్ధికి నోచుకోవాలంటే కొత్త జోన్‌లో చేర్చడం ద్వారానే సాధ్యమన్నారు. ఒడిశా పెత్తనంతో రైల్వేజోన్ విషయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని అభిప్రాయ పడ్డారు. అధికారం కోసమే వైసిపి అధినేత జగన్ రోజుకో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. పాదయాత్ర ద్వారా లబ్ధి పొందాలని భావించారని, జనాదరణ కోల్పోవడంతో రాజీనామాలంటూ కొత్త డ్రామాను తెరపైకి తీసుకొచ్చారని అన్నారు. గతంలో రాజీనామా చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. విభజన చట్టంలోని ప్రతి హామీ అమలుకు పార్లమెంట్ వేదికగా పోరాడుతామన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ఫిబ్రవరి 13
2. రేడియో అండ్ స్పోర్ట్స్
3. 12
4. ఒడిషాలో తొలి మహిళా సినిమా దర్శక, నిర్మాత
5. భోపాల్ (మధ్యప్రదేశ్)

ఎస్‌విబిసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- కార్మిక శాఖ సంయుక్త కమిషనర్‌తో కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

టిటిడి అనుబంధ శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ప్రతి ఏడాదీ రెన్యువల్ చేసే పద్ధతిని విడనాడాలని ఎస్‌విబిసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. తిరుపతిలోని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ విద్యాసాగర్ ఏర్పాటు చేసిన చర్చలకు బుధవారం ఉద్యోగ సంఘం నాయకులు హాజరైనా.. ఎస్‌విబిసి, టిటిడి యాజమాన్యం మాత్రం గైర్హాజరైంది. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ.. ఎస్‌విబిసి ఉద్యోగులు పదేళ్లుగా శ్రీవారి వైభవాన్ని ప్రపంచంలోని 56 దేశాల్లో ప్రసారం చేస్తున్నారని తెలిపారు. ఆ ఉద్యోగుల సమస్యలు, రెగ్యులరైజేషన్, ప్రమోషన్ల విషయమై ఏమాత్రం యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. పది రోజుల క్రితమే ఉద్యోగుల యూనియన్ తరపున యాజమాన్యానికి డిమాండ్ల నోటీసును ఇచ్చామన్నారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చలకు యాజమాన్యం నుంచి ప్రతినిధులెవరూ రాకపోవడం శోచనీయమన్నారు. ఎస్‌విబిసి యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. మెతక వైఖరిని అవలంబిస్తే సహించబోమని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ విద్యాసాగర్ మాట్లాడారు. పది రోజులకు ముందే సమాచారం పంపినా ఎస్‌విబిసి యాజమాన్య ప్రతినిధులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 27వ తేదీన ఉభయ పక్షాలతో నిర్వహించే చర్చలకు తప్పక హాజరుకావాలని ఎస్‌విబిసి ఛానెల్ సిఇఒ నర్సింహారావును ఆదేశించారు.

పరామర్శ

గిరిజన మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాల్సిందే

- సిపిఎం తూర్పుగోదావరి జిల్లా (కాకినాడ) కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్



తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం మండలం లక్ష్మీ నరసాపురంలో ఇటుకలబట్టీలో పనిచేస్తున్న గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేసి, దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని తూర్పుగోదావరి జిల్లా(కాకినాడ) కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని సిపిఎం బృందం బుధవారం పరామర్శించింది. బాధిత కుటుంబంతో మాట్లాడి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. తమను కొంత కాలంగా వేధిస్తున్నా పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఇద్దరు పిల్లలతో బట్టీలో పనిచేస్తున్నామని బాధితులు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యాచారయత్నానికి పాల్పడిన ఏసుబాబును వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

మహిళ భర్త శివరామకష్ణపై దాడి చేసిన బట్టీ యజమానులు రాజబాబు, వీరబాబు, కష్ణను కూడా అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం కేసు విషయమై రూరల్ ఎస్ఐ మూర్తిని వివరాలడిగి తెలుసుకున్నారు. నిందితులు నలుగురిపైనా వెంటనే కేసు నమోదు చేసి శిక్షించాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.సింహాచలం, పార్టీ నాయకులు విశ్వనాధం, కుంచె చిన్నా పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉగ్రవాదాన్ని ధీటుగా ఎదుర్కొంటాం..!

యాంటీ టెర్రరిస్ట్ అధ్యక్షుడు ఎమ్ఎస్ బిట్టా

ప్రజాశక్తి-తిరుమల

దేశ సరిహద్దుల్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి భారత్ దీటుగా సమాధానమిస్తుందని యాంటీ టెర్రరిస్ట్ అధ్యక్షుడు ఎమ్ఎస్ బిట్టా స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాద్ దగ్గరుండి దర్శన ఏర్పాట్లను చేశారు. అనంతరం రంగనాయక మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, పట్టు వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలతో పాటు శ్రీవారి చిత్ర పటాన్ని అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో ఆయన మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో ఎమ్ఎమ్ కీరవాణి

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం నైవేద్య విరామ సమయంలో సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్ కీరవాణి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దగ్గర ఉండి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయక మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాద్, పేష్కార్ రమేష్‌బాబు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



తొమ్మిది మంది మావోయిస్టు మిలీషియా సభ్యుల లొంగుబాటు

ప్రజాశక్తి-నర్సీపట్నం (విశాఖ)

తొమ్మిది మావోయిస్టు మిలీషియా సభ్యులు నర్సీపట్నం ఎఎస్‌పి అరీఫ్‌హఫీజ్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారిని ప్రవేశ పెట్టి వివరాలను వెల్లడించారు. ఎఎస్‌పి కథనం మేరకు.. విశాఖ జిల్లా కొయ్యూరు మండలం మఠంభీమవరం పంచాయతీ పరిధి మండపల్లి గ్రామానికి చెందిన జర్తా బొబ్బిలి(28), వంతల వీరన్న(45), జర్తా బాలరాజు(48), పాంగి మాగే(45), జర్తా గంగమ్మ(40), కాకురి నారాయణమ్మ(40), కాకురి పార్వతి(20), జర్తా సీతమ్మ(40), కాకురి లక్ష్మి(38) తదితర తొమ్మిది మంది మూడేళ్లగా మావోయిస్టు మిలీషియా సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిని మావోయిస్టు నాయకులు కుడుమల వెంకటరావు అలియాస్ రవి, విఆర్ఎల్ గోపాల్ అలియాస్ ఆజాద్, జాంబ్రి మిలీషియా సభ్యులుగా చేర్పించారు. నాటి నుంచి వీరు మావోయిస్టులకు భోజనాలు పెట్టడం, వారికి ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి దారి చూపడం, జనాన్ని మావోయిస్టు సమావేశాలకు తరలించడం, వారి అసాంఘిక కార్యక్రమాలకు అన్ని విధాలా సహకరిస్తూ పోలీసుల కదలికలను మావోయిస్టులకు ఎప్పటికప్పుడు తెలియజేయడం వంటి పనులు చేస్తున్నారు. అయితే మావోయిస్టుల హింసాత్మక చర్యలు నచ్చక స్వేచ్ఛాయుతమైన జీవనం కోసం తొమ్మిది మంది మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎఎస్‌పి తెలిపారు.

ఎన్నికల కమిషనర్ల వేతనాలు రెండింతలు పెంపు

న్యూఢిల్లీ : ఇటీవల సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాలు పెరిగిన అనంతరం తాజాగా ఎన్నికల కమిషనర్‌ల వేతనాలు కూడా రెండింతలు పెరిగాయి. దీంతో వారి వేతనాలు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలతో సమానంగా ప్రధాన ఎన్నికల అధికారితో పాటు ఇద్దరు కమిషనర్ల వేతనాలు రెండున్నర లక్షల కు చేరుకున్నాయి. జనవరి 25న సుప్రీం కోర్టు,హైకోర్టు జడ్జిల వేతనాన్ని పెంచుతున్నట్లు కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషనర్లు కూడా వేతన నిబంధనల ప్రకారం సుప్రీం కోర్టు జడ్జిల స్థాయిలో ఉండటంతో ఎలక్షన్ కమిషన్ యాక్ట్‌లోని సెక్షన్ 3, 1991 ప్రకారం వారి వేతనాలు పెంచడం జరిగిందని అధికారులు తెలిపారు. కాగా, గతంలో ఎన్నికల కమిషనర్లకు నెలకు రూ.90 వేల వేతనం లభించేది.

భారీ వర్షాలు

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు



మధ్యప్రదేశ్, మహారాష్ట్రను ముంచెత్తిన భారీ వర్షాలు

- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- నష్టాల్లో రైతులు

భోపాల్ : మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ వర్షాలకు వడగళ్ళు కూడా పడుతున్నాయి. మహారాష్ట్రలోని విదర్భ, మరత్వాడా ప్రాంతాలలోని ఉద్యాన పంటలపై భారీ వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. మధ్య ప్రదేశ్‌లోని దాదాపు 8 జిల్లాల్లో రబీ పంటలైన గోధుమ, శనగలపై కూడా వర్షాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. రెండు రాష్ట్రాల్లోను పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్య ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లోని దాదాపు 175 గ్రామాల్లో 95 శాతం పంట నష్టపోయింది. ముఖ్యంగా ద్రాక్ష, తీపి నిమ్మ పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. మహారాష్ట్రలో మొత్తం 46,474 హెక్టార్ల పంట దెబ్బతిన్నది. ఇందులో 43, 824 హెక్టార్లలో 33 శాతం పంట దెబ్బ తిన్నదని ఔరంగాబాద్ డివిజనల్ కమిషనర్ పురుషోత్తమ్ భపకర తెలిపారు. పొరుగునే ఉన్న మధ్య ప్రదేశ్‌లోని 400 గ్రామాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ఈ గ్రామాలలో అత్యధికంగా గోధుమ, శనగ పంటను పండించారు. సెహోర్, రైసెన్ జిల్లాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. రాష్ట్రంలోని శనగ రైతులు ఇప్పటికే చాలా నష్టపోయారు. ప్రభుత్వం క్వింటాకు రూ.4,400 ధర ప్రకటించగా, రైతులు అంతకన్నా తక్కువకు అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడటంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు.

విపత్కర పర్యవసానాలు

రథయాత్రపై సిపిఎం ఆందోళన

న్యూఢిల్లీ : అయోధ్యలో మంగళవారం ప్రారంభమైన రామరాజ్య రథయాత్ర వల్ల ఎదురయ్యే విపత్కర పర్యవసానాల పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఫైజాబాద్ బిజెపి ఎంపి, అయోధ్య నగర మేయర్, ఇతర బిజెపి నేతల సమక్షంలో విహెచ్‌పి ప్రధాన కార్యదర్శి ఈ యాత్రను ప్రారంభించారు. రామాయణంలో వర్ణించినట్లుగా రాముడు శ్రీలంకకు వెళ్ళిన మార్గాన్ని గుర్తు చేసేలా ఈ యాత్ర సాగనుంది. అయోధ్యలోని వివాదాస్పద రామజన్మ భూమిపై పిటిషన్లను సుప్రీంకోర్టు ఇంకా విచారిస్తున్న నేపథ్యంలో అక్కడ రాముడి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభిస్తామని ప్రజలకు ప్రతిన చేయడమే ఈ యాత్ర ప్రధాన ఎజెండాగా వుంది. స్కూలు సిలబస్‌లో రామాయణ బోధనను చేర్చడం, జాతీయ హిందూ దినంగా పాటించడానికి గానూ వారాంతపు శలవును ఆదివారం బదులుగా గురువారానికి మార్చడంతో సహా మొత్తంగా రామరాజ్యాన్ని తిరిగి నెలకొల్పాలన్నది ఈ యాత్ర ప్రధాన ఉద్దేశ్యంగా వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. బిజెపి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, మహారాష్ట్రల గుండా ఈ యాత్ర సాగనుంది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో దాదాపు 15రోజులు సాగుతుంది. అనంతరం కేరళ గుండా తమిళనాడులోని రామేశ్వరానికి చేరుతుంది. మతోన్మాద హిందూత్వ భావనను బలోపేతం చేసేందుకు గానూ మతపరమైన చీలికలు తీసుకురాగల ప్రభావం ఈ యాత్రకు వుందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. ఈ యాత్ర కారణంగా మతోన్మాద ఉద్రిక్తతలు, హింస, అల్లర్లు, ఘర్షణలు చెలరేగే ప్రమాదముందని, తీవ్ర పర్యవసానాలు తప్పవని పొలిట్‌బ్యూరో హెచ్చరించింది. ఈ యాత్ర వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, వ్యక్తిగత స్వేచ్ఛ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. ఆర్‌ఎస్‌ఎస్/బిజెపి నీచపుటెత్తుగడలను బహిర్గతం చేయాల్సిందిగా అన్ని లౌకికవాద, శాంతికాముక శక్తులకు పిలుపునిచ్చింది.

గోరఖ్‌పూర్ మృతుల కేసు
ఆక్సిజన్ సరఫరాదారుడికి బెయిల్ నిరాకరణ

ఆలహాబాద్ : గోరఖ్‌పూర్ మృతుల కేసులో ఆక్సిజన్ సరఫరాదారుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో విచారణ ఇంకా కొనసాగుతోందని, ఈ దశలో బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి యశ్వంత్ వర్మ వ్యాఖ్యానించారు. గోరఖ్‌పూర్‌లోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే బాబా రాఘవ దాస్ మెడికల్ కాలేజ్‌లో గత ఏడాదిలో అనేక మంది చిన్నారులు మృతి చెందారు. ఆగష్టు నెలలో వారం రోజుల వ్యవధిలోనే 60 మందికి పైగా మృతి చెందారు. వీరిలో ఎక్కువ మంది అప్పుడే పుట్టిన శిశువులు. ఆక్సిజన్ అందక వీరంతా మృతి చెందినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని నెలల నుంచి ప్రభుత్వం బిల్లు చెల్లించకపోవడంతో ఆసుపత్రికి ఆక్సిజన్ సరఫరా చేసే పుష్పా సేల్స్ అనే సంస్థ సరఫరాను నిలిపివేసింది.

కారులో కూర్చొని
కుమారుడితో చితకబాదించాడు !
టోల్‌ప్లాజా ఉద్యోగిపై బిజెపి నేత దాడి

మధుర : ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బిజెపి నేత, ఆయన కుమారుడు, మద్దతుదారులు కలిసి టోల్ ప్లాజాలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని మంగళవారం చితకబాదిన దృశ్యాలు సిసిటివిలో చిక్కాయి. బిజెపి ఎమ్మెల్యే పూర్ణ ప్రకాశ్ కారు టోల్ ప్లాజా మీదగావెళ్తుండగా ఒక బారికేడ్ కారు పై భాగాన పడింది. దీంతో బిజెపి ఎమ్మెల్యే కుమారుడు, మద్దతుదారులు కారు నుంచి దిగి అక్కడ ఉన్న ఉద్యోగిని చితకబాదారు. ఈ సంఘటన మౌహన్ టోల్‌ప్లాజా వద్ద జరిగింది. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యే ప్రకాష్ కారులోనే కూర్చొని కుమారుడి వీరంగాన్ని వీక్షించడం గమనార్హం. ఈ మొత్తం సంఘటనకు టోల్ ప్లాజా ఉద్యోగులే కారణమని ఆయన ఆరోపించారు.

ప్రేమికుల రోజున హిందూత్వ శక్తుల అరాచకాలు

న్యూఢిల్లీ : ప్రేమికుల రోజున హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. దేశంలో పలుచోట్ల యువ జంటలపై దాడులు చేయడంతోపాటే రెస్టారెంట్లు, హోటళ్లపై విధ్వంసకాండకు దిగారు. ఆహ్మదాబాద్‌లో సబర్మతి నదీ ఒడ్డున జంటలపై భజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) దాడులకు పాల్పడ్డాయి. బుధవారం భజరంగ్ దళ్, విహెచ్‌పి కార్యకర్తలు కాషాయ జెండాలు, కర్రలు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ భయంకర వాతావరణం సృష్టించారు. జంటలు కనిపిస్తే దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం చేశారు. ఈ విధంగా హిందూత్వ శక్తులు దాడులు చేస్తున్నా మౌన ప్రేక్షకుల్లా వ్యవహరించిన పోలీసులు చివరికి 10 మందిని మాత్రం అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోనూ ప్రేమికుల దినోత్సవం నిర్వహిస్తున్న పబ్బులు, రెస్టారెంట్లపై భజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. నాగ్‌పూర్‌లో ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా భజరంగ్ దళ్ భారీ ర్యాలీ నిర్వహించింది. 'జంటలకు ప్రేమికుల దినోత్సవం నిర్వహించుకునే హక్కు ఉంటే, మాకు మన సంస్కృతిని రక్షించుకునే హక్కు ఉంది' అని కార్యకర్తలు నినాదాలు చేశారు. చెన్నైలో ప్రేమికుల దినోత్సవానికి నిరసనగా ఒక కుక్క, ఒక గాడిదకు భారత హిందూ ఫ్రంట్ పెళ్లి చేసింది. అయితే ప్రేమికుల దినోత్సవానికి మద్దతుగా బెంగళూరులో రెండు గొర్రెలకు కర్నాటక రక్షణ వేదిక వివాహం చేసింది. 'ప్రేమికుల రోజుకు తాము అభ్యంతరం చెప్పమని, ఎందుకంటే ప్రేమకు కులం, మతం ఉండవు' అని కర్నాటక రక్షణ వేదిక నాయకులు విఠల్ నాగరాజ్ తెలిపారు. 'ప్రేమికుల దినోత్సవం రోజున కేంద్రం శెలవు రోజు ప్రకటించాలి. ప్రేమ వివాహం చేసుకున్న జంటలకు రాష్ట్రం రూ. లక్ష వరకూ ఇవ్వాలి' అని ఆయన పేర్కొన్నారు.

ఓటు కోసం బిజెపి మరో బూటకం !
క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర అవకాశం

న్యూఢిల్లీ : ఎన్నికల వేళ ... ఎలాంటి హామీలనైనా, రాజకీయ పక్షాలు, ప్రత్యేకించి బీజేపి, ఓటర్లు ముందు పడేసి వారిని లోబరుచుకునేందుకు వెనుకాడదనే విషయం మరో సారి స్పష్టంగా కనిపిస్తోంది. ఈశాన్య భారత దేశంలోని మూడు రాష్ట్రాలు – త్రిపుర, మేఘాలయతో పాటు నాగాల్యాండ్ శాసనసభకు రానున్న కొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. నాగాల్యాండ్‌లోని జనాభాలో 88 శాతం, మేఘాలయలో 75 శాతం క్రైస్తవులే. వారి ఓట్లను ఆకట్టుకునేందుకు మరో కొత్త వాగ్దానాన్ని బీజేపీ తెరపైకి తెచ్చింది. ముస్లింలకు ఇంతకాలం ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని కేవలం కొద్ది వారాల క్రితమే బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ సర్కారు ఉపసంహరించుకుంది. ఇప్పుడు అదే ప్రలోభాన్ని ఈశాన్య రాష్ట్రాల ఓటర్లను ఎరగా – క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర – ప్రకటించింది. ఈ విషయాన్ని ఈశాన్య ప్రాంత వార్తాసంస్థలు వెల్లడించాయి. అయితే ఇప్పటికీ స్పష్టం కాని విషయం ఏమిటంటే ఈ సదుపాయాన్ని దేశంలోని క్రైస్తవులందరికీ వర్తింపజేస్తుందా లేదా ఈశాన్యంలోని వారికి మాత్రమేనా? లేదా పూర్తిగా నాగాల్యాండ్ క్రైస్తవులకు మాత్రమేనా అన్నది ఇంకా తెలియలేదు. వియ్ ది నాగాస్ వార్తాసంస్థ సమాచారం ప్రకారం నాగాల్యాండ్‌లో అధికారం కట్టబెడితే క్రైస్తవులకు ఉచిత జెరూసలేం యాత్ర చేకూరుస్తామని బీజేపీ ప్రకటించింది. అయితే యూఎన్‌ఐ సంస్థ సమాచారం ప్రకారం ఈ సదుపాయం కేవలం ఆ రాష్ట్రంలోని వారికి మాత్రమే అని తెలుస్తోంది.

బిజెపికి పలాయనం తప్పదు..

- త్రిపురలో కమలం ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పుకొడుతున్న లెఫ్ట్ ఫ్రంట్
- వామపక్ష ప్రభుత్వానికే ప్రజల మద్దతు



ఉత్తర త్రిపురలోని కమలాపూర్‌లో స్థానిక మహిళతో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ కరచాలనం

ప్రజాశక్తి ప్రతినిధి – అగర్తల

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో 'చలో పల్తాయి' (మార్పు చేద్దాం) అనే నినాదంతో బిజెపి ప్రచారం నిర్వహిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ నినాదం 'పరివర్తన్'కు బిజెపి కొంచెం మార్పు చేసింది. పాతబడిన ఈ నినాదాన్నే బిజెపి తన ప్రచారంలో ఉపయోగిస్తోంది. అయితే బిజెపి ప్రచారాన్ని లెఫ్ట్ ఫ్రంట్ సమర్ధవంతంగా తిప్పికొడుతోంది. తాత్కాలికంగా త్రిపురలో తిష్టవేసిన ప్రతిపక్ష బిజెపి ఎన్నికల తరువాత రాష్ట్రం నుంచి పలాయనం సాగించకతప్పదని తిప్పికొడుతోంది. 'బిజెపి చలో పాలాయ్' (బిజెపిని పారదోలండి) అని లెఫ్ట్ ఫ్రంట్ ప్రచారం సాగిస్తోంది. త్రిపురలో 25 సంవత్సరాల నుంచి అధికారంలో ఉంటున్న లెఫ్ట్ ఫ్రంట్‌ను ఎదుర్కొవడానికి బిజెపి అవకాశవాద ఎత్తుగడలతో ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న వేర్పాటువాద ఐపిఎఫ్‌టితో అనైతిక పొత్తు కుదుర్చుకుంది. దేశంలోనే అతి చిన్న రాష్ట్రమైన త్రిపురను విభజించాలని ఐపిఎఫ్‌టి డిమాండ్ చేస్తూ గిరిజన, గిరిజనేతరుల మధ్య ఘర్షణలు రాజేసి హింసాకాండకు పాల్పడుతోంది. మతోన్మాద బిజెపి, ఉగ్రవాద ఐపిఎఫ్‌టి కూటమిని త్రిపుర ప్రజానీకం ఛీకొడుతున్నారు. వామపక్ష కూటమి ప్రచార సభలే ఇందుకు ప్రతీకగా నిలుస్తున్నాయి. లెఫ్ట్‌ఫ్రంట్ కూటమికే ప్రజల మద్దతు ఉందని, రాష్ట్రంలో ఎనిమిదోసారి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడితీరుతుందని అక్కడ ప్రజానీకం కృతనిశ్చయంతో ఉంది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్ నేతృత్వంలో సాగుతున్న ప్రచార బృందానికి ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తుంది. లెఫ్ట్ ప్రభుత్వంలో మౌలిక వసతుల రంగం అభివృద్ది జరుగుతోందని ప్రజానీకం పేర్కొంటున్నారు. రాష్ట్రం గత ఐదు ఏళ్ల నుంచి ప్రగతిపథంలో సాగుతుందని అతింద్ర దేవ్ వర్మ అనే ప్రాథమిక ఉపాధ్యాయుడు తెలిపారు. ఆయన నివసించే పట్టణానికి అతను పనిచేస్తున్న పాఠశాల 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. పాఠశాలకు వెళ్లడానికి గతంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. అయితే ఇటీవల కాలంలో ఆ పర్వత ప్రాంత గ్రామానికి రహదారులు, విద్యుత్ సౌకర్యం కల్పించబడ్డాయని దేవ్ వర్మ తెలిపారు. దీనితో రోజు పాఠశాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్లి వస్తున్నా నని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా స్థానికంగా విద్యావంతులైన యువకులతో విద్యార్థులకు పాఠాలు చెప్పించేవారని వెల్లడించారు. ధర్మాపూర్ మున్సిపాల్టీ చైర్మన్ శక్తి భట్టాచార్య మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ, వ్యవసాయ, వెనకబడిన ప్రజలు వామపక్ష కూటమితోనే స్థిరంగా వున్నారని తెలిపారు. ప్రలోభాలకు గురి చేయడంతోపాటు బలవంతం గా కాంగ్రెస్ నేతలను బిజెపిలోకి చేర్చుకుంటున్నారని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం వామపక్ష కూటమికి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. ధర్మానగర్‌లో గతంలో కాంగ్రెస్ బలంగా ఉన్నా.. ఆ పార్టీ ఎమ్మెల్యే బిజెపిలోకి చేరడంతో కార్యకర్తలంతా వామపక్ష కూటమికి మద్దతుగా నిలుస్తున్నారని అయన వివరించారు. బాగ్‌బాషా నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి బిజిత నాథ భారీ విజయం సాధిస్తాననే నమ్మకంతో ఉన్నారు. మాణిక్ సర్కార్ ప్రభుత్వంలో బిజిత నాథ ఏకైక మహిళా మంత్రిగా ఉన్నారు. అన్నపూర్ణ సర్కార్ అనే ఆశా వర్కర్ కూడా లెఫ్ట్ ఫ్రంట్ గెలుపుపై విశ్వాసంగా ఉన్నారు. అలాగే తాము అధికారంలోకి వస్తే ఆడపిల్లల వివాహాలకు బంగారు ఆభరణాలు ఇస్తామని గ్రామాల్లో బిజెపి ప్రచారం చేస్తున్నట్లు ఆమె వివరించారు. గుర్తింపు, మత విభజన పేరుతో సాగుతున్న అల్లర్లపై పోరాటానికి ఈ ఎన్నికలు ప్రతీకగా నిలుస్తాయని జైనాల్ మాణిక్ పేర్కొన్నారు. కాగా, బృందాకారత్ ప్రసంగం వినడానికి తొమ్మిదో తరగతి చదువుతున్న జాబిలా రియాంగ్ అనే గిరిజన బాలిక తన తండ్రితో కలిసివచ్చింది. ప్రజల నుంచి బృందాకారత్ ప్రచారానికి ఇదే విధమైన మద్దతు లభిస్తుంది.

ఎంపి మంత్రి పిచ్చి ప్రేలాపనలు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో అనుకూల వాతావరణ పరిస్థితులను చక్కదిద్దాలంటే హనుమాన్ చాలీసా పఠించటం, హనుమంతునికి చెందిన హిందూ దేవాలయాల పునర్నిర్మాణం ఒక్కటే మార్గమని బిజెపి నేత రమేష్ సక్సేనా పేర్కొన్న మరుసటి రోజు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపారు. మంత్రి గౌరీ శంకర్ చతుర్భుజ్‌ను మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ తాను మతవిశ్వాసాలను పాటిస్తానని, హనుమాన్ భక్తుడినని, వాతావరణం అనుకూలించకపోయినట్లైతే ఇదే పనిచేస్తానని ఆయన తెలిపారు. గత రెండు రోజులుగా ఏడు జిల్లాలు, 400 గ్రామాలలో కురుస్తున్న వడగండ్లవానలతో రబీ సీజన్‌లోని పంటలు తీవ్రంగా నష్టపోతున్నాయని దీంతో హనుమాన్ చాలీసాను పఠించడమే పరిష్కారమని ఆయన పేర్కొన్నారు. రైతులతో కూడా సమిష్టిగా చాలీసా చదువుతామని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.

బిజెపితో పొత్తు పెట్టుకోం : నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్

పుగొబొటో : త్వరలో జరగనున్న ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకునేది లేదని నాగాలాండ్ అధికార పక్షం నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) స్పష్టం చేసింది. నాగా పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షులు షుర్హోజీ లీయోజిట్సు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు బిజెపితో పొత్తు పెట్టుకుంటే ప్రతికూల ఫలితాలుంటాయన్న సంగతి తమకు తెలుసునని అన్నారు. అయితే నాగాలాండ్‌లో కొత్తగా ఏర్పడిన నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) బిజెపికి 30 సీట్లు ఇచ్చేందుకు తొలుత ముందుకు వచ్చినా, చివరకు 20 సీట్లు మాత్రమే ఇచ్చింది. నాగాలాండ్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలున్నాయి. " నాగా ప్రజలను పణంగా పెట్టి అధికారంలోకి వచ్చే లక్ష్యంతోనే ఎన్‌డిపిపి బిజెపితో సీట్ల సర్దుబాట్లు చేసుకుంది" అని షుర్హోజీ అన్నారు.

అమ్మాయిలు సెల్‌ఫోన్ వాడొద్దు..
మధ్యప్రదేశ్‌లో మహా పంచాయితీ ఆదేశాలు

భోపాల్ : మహిళలు సెల్‌ఫోన్ వాడకంపై ఓ గిరిజన పంచాయితీ నిషేధం విధించింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని షోపూర్ జిల్లాలోని 27 గ్రామాల్లోని సహారా గిరిజనులకు చెందిన పంచాయితీ ఈ ఆదేశాలు జారీచేసింది. సమాజాన్ని సంస్కరించే పని పేరుతో పంచాయితీ సభ్యులు ఇటీవల పలు నిర్ణయాలు చేశారు. ఆ నిర్ణయాల్లో ఒకటి.. అమ్మాయిలు, మహిళలు ఫోన్ వాడకంపై నిషేధం. తమ ధిక్కాను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆ మహాపంచాయితీ నిర్ణయించింది. అమ్మాయి గానీ, మహిళగానీ.. ఫోన్‌వాడుతూ మొదటిసారి పట్టుబడితే భారీ జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే కమ్యూనిటీ నుంచి వెలివేయాలని నిర్ణయించారు. 'మొబైల్ ఫోన్లు మహిళలపై చాలా చెడు ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. మొదటిసారి పట్టుబడితే.. జరిమానా విధిస్తాం. రెండోసారి ఫోన్ వాడుతూ కనిపిస్తే సమాజం నుంచి వెలివేసేందుకు కూడా వెనుకాడం' అని 27 గ్రామాలకు చెందిన మహా పంచాయిత్ సభ్యుడు రామ్ స్వరూప్ అద్వాసీ చెప్పారు. 'మా పంచాయితీ గత నెలలో మూడు సార్లు సమావేశమైంది. మద్యంపై కూడా నిషేధం విధించాం.

నా రాజకీయం రంగు కాషాయం కాదు..నలుపు



- సినీ నటుడు కమల్ హాసన్
- రెండు సినిమాలే వస్తాయి
- 21న పార్టీకి మార్గదర్శకాలు

న్యూఢిల్లీ : ఇక తన నుంచి సినిమాలు రావని ప్రముఖ నటుడు కమల్ హాసన్ అన్నారు. త్వరలో రాజకీయ రంగ ప్రవేశం చేస్తుండటంతో ఆయన విషయాన్ని తెలిపారు. తన పార్టీకి చెందిన మార్గదర్శక సూత్రాలను ఈ నెలలో ప్రకటించనున్నారు. రాజకీయవేత్తగా మారిన నటుడు కమల్‌హాసన్ బోస్టన్‌లోని హార్వర్డ్ యూనివర్సిటీ వద్ద ఒక ప్రైవేటు న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను ఆయన ప్రస్తావించారు. హిందూ అతివాదం ప్రమాదకారి అని తాను విశ్వసిస్తానని చెప్పారు. అయితే తాను ఆ మతానికి విరోధిని కాదన్నారు. రెండు సినిమాలు మాత్రమే తన నుంచి వస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఓడిపోయినా రాజకీయాలలో కొనసాగుతారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ తాను నిజాయితీగా జీవించాలనుకుంటున్నానని చెప్పారు. తాను ఎన్నికల్లో ఓడిపోతానని అనుకోవడం లేదన్నారు. తాను రాజకీయాలలో లేకపోయినప్పటికీ 37 ఏళ్లుగా సమాజ సేవలో ఉన్నాని చెప్పారు. ఈ 37 ఏళ్ళ కాలంలో 10 లక్షల మంది విశ్వసనీయ కార్యకర్తలను సంపాదించుకోగలిగానన్నారు. గత 37 ఏళ్ళుగా వారు తనతోనే ఉన్నారన్నారు. తన సూచనల మేరకు వారు పనులు చేస్తున్నారని చెప్పారు. తన సంక్షేమ ఉద్యమంలోకి మరింత మంది యువకులను తీసుకు వస్తున్నారన్నారు. తన కార్యకర్తల్లో 250 మంది న్యాయవాదులు కూడా ఉన్నారని చెప్పారు. తాను ఇప్పటికే చాలా సంపాదించానని, ఇంకా సంపాదించాలను కోవడం లదేన్నారు. తాను సంతోషకరమైన నిజాయితీతో కూడుకున్నజీవితాన్ని గడపాలనుకుంటున్నానన్నారు. తాను ఒక నటుడిగా మరణించకూడదన్న కోరికతోనే రాజకీయాలలోకి రావాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రజా సేవలో మరణించాలని ఉన్నదన్నారు. తన రాజకీయం రంగు కాషాయం కాదని నలుపు అని స్పష్టం చేశారు. తన రాజకీయాలలో నలుపు ద్రవిడుల గొంతుకను ప్రతిబింబిస్తుందన్నారు. సాంస్కృతికపరంగా తమిళులకు నలుపు చెడ్డ రంగు మాత్రం కాదన్నారు. బిజెపితో కలిసి పనిచేసే ఆలోచన లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల అభిమానినని చెప్పారు. తమిళనటుడు రజనీకాంత్‌తో కలిసి పనిచేస్తారా అని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయనవి కాషాయ రాజకీయాలైతే తాను పొత్తు పెట్టుకోనన్నారు. తమిళ నటుడు రజనీ కాంత్ కూడా త్వరలో రాజకీయాలలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నెల 21న తాను పార్టీ మార్గదర్శకాలను విడుదల చేస్తానని చెప్పారు. తమిళనాడులోని వివిధ జిల్లాల్లో ఎనిమిది గ్రామాలను దత్తత తీసుకోవాలని తాను చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి ఆలోచనలు తెలుసుకునేందుకు హార్వర్డ్ యూనివర్సిటీకి వచ్చినట్లు ఆయన చెప్పారు. అయితే తాను ముఖ్యమంత్రిని కావాలని కలలు కనడం లేదని, ప్రజలకు ఏం చేయగలనని కలలు కంటున్నానని కమల్ చెప్పారు.

మోడీ విధానాలతో పెరిగిన ఉగ్రవాదం : కాంగ్రెస్

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న దిశా నిర్దేశం లేని విధానాల వల్ల ఉగ్రవాదం పెరిగిపోతున్నదని కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మోడీ అనుసరిస్తున్న అసంగత విదేశీ రక్షణ విధానాలు సరిహద్దుల వద్ద కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు, ఉగ్రవాదం పెచ్చరిల్లడానికి దారితీస్తుందని పేర్కొంది. 2014 నాటి ఎన్నికలకు ముందు అప్పటి యుపిఎ ప్రభుత్వానికి సంధించిన ప్రశ్నలకు ఆయనే సమాధానాలివ్వాలని డిమాండ్ చేసింది. దేశ భద్రత రోజురోజుకి ప్రమాదంలో పడుతున్నప్పటికీ ప్రభుత్వం అచేతనంగా వుండటం ప్రజలు దురదృష్టమని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. గడిచిన 44 నెలల్లో మోడీ హయాంలో 286 మంది జవాన్లు, 138మంది పౌరులు మరణించారని, యుపిఎ హయాంలో 115 మంది జవాన్లు, 72 మంది పౌరులు మాత్రమే మరణించారని సింఘ్వీ తెలిపారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో పాకిస్తాన్ 543 సార్లు కాల్పులు విరమణ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడితే గడిచిన 44 నెలల్లో ఎన్డీయే హయాంలో అతకు ఐదు రెట్లు దాదాపు 2,555 సార్లు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనలు జరిగాయని వెల్లడించారు. ఇది మోడీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. . ఈ విషయంలో బిజెపి ప్రభుత్వం ప్రతిసారి పొరుగుదేశం వైపు వేలెత్తిచూపి తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు యత్నిస్తోందని ధ్వజమెత్తారు. తామడిగే ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, దేశ భక్తి గురించి తమకు పాఠాలు చెప్పి తప్పించుకోవద్దని సింఘ్వీ అన్నారు. ప్రభుత్వానికి, ప్రధాన మంత్రికి, పార్టీ అధ్యక్షుడికి ఆయన ప్రశ్నలు సంధించారు. ఆ ప్రశ్నలకు వాస్తవాలతోనూ, గణాంకాలతోనూ సమాధానం చెప్పాలన్నారు. ఆ గణాంకాలు ఆశ్చర్యకరంగా ఉంటాయ న్నారు. గడిచిన 45 నెలల్లో ఉగ్రవాద సంఘటనలు పెరిగిపోయాయన్నారు. మోడీ అనుసరిస్తున్న దిశా నిర్దేశం లేని జాతీయ భద్రతా విధానం సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టిస్తోందని సింఘ్వీ అన్నారు.

ప్రశ్నిస్తే వేధింపులు

ఆధార్ పరిశోధకులు, పాత్రికేయులపై
సర్కార్ డేగ కళ్లు



కదలికలపై అనుక్షణం నిఘా - వేధింపులు కూడా

న్యూఢిల్లీ : జాతీయ గుర్తింపు కార్డు ప్రాజెక్టు ఆధార్‌లో లొసుగులు, లోపాలు గుర్తించిన పరిశోధకులు, జర్నలిస్టులపై ప్రభుత్వం అసాధారణమైన రీతిలో నిఘా ఉంచుతోంది. వారి ప్రతి కదలికలపైనా డేగ కళ్లతో నిఘా ఉంచి పర్యవేక్షిస్తోంది. అవసరమైన సందర్భాల్లో కేసుల ద్వారా వేధింపులకు గురిచేస్తోంది. ఆధార్‌పై పరిశోధనాత్మక కథనాలు రాస్తున్న పాత్రికేయులపై ఇటీవల నమోదైన కేసులే దీనికి తార్కారణం. తమపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమో లేదా ప్రభుత్వ సంస్థలు వేధింపులకు గురి చేయడమో చేస్తున్నాయని ఆధార్ లోపాలపై విమర్శలు గుప్పిస్తున్న పలువురు పరిశోధకులు, పాత్రికేయులు వాపోతున్నారు. రు.500 చెల్లిస్తే చాలు ఆధార్ డేటా అందుబాటులోకి వస్తోందని కథనాన్ని ప్రచురించినందుకు ది ట్రిబ్యూన్‌పై యుఐడిఎఐ గత నెల్లో క్రిమినల్ కేసు నమోదు చేసింది. ఆధార్ గురించి రాసిన ఎనిమిది మంది పరిశోధకులు, కార్యకర్తలు, జర్నలిస్టులతో మాట్లాడిన రాయిటర్స్‌కు ఈ వివరాలు వెల్లడించారు. దీనిపై యుఐడిఎఐ న్యూఢిల్లీలోని సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యుఐడిఎఐ తీసుకున్న చర్యను మీడియా సంస్థలు తీవ్రంగా విమర్శించాయి. ప్రజా ప్రయోజనం కలిగిన వార్తా కథనాన్ని రాసిన జర్నలిస్టును భయపెట్టేందుకు, నిలువరించేందుకు ఈ చర్య తీసుకున్నారని అర్థమవుతోందని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా వ్యాఖ్యానించింది. ఇది పత్రికా స్వేచ్ఛపై నేరుగా దాడి చేయడమేనని విమర్శించింది. ఈ చర్య ఎంతమాత్రమూ సమర్థనీయం కాదని పేర్కొంది. దానిపై స్పందిస్తూ యుఐడిఎఐ, మీడియాను లక్ష్యంగా చేసుకున్నామని ఒక భావన కలిగిస్తున్నారని, కానీ అది నిజం కాదని పేర్కొంది. అనధికారికంగా సమాచారాన్ని అందుబాటులోకి తీసుకున్నందుకు చేపట్టిన చర్య అని పేర్కొంది. అందుకే క్రిమినల్ కార్యకలాపాలను ప్రారంభించామని ఒక ప్రకటనలో తెలిపింది. ఆధార్‌ను సాధికారతా సాధనంగా ఉపయోగించడమెలా అని తెలుసు కోవడానికి బదులుగా అధికారాలను అణగదొక్కే సాధనంగా ఉపయోగించాలని భావిస్తోందని స్వచ్ఛంద సంస్థ డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ డైరెక్టర్ ఒసామా మంజార్ వ్యాఖ్యానించారు. గత మేలో స్వతంత్ర సంస్థ అయిన సెంటర్ ఫర్ ఇంటర్‌నెట్ అండ్ సొసైటీ (సిఐఎస్)కు యుఐడిఎఐ లీగల్ నోటీసు పంపింది. సిఐఎస్ ప్రచురించిన కథనంలోని కొంత సమాచారం అక్రమంగా ఆ వెబ్‌సైట్‌లోకి వెళితేనే వస్తుందని పేర్కొంటూ దానిపై నోటీసులు పంపినట్లు తెలిపింది. ఈ కథనాన్ని రాసిన వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది.

సంక్షిప్తం

తేయాకు గిడ్డంగి భవనం కూలి ఏడుగురు మృతి

కొలంబో : రాజధాని కొలంబోలోని పాత తేయాకు గిడ్డంగి కూలిన దుర్ఘటనలో ఏడుగురు మరణించారు. శిధిలాల కింద ఇంకా కొంతమంది చిక్కుకుని వుంటారని భావిస్తున్నారు. భవనం కూలినపుడు లోపల 12మంది వున్నారని పోలీసులు చెబుతున్నారు. ప్రేమదాస క్రికెట్ గ్రౌండ్‌కు సమీపంలో ఈ పాత భవంతి వుంది. లోపల వున్నవారికోసం పోలీసులు, సైనికులు, అగ్నిమాపక సిబ్బంది గాలిస్తున్నారు. కాగా భవనం కూలడానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు.

నేడు భారత్‌కు ఇరాన్ అధ్యక్షుని రాక

న్యూఢిల్లీ : ఇరాన్ అధ్యక్షుడు హస్సాన్ రౌహనీ గురువారం భారత్‌కు చేరుకోనున్నారు. ఈ నెల 18 వరకూ జరిగే ఈ పర్యటనలో రౌహనీ ప్రధాని మోడీతో ద్వైపాక్షిక ఒప్పందాలు గురించి, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాల గురించి చర్చించనున్నారని విదేశాంగ శాఖ బుధవారం తెలిపింది.

నాగాలాండ్ సిఎంఒ అధికారులకు ఎన్‌ఐఎ సమన్లు

పుగొబొటో : నాగాలాండ్ ముఖ్యమంత్రి టిఆర్ జిలియాంగ్ కార్యాలయానికి చెందిన ముగ్గురు అధికారులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) బుధవారం సమన్లు జారీ చేసింది. రాష్ట్ర నిధుల నుండి నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్–ఖప్లాంగ్ (ఎన్‌ఎస్‌సిఎన్–కె)కు చేసిన చెల్లింపులపై జరుపుతున్న దర్యాప్తులో భాగంగా వీరి పేర్లు వెలుగు చూశాయి. జిలియాంగ్‌కు చెందిన ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటి రుకోవిజో చుప్పో, మరో ఇద్దరు ప్రజా సంబంధాల అధికారులను గువహతి కార్యాలయంలో ఫిబ్రవరి 15న తమ ఎదుట హాజరు కావలసిందిగా కోరుతూ ఎన్‌ఐఎ సమన్లు జారీ చేసింది.

న్యూ ఆర్లీన్స్‌లో కాల్పులు

ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

న్యూ ఆర్లీన్స్ : ఈస్టర్‌కి 46రోజులు ముందు జరిగే మర్డి గ్రాస్ ఉత్సవాల వేదికకు కొద్ది మైళ్ళ దూరంలో బుధవారం చోటు చేసుకున్న కాల్పుల ఘటనలో ఇద్దరు మరణించగా, అనేకమంది గాయపడ్డారు. న్యూ ఆర్లీన్స్ పోలీసులు దీనిపై దర్యాప్తు జరుపు తున్నారు. పోలీసు ప్రతినిధి ఆంబ్రియా వాషింగ్టన్ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానికంగా 9వ వార్డులోని సెయింట్ క్లాడ్ అవెన్యూ బ్లాక్ వద్ద గల గ్యాస్ స్టేషన్ వద్ద కాల్పులు చోటు చేసుకున్నాయి, ఇద్దరు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. మృతి చెందిన వారిలో ఒకరు అక్కడికక్కడే మరణించగా, మరొకరు ఆస్పత్రిలో మరణించారు.

సందర్శన

దక్షిణకొరియాలో జరిగిన 23వ వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొని తిరిగి వచ్చిన ఉత్తరకొరియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్‌ఉన్



సంక్షోభంలో శ్రీలంక పాలక పార్టీ



కొలంబో : స్థానిక ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగలడంతో శ్రీలంక ప్రధాని రనీల్ విక్రమసింఘెకి చెందిన యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) సంక్షోభంలో పడింది. పార్టీ నాయకత్వాన్ని విడనాడాలంటూ ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రధానిగా రాజీనామా చేయాలంటూ అధ్యక్షుడు మైత్రిపాలా సిరిసేన, యుఎన్‌పి నేత విక్రమసింఘెను కోరారు. నాయకత్వ పగ్గాలు మరొకరికి అప్పచెప్పాలంటూ ప్రధానిపై పార్టీలోనే ఒత్తిడి వుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో మహీంద్రా రాజపక్సా పార్టీ ఎస్‌ఎల్‌పిపి 225 మండళ్ళను గెలుచుకుంది. యుఎన్‌పి కేవలం 41మండళ్ళలోనే విజయం సాధించగా అధ్యక్షుడు సిరిసేనకి చెందిన ఎస్‌ఎల్‌ఎఫ్‌పి 11 స్థానాలతో సరిపెట్టు కుంది. విక్రమసింఘెను రాజీనామా చేయాలని సిరిసేన కోరడం సముచితం కాదని యుఎన్‌పి వర్గాలు తెలిపాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడి పార్టీ తమ కన్నా అధ్వాన్న పరిస్థితిలో వుందని పేర్కొన్నాయి. సిరిసేన పార్టీ ప్రతి దశలోనూ అడ్డు తగులుతుండడంతో తమ విధానాలను అమలు చేయలేకపోయామని యుఎన్‌పి పేర్కొంది. అటు సిరిసేన, ఇటు విక్రమసింఘె పార్టీలు ప్రజా మద్దతును కోల్పోయి నందున తక్షణమే పార్లమెంట్‌ను రద్దు చేయాలని రాజపక్సా డిమాండ్ చేస్తున్నారు.

డెన్మార్క్ ప్రిన్స్ హెన్రిక్ మృతి



కోపన్హాగన్ : డెన్మార్క్ క్వీన్ మార్గరెట్ భర్త ప్రిన్స్ హెన్రిక్ మంగళ వారం రాత్రి ఫ్రెడన్స్‌బర్గ్ కాస్టిల్ వద్ద మరణించారని రాయల్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనకు 83 సంవత్సరాలు. గత రెండు వారాల నుండి అనారోగ్యంతో బాధప డుతున్న ఆయన మంగళవారం మృతి చెందారు. రాయల్ హైనెస్ ప్రిన్స్ హెన్రిక్ శాశ్వతంగా నిద్రలోకి జారుకున్నారు. ఆ సమయంలో క్వీన్, ఇద్దరు కుమారులు ఆయన పక్కనే ఉన్నారు అని ప్రకటన విడుదల చేసింది.

మెటారు సైకిళ్ల దిగుమతిపై సుంకం పెంచుతాం


- భారత్‌కు ట్రంప్ బెదిరింపు

వాషింగ్టన్ : భారత్ నుంచి అమెరికాకు దిగుమతయ్యే మోటారు సైకిళ్లకు సుంకం పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించారు. భారత్ దిగుమతి చేసుకునే హార్లీ-డావిడ్సన్ మెటారు సైకిళ్లపై హెచ్చు దిగుమతి సుంకాన్ని ఆయన తప్పుపట్టారు. ఇది అన్యాయమని వ్యాఖ్యానించారు. ట్రంప్ ఉక్కు పరిశ్రమ గురించి మంగళవారం కాంగ్రెస్ సభ్యులతో చర్చిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ సుంకాలను 75 నుంచి 50 శాతానికి తగ్గించడం సరిపోదని, మెటారు సైకిళ్ల దిగుమతిపై తాము జీరోటాక్స్ అమలు చేస్తున్నామని తెలిపారు. వాణిజ్య సంబంధాలు పరస్పరం సహరించుకునేలా ఉండాలని భారత్‌కు ట్రంప్ హితవు పలికారు.

నెతన్యాహుపై ముడుపుల అభియోగాలు

- అభిశంసించాలంటూ పోలీసుల సిఫార్సు
- అటార్నీ జనరల్‌దే తుది నిర్ణయం

జెరూసలేం : బెంజామిన్ నెతన్యాహు ఇటు దేశీయంగా కానీ, అటు అంతర్జాతీయంగా కానీ ఆయన తరానికి చెందిన నేతల్లో మంచి ప్రాబల్యం గల నాయకుడు. నాలుగుసార్లు ప్రధానిగా చేసిన ఆయనపై లంచం తీసుకున్నందుకు రెండు కేసుల్లో అభిశంసించాలంటూ ఇజ్రాయిలీ పోలీసులు మంగళవారం సిఫార్సు చేశారు. అయితే, పోలీసులు సిఫార్సు చేసినంత మాత్రాన నెతన్యాహును అభిశంసించే పరిస్థితి లేదు. వారు కేవలం సిఫార్సు మాత్రమే చేయగలరు. ఆ అభియోగాలతో ముందుకు సాగాలా వద్దా అని నిర్ణయం తీసుకోవాల్సింది అటార్నీ జనరల్. అయితే ఆ నిర్ణయం తీసుకోవడానికి కూడా నెలలు పడుతుంది.



నెతన్యాహును ప్రాసిక్యూటర్లు దర్యాప్తు చేస్తే వెంటనే ఆయన మద్దతుదారులు, ప్రత్యర్థులు, సొంత సంకీర్ణంలోని ప్రత్యర్థులు, మొత్తంగా దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు ప్రభావితమయ్యే అవకాశాలు వున్నాయన్నది వాస్తవం. నెతన్యాహుని విచారిస్తే, నాయకత్వంలో మార్పు వస్తే వారసుడుగా ఎవరు తెరపైకి వస్తారు, ఇజ్రాయిల్- పాలస్తీనా ఘర్షణలపై ఈ మార్పు ప్రభావం ఎలా వుంటుంది అనేవి పలు ప్రశ్నలు తలెత్తు తున్నాయి. మొత్తంగా మధ్య ప్రాచ్యం యావత్తు ఈ పరిణామాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి. పోలీ సులు సిఫార్సు చేసినంత మాత్రాన నెతన్యాహు ప్రధాని పదవి నుండి వైదొలగాల్సిన అవ సరం లేదు. నిజానికి, ఒకవేళ చట్టపరంగా పోరాటం చేస్తున్నా అధికారంలో కొనసాగు తాననే సంకేతాలు నెతన్యాహు ఇస్తూనే వున్నారు.

సంకీర్ణ భాగస్వాముల నుండి ఆయన రాజీనామాకు ఒత్తిడి కూడా వుండే అవకాశం లేదు. త్వరగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తొలుత పుకార్లు కూడా వెలువడ్డాయి. నెతన్యాహు ప్రజాదరణ తగ్గుతోందని ఇటీవల కాలంలో నిర్వహించిన అనేక పోల్స్‌లో వెల్లడైంది.

కారణాలను చూపించడంలో ట్రంప్ సర్కార్ విఫలం

డిఎసిఎపై న్యాయమూర్తి రూలింగ్



వాషింగ్టన్ : పిల్లలుగా వున్నపుడే తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వచ్చిన వారిని వెనక్కి తిరిగి పంపకుండా మినహాయించే కార్యక్రమానికి (డిఎసిఎ) స్వస్తి చెప్పేందుకు చట్టపరంగా తగిన కారణాలను చూపించడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైందంటూ న్యూయార్క్ ఫెడరల్ జడ్జి రూలింగ్ ఇచ్చారు. జిల్లా న్యాయ మూర్తి నికొలస్ గరఫిస్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. డిఎసిఎ కార్యక్రమాన్ని అమలు చేయకుండా నిలిపివేయడానికి అధ్యక్షుడికి అధికారాలు వున్నాయి కానీ అందుకు అనుసరించే చట్టపరమైన కారణాలు సరిగా లేవని లోపభూయిష్టంగా వున్నాయని న్యాయ మూర్తి పేర్కొన్నారు. గతంలో అధ్యక్షుడుగా వున్న ఒబామా ఈ కార్యక్రమాన్ని అమలు చేయా లనే ఆలోచనే రాజ్యాంగ విరుద్ధమైనదని ట్రంప్ అటార్నీ జనరల్ పేర్కొన్న నేపథ్యంలో న్యాయ మూర్తి స్పందిస్తూ ట్రంప్ ప్రభుత్వం తప్పుడు ఆలోచనపై ఆధారపడిందని వ్యాఖ్యానించారు.

ఉచిత రవాణాతో కాలుష్యానికి చెక్




- జర్మనీ నిర్ణయం

ఫ్రాంక్‌ఫర్ట్ : ఉచిత ప్రభుత్వ రవాణాను అమలు పరచడం ద్వారా రహదారులపైకి వచ్చే కార్ల సంఖ్యను తగ్గించాలని జర్మనీ భావిస్తోంది. యురోపియన్ యూనియన్ విధించిన వాయు కాలుష్య ప్రామాణికాలను ఎదుర్కొనడం ద్వారా పెద్ద మొత్తంలో జరిమానాలు నివారించడానికి గానూ ఈ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు మంత్రులు తెలిపారు. ప్రైవేటు కార్లను తగ్గించాలంటే ముందుగా ఉచితం ప్రజా రవాణా వ్యవస్థకు రూపకల్పన చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పర్యావరణ మంత్రి బార్బరా హెండ్రిక్స్ తెలిపారు. ఈమేరకు ఇయు పర్యావరణ కమిషనర్ కార్‌మెను వెల్లాకి లేఖ రాశారు. అనవసరపు జాప్యాలు లేకుండా తక్షణమే సమర్థవంతంగా వాయు కాలుష్యంపై పోరు సల్పడం జర్మనీకిగల తొలి ప్రాధాన్యత అని పర్యావరణ, ఆర్థిక, వ్యవసాయ మంత్రులు తెలిపారు.

ఇయుకాలుష్య పరిమితులను ఎదుర్కొనడానికి తీసుకుంటున్న చర్యలను వివరించడానికి జర్మనీ మరో 8 ఇయు సభ్య దేశాలకు జనవరి 30వ తేదీ గడువుగా వుంది లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కొనాల్సి వుంటుంది. అయితే తమ చర్యలు వెల్లడించడానికి అదనంగా సమయం కావాలంటూ కోరారు.

ఉచిత రవాణాతో పాటు ఈ ఏడాది చివరికి మరికొన్ని చర్యలు తీసుకుంటామని జర్మనీ మంత్రులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ రవాణా వైపునకు మరింత మంది ప్రజలను మళ్లించాలంటే కొత్త బస్సులు, ట్రామ్‌లు కొనాల్సి వుంటుందని, కొత్త టైమ్‌టేబుల్స్‌ను పాటించాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని అన్నారు.

ఫిజీ దీవులకు తుపాను నష్టం



వెల్లింగ్టన్/సిడ్నీ : కేటగిరీ 4కి చెందిన అత్యంత ప్రమాదకరమైన గీత తుపాను నుండి ఫిజీ చాలా వరకు తప్పించుకోగలిగిందని, ప్రజలు ఎక్కువగా వుండే ప్రాంతాలు పెద్దగా ప్రభావితం కాలేదని ప్రభుత్వం తెలిపింది. ఫిజీకి దక్షిణ ప్రాంత దీవులైన ఓనో ఇలావు, వాటోవాలను తీవ్రంగా కుదిపివేసింది. గంటకు 275 కిలో మీటర్ల వేగంతో గాలులు, భారీ వర్షాలతో ఆ దీవులు కొంతమేరా దెబ్బతిన్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసమైంది. అయితే నష్టం చాలా పరిమిత స్థాయిలోనే వుందని ఫిజీ జాతీయ విపత్తు నిర్వహణా విభాగం తెలిపింది. దీవులు కాస్త దెబ్బతి న్నా ప్రజలు ఎక్కువగా వుండే ప్రాంతాల్లో నష్టం జరగలేదని మౌలిక సదుపాయాల వీ కూడా దెబ్బ తినలేదని అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి టోంగాలో గీతా తుపాను బాగా నష్టాన్ని కలిగించింది. వరదలు కూడా సంభవించాయి.

మొదటి పేజీ తరువాయి

బ్యాంకుల్లో డబ్బుల్లేవ్

చేస్తోంది. అందుకే తక్షణమే అప్రమత్తం కావాలని నిర్ణయించింది. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయమే దీనిపై స్పందించడం గమనార్హం. ఇదే సమయంలో కేంద్రం ప్రవేశపెట్టనున్న ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లుపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న భయాన్ని కూడా ప్రభుత్వం వ్యక్తంచేస్తోంది. ప్రజల సమస్యలపై కాకుండా కేంద్రం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లుకు ఎక్కడ ఇబ్బందులు కలుగుతాయోనన్న ఆందోళనే రాష్ట్ర ప్రభుత్వంలో కనిపిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలోనే ఆ మూడు జిల్లాల్లో పరిస్థితి మరింత దిగజారకుండా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు రిజర్వ్‌బ్యాంకుతో చర్చించాలని ఆర్థికశాఖ అధికారుల్ని సిఎంఒ ఆదేశించింది. ఇవే అంశాల్ని నేరుగా రిజర్వ్‌బ్యాంకు దృష్టికి, తద్వారా కేంద్రానికి వివరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఆర్థికశాఖకు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక ఆదేశాల్ని కూడా జారీచేసింది. అధికారులు తయారుచేసిన నివేదిక, వివిధ జిల్లాల్లో బ్యాంకర్ల నుంచి అందుతున్న వివరాల మేరకు కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లోని బ్యాంకుల్లో నగదు కొరత ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఒక్కో జిల్లాలో రోజుకు 50 కోట్ల వరకు ఎటిఎంల ద్వారా లావాదేవీలు జరుగుతుండగా, అందులో 40 శాతం వరకు స్టేట్ బ్యాంకు ఎటిఎంలలోనే జరుగుతున్నాయి. అయితే ఈ జిల్లాలకు రిజర్వ్‌బ్యాంకు నుంచి తక్కువ నిధులు వస్తున్నట్లు బ్యాంకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ నగదు వల్ల వినియోగదారులపై నియంత్రణ విధించడం, అనేక ఎటిఎంల వద్ద నగదు లేదు అంటూ బోర్డులు కనిపిస్తుండడంతో ప్రజల నుంచి కూడా విమర్శలు, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఈ పరిస్థితి మూడు జిల్లాలకే పరిమితం కాకుండా ఇతర జిల్లాల్లో కూడా నో క్యాష్ బోర్డులు తరచూ దర్శనమిస్తున్నాయి. గత మూడు రోజులుగా రాజధాని నగరాలైన గుంటూరు, విజయవాడల్లో కూడా స్టేట్‌బ్యాంకు ఎటిఎంలలో నగదు సమస్య తీవ్రంగా వేధిస్తోంది.

సామాజిక పింఛన్లలపైనా..

సామాజిక పింఛన్లు తీసుకుంటున్న వారి నుంచి కూడా వ్యతిరేకత మరింత ఎక్కువవుతోంది. ఖాతాల్లో కనీస నిల్వ 2500 రూపాయల వరకు ఉండాలన్న నిబంధన కూడా విమర్శలకు తావిస్తోంది. అదనంగా చేసుకుంటున్న విత్‌డ్రాయల్స్‌పైనా సర్‌ఛార్జీని వసూలు చేయడం, కనీస నిల్వ లేదంటూ అదనపు రుసుంను వసూలు చేయడంపైనా ఖాతాదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన స్థాయిలో నగదు ఆర్‌బిఐనుంచి రాకపోవడమేనని ఈ సమస్యలకు కారణమని బ్యాంకర్లు వివరిస్తున్నారు. అందుకే ప్రజలు కూడా తమ నగదును బ్యాంకుల్లో ఉంచడం కన్నా విత్‌డ్రా చేసుకోవడమే మంచిదన్న భావానికి కూడా వస్తున్నారు. ఇది బ్యాంకర్లలో కూడా వ్యాపార ఆందోళనకు కారణమవుతోంది.

ఎఫ్‌ఆర్‌డిఐ కారణంగానే

2016 నవంబర్‌లో పెద్ద నోట్ల రద్దు సమయంలో నెలకొన్న పరిస్థితే నేడూ దర్శనమిస్తోంది. అప్పట్లో ఒక్క బ్యాంకులో కూడా నగదు లభించని పరిస్థితి నెలకొనగా, తరువాత కాలంలో కొంత పరిష్కరించగలిగారు. అయితే తాజాగా ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం తీసుకున్న చర్యలు మరోసారి నగదు కొరతకు దారితీస్తోంది. ఈ బిల్లు వల్ల నష్టం జరుగుతుందని సామాజిక మాధ్యమం, ఇతర ప్రసార సాధనాల్లో జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో నగదు కొరత తీవ్రమైంది. ఇదే సమయంలో రిజర్వ్‌బ్యాంకు నుంచి రావాల్సిన నగదు కూడా తగ్గిపోవడంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. అందుకే విత్‌డ్రాయల్స్‌వైపు మొగ్గు చూపిస్తున్నారని బ్యాంకర్లు కూడా అంగీకరిస్తున్నారు.

శాశ్వత ఉద్యోగాలతోనే పేదరిక నిర్మూలన

6.5 శాతం పెరుగుతుందని తెలిపారని, దీని ప్రకారం 2020 నాటికి ఎగువ మధ్యతరగతి ఆదాయం గల దేశంగా భారత్ మారుతుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది.ప్రస్తుతం భారత్‌లో తలసరి ఆదాయం 6,538 డాలర్లని, ఇది అమెరికా కొనుగోలు శక్తిలో 12 శాతం మాత్రమేనని బ్యాంక్ తెలిపింది. భారత్‌లో పేదరికాన్ని నిర్మూలించాలంటే పేదరికాన్ని తొలిగించడంతో పాటు సంపదను అందరికి అందేటట్లు చేయడంపై కూడా దృష్టి పెట్టడం అవసరమని నివేదిక పేర్కొంది. పెరుగుతున్న యువ జనాభాకు తగిన విధంగా ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాల కల్పనలో అధిక జనాభా భారత్‌కు అవరోధంగా ఉందని నివేదిక తెలిపింది. 2005 నుంచి 2012 మధ్యకాలంలో భారత్ ఆర్థిక వ్యవస్థ ఏడాదికి 3 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించిందని, అయితే అయితే ప్రతీ ఏడాది పని చేసే వయస్సు జనాభా 13 మిలియన్లు పెరిగిందని తెలిపింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపిఎఫ్ఒ) సమాచారం అధారంగా గత ఏడాది 7 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక తెలిపినట్లు బ్యాంక్ తెలిపింది. భారత్‌లో కఠిన కార్మిక నిబంధనలు కారణంగా కార్మికులకు భద్రత కల్పించడం, కొత్తవారు ఉద్యోగాల్లో చేరడం కష్టంగా వుందని బ్యాంక్ తెలిపింది.

అర్చకుల ఆకలి కేకలు


(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జున, ద్వారకా తిరుమల శ్రీవేంకటేశ్వర, సింహాచల నరసింహ, అన్నవరం సత్యనారాయణ, మహానంది వంటివి ప్రధాన ఆలయాలు కాగా.. ఏడాదికి రూ. 25 లక్షల నుంచి కోటి పైబడి ఆదాయం వచ్చే ఆలయాలు 115 ఉన్నాయి. రూ. 2 లక్షల నుంచి రూ.25 లక్షల లోపు ఆదాయం వచ్చేవి 794 ఉండగా, రూ.2 లక్షలకు లోపు వచ్చేవి 22,788 ఆలయాలు ఉన్నట్లు అధికారిక అంచనా. ఇవి కాకుండా ధూపదీప నైవేద్య పథకం కింద మరో 1,406 ఆలయాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటిలోనూ లక్షా10 వేల మంది అర్చకులున్నట్లు ఎపి అర్చక సమాఖ్య వెల్లడిస్తోంది.

సమాన పనికి సమాన వేతనం ఎక్కడ?

కోటి రూపాయల పైబడి ఆదాయం వస్తున్న 8 ప్రధాన ఆలయాల్లో మాత్రమే అర్చకులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం వస్తోంది. 25 లక్షలకు పైబడి ఆదాయం వస్తున్న ఆలయాల్లో రూ. 7 వేల నుంచి 15 వేల వరకు జీతం ఇస్తున్నారు. మిగిలిన 22 వేల ఆలయాల్లో అర్చకులకు కేవలం రూ.3 వేల నుంచి రూ.6 వేలు మాత్రమే వస్తోంది. ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తున్న ఆలయాల్లో అర్చకుల వేతనంతో పాటు పూజా సామగ్రి, నైవేద్యం అన్నింటికీ కలిపి నెలకు కేవలం రూ. 5 వేలు అందుతోంది. ఈ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు నెలకు రూ. వెయ్యి కూడా వేతనంగా మిగలకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచకవడంపై అర్చకులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమయ్యారు. అర్చక సమాఖ్య జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. 16న విజయవాడలో అర్చక ఆత్మావలోకన సదస్సును నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను పెద్దఎత్తున చేపట్టేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం.

తెలంగాణా తరహాలో పిఆర్‌సిని అమలు చేయాలి



తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలోనే అర్చకులందరికీ 2015 పిఆర్‌సిని అమలు చేయాలి. అర్చకులందరికీ సమాన వేతనాన్ని అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా ఈ ప్రభుత్వానికి, పాలకులకు పట్టకపోవడం దురదృష్టకరం. నిత్యం భగవంతుని సేవలో తరించే వేలాది మంది అర్చకులు మూడుపూటలా తినే పరిస్థితిలేక పస్తులు ఉంటున్నారు. ధూపదీప నైవేద్య పథకం ద్వారా ఒక్కో ఆలయానికి 5 వేలు ఇస్తే ఏం సరిపోతుంది?. పూజా కైంకర్యం, ప్రసాదాలకే రూ.4 వేల నుంచి రూ. 4,500 వరకూ ఖర్చవుతోంది. మిగిలిన రూ. 500లతో అర్చకులు ఎలా బతకాలి? ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణా తరహా అర్చకులందరికీ పే స్కేల్ ఇవ్వాలి. **– పెద్దింటి రాంబాబు, అర్చక సమాఖ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

అర్చక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి



అర్చక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రూ.200 కోట్లు కేటాయించాలి. అన్ని ఆలయాల అర్చకులకు ఒకే పే స్కేల్ ఇస్తూ వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలి. కాంట్రాక్టు అర్చకులందరినీ పర్మినెంట్ చేయాలి. అర్చక స్వాములందరికీ హెల్త్ కార్డులను మంజూరు చేయాలి. ధూప,దీప నైవేద్య పథకానికి ఒక్కో ఆలయానికి రూ.6 వేలివ్వాలి. ఈ డిమాండ్లన్నీ కొత్తవేమీకాదు. 2014 ఎన్నికలకు ముందు బిజెపి, టిడిపి నాయకులు అర్చక సమాఖ్యకు ఇచ్చిన హామీలే. అయితే అధికారంలోకి వచ్చాక మా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. **– మేడూరి శ్రీనివాసమూర్తి, అర్చక సమాఖ్య**

అర్చకులైనా పోరాడాల్సిందే

ఇన్నాళ్లూ కనీస వేతనాలు లేక అర్చకులు 'దేవునికి' మొరపెట్టుకుంటూ వచ్చారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా పట్టించుకోలేదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను విస్మరించారని అర్చకులంతా ఉద్యమ బాట పట్టారు. వీరి పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతోంది. కనీస వేతనం ఖచ్చితంగా అమలు చేయాల్సిందే. **– సుబ్రమణ్యం, సిఐటియు**

పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ స్కామ్

(మొదటిపేజీ తరువాయి)

చేసే ఈ కుంభకోణం వల్ల బ్యాంకుకు ఏ మేర నష్టం వాటిల్లుతుందో పిఎన్‌బి స్పష్టంగా వెల్లడించలేదు. కాగా ఇతర బ్యాంకుల్లోనూ ఈ తరహా మోసం జరిగి ఉండొచ్చుని సంకేతాలు వస్తున్నాయి. ఇంత జరిగిన ఈ వ్యవహారంపై ఆ బ్యాంకు స్పష్టమైన ప్రకటన చేయకపోవడం గమనార్హం. ఈ స్కాం విషయం బయటికి రాగానే పిఎన్‌బి షేర్ అమాంతం పడిపోయింది. దీనిపై సిబిఐ దర్యాప్తు చేస్తున్నట్లు బ్యాంకింగ్ సెక్రటరీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. కాగా దీనిపై పెద్దగా ఆందోళన చెందాల్సిందేమీ లేదని, నియంత్రణ దాటి ఏమీ జరగలేదని ఆర్థిక సేవల కార్యదర్శి లోక్ రాజన్ పేర్కొనడం గమనార్హం.

మరో మూడు బ్యాంకులు బలి..

ఈ కుంభకోణంలో మరో మూడు బ్యాంకులు కూడా బలి అయినట్లు తెలుస్తోంది. రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకులతో పాటు ప్రయివేటు రంగ విత్త సంస్థ యాక్సిస్ బ్యాంకులు కూడా ప్రభావితం అయ్యాయి. పిఎన్‌బి ఇచ్చిన రుణ ఆధారిత లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌ఒయు) ద్వారా ఈ బ్యాంకులు కూడా ఆ మోసపూరిత కంపెనీలకు రుణాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ బ్యాంకులకు చెందిన విదేశీ శాఖలు కొనుగోలుదారులకు రుణాలిచ్చాయి. ఇందులో ఒక్క వజ్రాల కంపెనీకే అప్పులిచ్చినట్లు పక్కాగా తెలుస్తోంది. ఏళ్ల తరబడి ఎల్‌ఒయు ఆధారంగా విచ్చలవిడిగా రుణాలు పొందినట్టు సమాచారం. ఆ అభరణాల సంస్థ హాంగ్‌కాంగ్, దుబాయ్, న్యూయార్క్‌ల్లోనూ శాఖలు కలిగి ఉంది. 2010 నుంచే ఈ రుణాల మంజూరు జరిగిందని సమాచారం. కాగా గత జనవరి 5న పలు ఆరోపణలు రాగా, అదే నెల 25 నుంచి చెల్లింపుల సంక్షోభం చోటు చేసుకుంది. దీంతో ఈ వ్యవహారం బయట పడింది.

నిరవ్ మోడీ పనే..

వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీ ఆయన కుటుంబ సభ్యులు, బిజినెస్ పార్టనర్ మెహల్ చోక్సి ఈ కుంభకోణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ విచారణ చేపట్టింది. ఈ మొత్తాన్ని ఖాతాదారులు ఇతర బ్యాంకుల ద్వారా విదేశాలకు తరలించినట్లు తెలుస్తోంది. ఇదే బ్యాంకుకు సంబంధించి రూ.280 కోట్ల చీటింగ్ కేసులో భాగంగా గత వారమే మోడీని సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనపై విచారణ జరుగుతోంది. అయితే తాజాగా గుర్తించిన మోసపూరిత లావాదేవీలకు, గతంలోని వాటికి ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది.

పిఎన్‌బి షేర్ 16% పతనం..

కుంభకోణ విషయం వెల్లడి కావడంతో బిఎస్‌ఇలో పిఎన్‌బి షేర్ తీవ్ర ఒత్తిడికి గురైంది. ఉదయం రూ.160 వద్ద మొదలైన సూచీ రోజంత పడిపోతూ తుదకు 9.81 శాతం లేదా రూ.15.85 పతనమై రూ.145.80 వద్ద ముగిసింది. ఈ కుంభకోణంపై బ్యాంకు ఎలా వ్యవహరించనుంది, న్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డబ్బులను రికవరీ చేయగలుగుతారా?.. ఎలా చేస్తారు? అనే అనుమానాల్లో ఆ బ్యాంకు సూచీ ఒత్తిడికి గురైంది.

బోళ్ల బుల్లిరామయ్య కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

(టెక్నికల్)గా చేరారు. సుగర్ పరిశ్రమను అభివృద్ధి చేయడంతోపాటు అనేక పరిశ్రమలు స్థాపించారు. ఇస్రోకు అవసరమైన రాకెట్ ఇంధనం సరఫరా చేసే పరిశ్రమను తణుకులో స్థాపించి పట్టణానికి ప్రపంచంలోనే మంచి గుర్తింపు తెచ్చారు. 2011 నుంచి ఆంధ్రా సుగర్స్ ఎండిగా ఉన్నారు. 1984లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన ఏలూరు ఎంపిగా ఏడుసార్లు పోటీ చేసి నాలుగు సార్లు గెలుపొందారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిగానూ పనిచేశారు. బుల్లిరామయ్య మృతితో తణుకులో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేశారు. ఆయనకు కుమారుడు బోళ్ల రమేష్‌కుమార్, కుమార్తె ఝాన్సీజయలక్ష్మి ఉన్నారు. బుల్లిరామయ్య పార్థివదేహానికి స్వగ్రామమైన తాటిపాకలో గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పదవులకు వన్నె తెచ్చారు : సిఎం చంద్రబాబు

కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లి రామయ్య ప్రజలకు ఎన్నో సేవలందించి, చేపట్టిన పదవులకు వన్నెతెచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం తణుకు విచ్చేసిన ఆయన బుల్లిరామయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బుల్లిరామయ్య కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. బుల్లి రామయ్య క్రమశిక్షణ గల వ్యక్తిగా పేరుపొందారన్నారు. ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని చెప్పారు. బుల్లిరామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో మంత్రులు కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావు, కెఎస్ జవహర్, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు ఉన్నారు.

హోదా...గోదా...

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలపై టిడిపి శ్రేణుల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నమ్మకం ఉందంటూనే పోరాటం చేయాలనడం దేనికి సంకేతమన్న ప్రశ్నలూ వస్తున్నాయి. ఈ సమావేశం తరువాత మీడియాతో మాట్లాడిన పలువురు మంత్రులు, టిడిపి నేతలు కూడా ఇదే విధంగా స్పందించారు. అనంతపురం ఎంపి జెసి దివాకర్‌రెడ్డి చంద్రబాబు అంటే మోడీకి ద్వేషమని వ్యాఖ్యానించడం విశేషం. గతంలో తృతీయ ఫ్రంట్‌ను నిర్వహించిన అనుభవం బాబుకు ఉందని, భవిష్యత్‌లో బాబు తనకు పోటీ అవుతారని మోడీ భావిస్తుండవచ్చని ఆయన అన్నారు.

మార్చి 5 తరువాత ఊహించని నిర్ణయం : మంత్రులు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడిన మంత్రులు అచ్చెన్నాయడు, సోమిరెడ్డి, నక్కా ఆనందబాబు, గంటా శ్రీనివాసరావులు వైసిపి పై విరుచుకుపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వైసిపి రాజీనామాల అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చిందని వారు అన్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఏప్రిల్ 6వ తేదివరకు ఆగాల్సిన అవసరం లేదని, తక్షణమే రాజీనామాలు చేయాలని అన్నారు. తాము వైసిపి మాదిరి డ్రామాలు ఆడమని చెప్పిన వారు, సరైన సమయం కోసం ఎదురు చేస్తున్నామని, ఆ సమయం రాగానే సరైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మార్చి 5 తరువాత ఊహించని నిర్ణయాలు ఉంటాయని వారు తెలిపారు.

టిడిపికి భయం పట్టుకుంది : వైసిపి

ప్రత్యేకహోదా ఆంధ్రల హక్కని, దానికోసం ఎంత పోరాటం చేయడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని నెల్లూరు జిల్లా పాదయాత్రలో ఉన్న వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో మాట్లాడిన ఆ పార్టీ నేతలు తమ ఎంపీల రాజీనామాల ప్రకటనతో తెలుగుదేశం పార్టీకి భయం పట్టుకుందని వ్యాఖ్యానించారు. హోదా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు రాజీనామాల నిర్ణయాన్ని ప్రకటించామని అంబటి రాంబాబు తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు. ఆంధ్రుల పౌరషాన్ని చాటిచెప్పేందుకే రాజీనామాల నిర్ణయం తీసుకున్నామని, దీంతో తెలుగుదేశం పార్టీకి భయం పట్టుకుందని ఎంపి వైవి సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు. మరో నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ బడ్జెట్ పై మాట్లాడటానికి చంద్రబాబు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

అంబాని పర్యటనతో మారిన టిడిపి వైఖరి

కేంద్రంపై నమ్మకం ఉందంటూ ముఖ్యమంత్రితో పాటు, పలువురు మంత్రులు బుధవారం మాట్లాడటం వెనుక మఖేష్ అంబాని ప్రభావం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అంబాని మంగళవారం అమరావతికి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన పర్యటనకు ముందు టిడిపి నేతలు కొంతమేరకైనా గట్టిగా మాట్లాడారని, బుధవారం వారి తీరు పూర్తిగా మారిందన్న అభిప్రాయాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.

మంజుల డైరెక్షన్ చేస్తుందనుకోలేదు

మహేష్ బాబు



స్వరూప్, పి.కిరణ్, మహేష్ బాబు, జాన్వి, మంజుల ఘట్టమనేని, అమైరా దస్తూర్, సందీప్ కిషన్

"మంజుల డైరెక్షన్ చేస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఒకసారి హాలీడేస్ టైమ్‌లో తను ఏదో రాసుకొంటుంటే.. ఏదైనా కవిత రాసుకొంటుందేమో అనుకొన్నాను. కానీ సినిమా కోసం కథ రాసుకొంటుంది అని మాత్రం అనుకోలేదు. తను కథ ప్రిపేర్ చేసుకొని, సినిమా చేయబోతున్నాను అని చెప్పినప్పుడు మాత్రం నేను షాక్ అయ్యాను. ఒకరకంగా ప్రౌడ్ ఫీల్ అయ్యాను కూడా. ఈ సినిమాకి నేను వాయిస్ ఓవర్ కూడా ఇచ్చాను. విజువల్స్ నాకు బాగా నచ్చాయి. మా కిరణ్ సపోర్ట్, గైడెన్స్ ఉండడం సినిమాకి చాలా ప్లస్ అయ్యింది. భవిష్యత్‌లో మా అక్క మంజులతో సినిమా కూడా చేస్తానేమో" అని మహేష్ బాబు అన్నారు.

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్-ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్-పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్-అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా నటించారు. మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రాన్ని శుక్రవారం విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రీరిలీజ్ వేడుక ఏర్పాటు చేశారు.

మంజుల ఘట్టమనేని మాట్లాడుతూ 'ఈ సినిమా కథ రాయడం మొదలుకొని, పూర్తి చేయడం వరకూ కూడా ఒక నేచురల్ ప్రొసెస్‌లా జరిగింది. మా తమ్ముడు మహేష్, మా నాన్న గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమా కోసం వాయిస్ ఓవర్ చెప్పరా అని అడిగితే ఒప్పుకొన్నాడు. కానీ రెండు మూడు వేరియేషన్స్‌లో చెప్పమంటేనేమో "వేరే వాళ్ళతో చెప్పించుకో" అనేవాడు. ఒకానొక సందర్భంలో మహేష్ బాబు కొడుకు గౌతమ్ వెళ్ళి "నాన్న మంజుల ఆంటీ సినిమాలో ఎప్పుడు యాక్ట్ చేస్తావ్?" అని అడిగితే చాలా సింపుల్‌గా "అదే నా ఆఖరి సినిమా అవుతుంది" అన్నాడట (నవ్వుతూ..). రవియాదవ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాకి బిగ్గెస్ట్ ఎస్సెట్. దినేష్ మాస్టర్ కంపోజ్ చేసిన సాంగ్స్ చాలా స్పెషల్‌గా ఉంటుంది' అని తెలిపారు.

'సైరా' రెండో షెడ్యూల్



చిరంజీవి

చిరంజీవి తదుపరి చిత్రం 'సైరా నరసింహారెడ్డి' రెండో షెడ్యూల్ వచ్చే వారం నుంచి మొదలు కానుంది. కొణిదెల ప్రొడక్షన్స్‌లో రామ్ చరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. స్వతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్నారు. డిసెంబర్‌లో మొదటి షెడ్యూల్ జరిగింది. అప్పుడు కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. తర్వాల సంక్రాంతి వల్ల విరామం తీసుకున్నారు. ఇప్పటికీ మళ్లీ సెట్స్‌పైకి వెళ్లలేదు. వీఎఫ్ఎక్స్‌ను మిక్స్ చేస్తూ ఓ పోరాట సన్నివేశం తీస్తారని దానికి అనుగుణంగా చైనా వెళ్లి చిరంజీవి తయ్యారై వచ్చారట. ఇప్పుడు కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. నయన తార ఇందులో కథానాయికగా చేస్తుంది. ఈ షెడ్యూల్‌లో నయన కూడా పాల్గొననుంది. రెహమాన్ ఈ చిత్రం నుంచి తప్పుకోవడంతో ఎం.ఎం. కీరవాణి సంగీత బాధ్యతలు తీసుకున్నారు.

ప్రేమించుకోవడం...విడిపోవడం



నితిన్

'ఛల్ మోహన్ రంగ'...నితిన్, మేఘా ఆకాష్' జంటగా నటించిన చిత్రం. శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ నిర్మిస్తున్నాయి. ఇది నితిన్‌కు 25వ చిత్రం. త్రివిక్రమ్ కథను అందించారు. ఈ చిత్రం టీజర్‌ను పవన్ కల్యాణ్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేశారు. 'వర్షాకాలంలో కలుసుకున్న మేము.. శీతాకాలంలో ప్రేమించుకుని.. వేసవికాలంలో విడిపోయాం' అని నితిన్ కథ గురించి చెబుతూ ఉంటే 'మీరిద్దరూ వెదర్ రిపోర్టర్సా భయ్యా' అంటూ మరో వ్యక్తి ప్రశ్నించడం, నితిన్ తిడుతూ కనిపించడం ఈ టీజర్‌లో చూపించారు. నిఖితారెడ్డి సమర్పణలో నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈచిత్రానికి కృష్ణ చైతన్య దర్శకత్వంలో వహిస్తున్నారు. ఈ చిత్రం ఆఖరి పాట చిత్రీకరణ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమయింది. శేఖర్ ఈ పాటకు నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఏప్రిల్ 5న చిత్రం విడుదల కానుందని తెలిపారు. ఇదొక కుటుంబ కథా చిత్రమని దర్శకుడు కృష్ణ చైతన్య చెప్పారు.

చిరంజీవి షాక్ అయ్యారు

వరుణ్ తేజ్



బాపినీడు, రాశీ ఖన్నా, వరుణ్ తేజ్, వెంకీ అట్లూరి, దిల్ రాజు, బీవీఎస్ఎన్ ప్రసాద్, తమన్ తదితరులు

"సినిమా కథని అందరూ నమ్మి చేశారు. అందరికన్నా ముందు దిల్‌రాజు నమ్మారు. దర్శకుడు అట్లూరి వెంకీ చాలా ఇష్టపడి చేసుకున్న సబ్జెక్ట్ ఇది. ఆద్యంతం కన్విక్షన్ ఉంటుంది. చిరంజీవి సినిమా చూసి షాక్ అయ్యారు. కొత్త డైరెక్టర్ ఇంత బాగా చేశారా? అని చిరంజీవి షాక్ అయ్యారు. సినిమా విడుదలయ్యాక నాది, రాశీ ఖన్నాది ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ బావుందని చాలా మంది అంటున్నారు" అని వరుణ్ తేజ్ అన్నారు. తాజాగా వరుణ్ తేజ్ చేసిన చిత్రం 'తొలిప్రేమ'. విజయవంతంగా రనవుతున్న నేపథ్యంలో చిత్రబృందం థాంక్స్ టూ మీట్ ఏర్పాటు చేసింది.

దిల్‌రాజు మాట్లాడుతూ 'వెంకీ ఒక రోజు నా ముందు కూర్చుని ఈ కథను బీవీఎస్ఎన్‌తో చేయడానికి సిద్ధమైనట్టు చెప్పారు. నేను సరేననుకున్నా. ఒక అసిస్టెంట్ డైరెక్టర్ వెయిటింగ్‌లో ఉన్నప్పుడు పడే ఆవేదన నాకు తెలుసు. ఎమోషన్స్, రిలేషన్స్ నాకూ బీవీఎస్ కుటుంబానికి మధ్య బాగా ఉన్నాయి. అందుకే ఈ సినిమా మరలా నా చేతుల్లోకి వచ్చింది. కరుణాకరన్ పవన్‌కల్యాణ్‌తో 'తొలిప్రేమ'ను క్రియేట్ చేస్తే, ఇప్పుడు వెంకీ అట్లూరి మరలా క్రియేట్ చేశారు. 'ఫిదా' తర్వాత వరుణ్ తేజ్ మరలా ఈ సినిమాలో చాలా బాగా చేశారు. మూడు పాత్రల్లో తను చూపించిన వైవిధ్యం అందరినీ మెప్పించింద'ని తెలిపారు.

హీరోయిన్ రాశీఖన్నా మాట్లాడుతూ 'ఈ సినిమాకు వచ్చిన రివ్యూలన్నీ చదివాను. ట్విట్టర్‌లోనూ నన్ను వర్ష అని పిలుస్తున్నారు. ఈ అవకాశం ఇచ్చిన వెంకీ అట్లూరికి ధన్యవాదాలు. ఈ సినిమాతో నాకు మహిళా అభిమానులు కూడా పెరిగారు. రిపీటెడ్ ఆడియన్స్ వచ్చి మా సినిమాను చూస్తుంటే ఆనందంగా ఉంద'ని పేర్కొన్నారు. తమన్ మాట్లాడుతూ 'సంగీతం సక్సెస్‌లో సగం నేను నిర్మాతకే ఇస్తాను. పక్కా కమర్షియల్ సినిమా ఇది. సినిమా రీరికార్డింగ్‌కి వచ్చినప్పుడు చూడగానే ఫీల్ నచ్చింది. చాలా జాగ్రత్తగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ చేశాన'ని చెప్పారు.



ఆకాశ్ పూరి

సమ్మర్‌కు 'మెహబూబా'

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆకాష్ పూరి హీరోగా నటిస్తున్న సినిమా 'మెహబూబా'. ఇటీవలే టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రాన్ని సమ్మర్‌కు విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం బుధవారం ప్రకటించింది. లావణ్య సమర్పణలో పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ పతాకంపై రూపొందుతుంది. సందీప్ చౌతా సంగీతం అందిస్తున్నారు. 1971 ఇండియా-పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆకాష్ పూరి సరసన నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తుంది.

వీరి ప్రేమకు 'సాక్ష్యం'

శ్రీవాస్ దర్శకత్వంలో బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'సాక్ష్యం'. డిఫరెంట్ యాక్షన్ ఎంటర్ టైనర్‌ను తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైద్రాబాద్‌లోని రామోజీ ఫీలిం సిటీలో క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రంలోని హీరోహీరోయిన్ లుక్స్‌ను విడుదల చేశారు.

అభిషేక్ నామా మాట్లాడుతూ "హీరో హీరోయిన్ల పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. శ్రీవాస్ క్యారెక్టరైజేషన్స్ రాసిన విధానం బాగుంది. ఈ చిత్రంతో ఒక కొత్త శ్రీనివాస్‌ను చూస్తారు. ఆయన దర్శకత్వ శైలి పూర్తిగా మారిపోయింది. 'సాక్ష్యం" చిత్రాన్ని ఆయన తెరకెక్కించిన తీరు ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సినిమాలో ఫైట్ సీక్వెన్స్‌లు చాలా కీలకం అందుకే పీటర్ హెయిన్స్ మాస్టర్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని వాటిని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుత షెడ్యూల్‌లో శ్రీనివాస్, పూజా హెగ్డేల నడుమ కాంబినేషన్ సీన్స్ తోపాటు జయప్రకాష్, పవిత్ర లోకేష్, వెన్నెల కిషోర్‌ల కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాలను కూడా చిత్రీకరించనున్నాం' అని తెలిపారు.



పూజా హెగ్డే, బెల్లంకొండ శ్రీనివాస్

తెలుగులోనూ వస్తుంది

ఒక్క రోజులో కావాల్సినంత పాపులార్టీ ఎవరికైనా వచ్చిందంటే అది ప్రియా ప్రకాశ్ వారియర్‌కే దక్కింది. ఈ కథానాయిక ఎవరో పరిచయం చేయనక్కర్లేని పేరు. ఎందుకంటే ఒక్క రోజులోనే నెటిజన్లందరికీ పరిచయమైన వ్యక్తి ఈ హీరోయిన్. 'ఒరు అదార్ లవ్' అనే మలయాళ చిత్రంలో జిమ్మిక్కి కమ్మల.. అనే గీతంలో ఆమె ప్రదర్శించిన ముఖ హావభావాలు ప్రియాను పెద్ద స్టార్‌ను చేశాయి. బుధవారం విడుదల చేసిన ఈ చిత్రం తాజా టీజర్‌లోనూ ప్రియ తన వేలును గన్‌లా పెట్టి పేల్చి భలే చేసిందనిపించింది. ఈ చిత్రం తెలుగులో కూడా రాబోతుందిట. తమిళ్, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ఈ చిత్రానికి ఒమర్ లులు దర్శకత్వం వహించారు. అందరూ కొత్తవాళ్లతోనే తెరకెకించారు ఈ దర్శకుడు. షాన్ రహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం మార్చి మూడో తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.



ప్రియా ప్రకాశ్ వారియర్

అమ్మాయి మనసును చూపించాం



విద్యాసాగర్ రాజు, సంచిత పదుకొనే, చంద్రబోస్, రామోదర్ ప్రసాద్, కల్యాణ్

దుహర మూవీస్ పతాకంపై విద్యాసాగర్ రాజు, సంచిత పదుకొనే జంటగా నటించిన చిత్రం 'రచయిత'. ఈ చిత్ర హీరోనే ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. కల్యాణ్ ధూళిపాళ్ల నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌తో పాటు ప్రముఖ నిర్మాత, రంజిత్ మూవీస్ అధినేత దామోదర ప్రసాద్, మరో నిర్మాత రాందాస్ సినిమా విశేషాలను బుధవారం వివరించారు.

దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'రచయిత సినిమా చాలా బాగా వచ్చింది. ఇప్పటికే ఈ సినిమాను పబ్లిక్‌కు చూపించాం. మంచి స్పందన వచ్చింది. ప్రతి ఒక్కరూ సినిమాను మెచ్చుకుంటున్నారు. నిర్మాత కల్యాణ్ ఎంతో శ్రమించి సినిమాను తెరకెక్కించారు. హీరో కొత్తవాడైనా.. నిర్మాత ప్రోత్సహించి ఈ సినిమాను నిర్మించినందుకు అభినందించాలి. ఈ సినిమాకోసం హీరో జగపతిబాబు చాలా శ్రమించారు' అని అన్నారు.

'ఈ చిత్రం ఎమోషన్ థ్రిల్లింగ్ అనే కాన్సెప్ట్ తో తెరకెక్కింది. ఒక అమ్మాయి మనసు డెప్త్ ఎంత ఉంటుందో ఇందులో చూపించాం. చంద్రబోస్ అందించిన మూడు పాటలకు లిరిక్స్ చాలా బాగున్నాయి. నిర్మాత ఎక్కడా రాజీ పడకుండా సినిమాకు నన్ను నమ్మి ఖర్చు పెట్టారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుంది' అని హీరో, దర్శకుడు విద్యాసార్ రాజు అన్నారు.

'మసక్కలి' స్వచ్ఛమైన ప్రేమకథ



మల్యాల, సుమిత్ సింగ్, తమ్మారెడ్డి భరద్వాజ, సాయి రోనక్ తదితరులు

సాయి రోనక్, శ్రావ్య, శిరీష వంక హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'ముసక్కలి'. డు గుడ్ ఫాలో రైట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నబి ఏనుగుబల(మల్యాల) దర్శకత్వంలో సుమిత్ సింగ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను బుధవారం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'కథలను వింటుంటే కొన్నింటిని నమ్ముతాం. కొన్నింటిని నమ్మలేం. కొన్నింటిని నిజంగా చూసినా నమ్మలేం. నమ్మలేని కథలు నిజమైతే అద్భుతంగా ఉంటాయి. అలాంటి ఓ కథతో రూపొందుతోన్న చిత్రమే 'మసక్కలి" అని అన్నారు. దర్శకుడు నబి ఏనుగుబల(మల్యాల) మాట్లాడుతూ ' స్వచ్ఛమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమే ఇది. అందుకనే 'మసక్కలి' అనే టైటిల్‌ను పెట్టాం. ప్రతి పాట, డైలాగ్ వెనుక బలమైన కథ ఉంటుంది. మంచి ఎమోషనల్, క్లీన్, లవ్, సెంటిమెంట్ ఇలా అన్ని అంశాలను మేళవించి ఈ సినిమాను తెరకెక్కించాం. మిహిరామ్ మంచి సంగీతాన్ని అందించారు' అని అన్నారు.

విజయవాడ
గురువారం 15 ఫిబ్రవరి 2018
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.



తెలుగు నాటకం గురించి చెప్పుకునేప్పుడు.. సురభి నాటక ప్రస్తావనను తీసుకురాకుండా ఉండలేం. తెలుగునాట సురభి నాటకరంగ సేవలు అలాంటివి. నూటముప్పై ఏళ్ళకుపైగా కుటుంబసమేత వారసత్వకళగా.. తరాలుగా కొనసాగుతున్న సురభి నాటకం.. చెప్పుకోడానికి పాతదే అయినా.. చూడ్డానికి ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. తెలుగు పౌరాణిక నాటకరంగాన ప్రయోగాలకు నాందిపలికిందే సురభి రంగస్థలి. అలాంటి 'సురభి' మరోసారి కొత్తగా.. అంతే ప్రయోగాత్మకంగా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చింది. అదే.. కేవలం బాలనటుల సమూహంగా ఇటీవల ఆడిన 'బాలల మాయాబజార్' నాటకం. నిజానికి సురభి నాటకంలో బాలనటులకు కొదవుండదు. కానీ తొలిసారిగా.. కేవలం బాలనటులతో మాత్రమే మాయాబజార్ నాటకాన్ని రూపొందించారు. అదీ విశేషం. బడికెళ్ళే పిల్లలు.. గంటల తరబడి ఒక నాటకంలో నటించి, మెప్పించడం అంటే.. దాని వెనుక ఎంతో శ్రమ ఉండాలి. అందుకు తగ్గ శిక్షణా ఉండాలి. అలాంటి విశేషాల సమాహారమే ఈ ప్రత్యేక కథనం.

భళారే.. బాలల మాయాబజార్

బడి పిల్లలంటే ఎలా ఉంటారు? బుద్ధిగా.. తలకు నూనె రాసుకుని, మొఖానికి కూసింత పౌడరద్దుకుని, చెడ్డీలోపలకు చొక్కా దోపుకుని.. నడుముకి.. రబ్బరు బెల్టెట్టుకుని.. మెడలో గుదిబండలాంటి టై కట్టుకుని.. గంటకొట్టగానే బిలబిలమంటూ లగెత్తుకెళ్ళే చూడచక్కని రూపాలే మనకు కనపడతాయి. పిల్లలంటేనే సృజనపరులు. కానీ చదువుల కార్ఖానాలో తలకు మించిన భారాన్ని భుజానెత్తుకుని తమకు నచ్చిన ఆటపాటలు వదిలేసి చదువుకోవాలి. తప్పదు. ప్రస్తుత విద్యావ్యవస్థ అలాంటిది. కానీ, అలాంటి పిల్లలకు కాస్తంత.. ఆడేపాడే సమయం చిక్కితే.. అద్భుతాలు చేస్తారు. చేయడమేంటి.. చేసి చూపించారు. ఆ పిల్లలే సురభి కుటుంబానికి చెందిన ఈతరం బాలబాలికలు. సురభి కుటుంబానికి చెందిన తొలితరం నటుడు వనారస గోవిందరావు వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఇటీవల ఈ 'బాలల మాయాబజార్' పౌరాణిక నాటకాన్ని హైదరాబాద్‌లో ప్రదర్శించారు.

సురభి సంప్రదాయం

సురభి నాటకం అంటే.. రెండు మూడు తరాలకు చెందిన నటుల సమ్మేళనంగా నాటకాన్ని ప్రదర్శించడం సర్వసాధారణం. అంటే పిల్లలు, వారి తల్లిదండ్రులు, వారి తల్లిదండ్రులైన పెద్దలు ఇలా... అన్ని వయసులవారూ.. ఆయా పాత్రలకు తగ్గట్టుగా పాత్రల్ని ఎంపిక చేసుకుని.. ఆయా నాటకాలను ప్రదర్శిస్తుంటారు. అలా కాకుండా, పదిహేనేళ్ళలోపు వయసు పిల్లలు మాత్రమే.. మొత్తం నాటకంలోని పాత్రధారులుగా మారి, ఒక పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించడం సురభి చరిత్రలో ఇదే తొలిసారి. ఇందులో పాకే పిల్లాడు నుంచి బుడి బుడి అడుగులు వేసే పాపాయి.. స్కూలు, హైస్కూలుకెళ్ళే వయసున్న పిల్లల సమూహంగా మాయాబజార్ నాటకాన్ని రూపొందించారు. కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఎంతో ఆసక్తికరంగా ఆ నాటకాన్ని ప్రదర్శించి.. ఆ బాలనటులు శభాష్ అనిపించుకున్నారు. దీనికి కర్త, కర్మ, క్రియ సురభి జయచంద్రవర్మ. ఎంబీఏ చదువుకున్న ఈ కుర్రాడు సురభిలో యువతరం నటుడు. ఇప్పుడు ఆడిన బాలల మాయాబజార్ నాటకానికి దర్శకుడిగా అతడే వ్యవహరించాడు.

బరువైన పాత్రపోషణ

పిల్లలు రంగస్థల ప్రదర్శనలు చేయడం మనకు కొత్త కాదు. సాంఘిక నాటికలు, నాటకాల్లో బాలనటుల్ని మనం ఎప్పటి నుంచో చూస్తూనే ఉన్నాం. కానీ, పౌరాణిక నాటకాల్లో బాలనటులు తక్కువ. సత్యహరిశ్చంద్ర వంటి నాటకాల్లో లోహితాస్యుడు వంటి నిలబడే పాత్రలే తప్ప.. అంతగా పద్యం, సంభాషణా ప్రాధాన్యత గల నాటకాలు ఆడే బాలనటులు చాలా అదరుదు. అలాంటి పరిస్థితుల్లో పిల్లలతో గంటలపాటు సాగే.. మాయాబజార్‌లాంటి ప్రసిద్ధి చెందిన నాటకాన్ని రూపొందించడం, తయారుచేయడం అంటే ఈరోజుల్లో సాహసమే! ఎందుకంటే, పిల్లలకు తెలుగుభాష వచ్చి ఉండాలి. వచ్చినా.. పద్యం పాడగలిగి ఉండాలి. సంధులు, సమాసాల విరుపుగల పద్యాలను అంతే రాగయుక్తంగా పాడి, ప్రేక్షకుల్ని మెప్పించాలి. రౌద్రం, వీర, హాస్యం, శాంతం, కరుణ, భయానక, బీభత్స రసాలను ముఖంలో పలికించగలగాలి. అంతకు తగ్గట్టుగా సంభాషణలు పలకాలి. అన్నీ బాగుంటే సరా.. పిల్లలకు పాత్రకు తగ్గ రూపం ఉండాలి. ఇవన్నీ కలిసొస్తేనే.. పిల్లలలతో పౌరాణిక నాటకం కుదురుతుంది.



ఇవన్నీ కుదరాలంటే ఆ.. పిల్లలు మారం చేయకుండా కుదురుగా ఉండాలి. అంతే కుదురుగా అవన్నీ వారికి నేర్పాలి. బడికెళ్ళే పిల్లల్ని.. ఒకచోట కుదురుగా కూర్చోబెట్టాలంటే.. సమయం కుదరాలి. అలా ఆదివారం, సెలవు రోజుల్లో.. కాస్తంత దొరికిన సమయంతోనే.. పిల్లలకు తర్ఫీదునిచ్చాడు జయచంద్రవర్మ. ఇతడూ బాలనటుడిగానే సురభి నాటకరంగం ఆసరాగా ఎదుగుతూ వచ్చినవాడు కనుక.. పిల్లల్లో పిల్లాడిగా కలిసిపోయి.. చాలా తక్కువ సమయంలోనే నాటకం రూపొందించి, ప్రదర్శన చేయించాడు. ఇతడికి అమ్మనాన్న, భార్య, ఇతర సురభి పెద్దలు వెన్నుదన్నుగా నిలిచారు. అలాగే, ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో మిగిలివున్న, సురభి నాటకకళా వారసత్వాన్ని కొనసాగిస్తున్న సురభికి చెందిన అయిదు సమాజాల నుంచి సుమారు నలభైమంది పిల్లలు.. మొదటిసారి ఒకే వేదికపై కలిసి ఈ నాటకాన్ని ప్రదర్శించడం మరో విశేషం.

ఔరా.. అనాల్సిందే!



సురభి నాటకం అంటేనే.. ప్రేక్షకుడికి ఏదో ఒక ఆశ్చర్యానికి కలిగించే అపురూపమైన దృశ్యం. సినిమాల్లోని గ్రాఫిక్స్‌ను తలపించే సెట్టింగులు, హంగులు, విద్యుద్దీపాలంకరణ, ఆహార్యం వంటి విషయాల్లో సురభికున్న ప్రత్యేకత వేరు. ఈ పిల్లల మాయాబజార్ నాటకంలోనూ.. అది ఏమాత్రం తగ్గకుండా.. ప్రదర్శించడం చెప్పుకోదగ్గ విశేషం. భారీ శరీరంతో వికటాట్టహాసం చేసే ఘటోత్కచుడు, అర్జున కుమారుడైన అభిమన్యుడు, శశిరేఖ, ఉత్తర కుమారుడు, బలరాముడు, అర్జునుడు 'హిడింబి' ఇలా... భారతంలోని పాత్రల్లో ఒదిగి, పెద్దరికాన్ని తెచ్చుకుని చక్కగా నటించడం అంటే ఆషామాషీ విషయం కాదు. ఇలాంటి పిల్లకాయలకు సరైన ప్రోత్సాహం ఉంటే మునుముందు మంచి నటులు కాగలరనడంలో ఏమాత్రం సందేహం లేదు. అందుకే, సురభి నాటకకళ పది కాలాలపాటు వర్ధిల్లాలంటే.. నేటితరపు సురభి పిల్లలు అంతే ఉత్సాహపడుతూ ఆడాలి. పాడాలి. అందుకు.. మనమూ 'హైహై నాయికా.. జయహో సురభి' అంటూ ఆశీర్వదించాలి!



-గంగాధర్ వీర్ల

నందిలో.. పిల్లల పద్యనాటకం ఉండాలి

కేవలం పిల్లలతోనే ఒక నాటకాన్ని రూపొందించాలంటే చాలా శ్రమపడాలి. సురభి పిల్లలైనంత మాత్రాన.. అందరికీ పద్యం, సంభాషణ గొప్పగా రావాలనీ లేదు. ఆటవిడుపుగా మాపెద్దవాళ్ళతో పిల్లలు కలిసి వేయడం వేరు.. ఒక నాటకాన్ని మొత్తం పిల్లలే భుజాన ఎత్తుకుని మోయడం వేరు. అలా చేయాలంటే.. పిల్లలకు సరియైన తర్ఫీదూ కావాలి. సమయమూ ఉండాలి. నిజానికి పిల్లలు స్కూల్‌కెళ్ళిన తర్వాత సాయంత్రంపూట ఓ వారం పాటు సాధన చేశారు అంతే. రానున్న రోజుల్లో మరింత పరిణిత చెందేలా వారికి సాధన అవసరం. మాలాంటి యువనటులం..మా పెద్దవాళ్ళతో కలిసి వేస్తూ వస్తున్నాం. కేవలం యువతరం సురభి నటులు మాత్రమే.. విడిగా పౌరాణిక నాటకాలు ఆడలేదు. ఒకతరం నటులు ఆడుతుండగానే.. కొత్తతరంతోనూ ప్రత్యేక నాటకాలు వేస్తూ ఉంటే.. సురభి మరింత బలపడుతుందనేది నా అభిప్రాయం. అందుకు, ప్రభుత్వం, కళాపోషకుల ప్రోత్సాహం అవసరం. అలాగే ప్రభుత్వంవారు నిర్వహించే బాలల నంది నాటకోత్సవాల్లో పౌరాణిక నాటకాల విభాగం లేకపోవడంవల్ల.. పద్యనాటకాల్లో పిల్లలకు అవకాశం ఉండటంలేదు. నేటితరం తెలుగుభాష, తెలుగు పద్యం మర్చిపోకూడదు అనుకున్నప్పుడు.. పౌరాణిక నాటకాల్లోనూ పిల్లలకోసం నందిపోటీలు ఉంటే ప్రోత్సాహకరంగా ఉంటుంది.





-సురభి జయచంద్రవర్మ
ఫోన్: 9494507007



వినూత్నం.. విద్యార్థుల నంది నాటకం

సమాజంలో 'చెడు' పెరుగుతోంది. అయితే ఇది ఒక పార్శ్వం. ఆ చెడును ఎదుర్కొనే 'మంచి' సామర్థ్యం పెరగడం కూడా ఒక అనుభవ సత్యం. బాలల, యువ 'నంది' నాటికల్లో ఈ విషయం ప్రస్ఫుటంగా తేటతెల్లమైంది.

తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 2 నుంచి 2017 నంది నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయి. మార్చి నుంచి విద్యార్థులకు పరీక్షలు ఉంటాయన్న ఉద్దేశంతో తొలిదశలోనే ఒక వారం పాటు నిరంతరాయంగా బాలల నాటికలు, కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థుల నాటికల ప్రదర్శనలను సంయుక్తంగా నిర్వహించారు. నలభై బృందాలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. బృందానికి సగటున 25 మంది చొప్పున అనుకుంటే దాదాపు వేయిమంది బాల, విద్యార్థి కళాకారులు పాల్గొన్నట్టు అంచనా. తెలుగు మాట్లాడే ఉభయ రాష్ట్రాల్లోని సుదూర ప్రాంతాల నుంచి ఈ ఉత్సవాల్లో ఇంతమంది పాల్గొనడం నిజంగా శుభపరిణామమే!

ముందుగా యువ నాటికలు (కళాశాల, విశ్వవిద్యాలయ విద్యార్థుల) గురించి చర్చించుకుంటే వస్తు వైవిధ్యం అద్భుతంగా ఉంది. సమకాలీన అంశాలు అవినీతి, కాశ్మీర్ ఉగ్రవాదం, భూమి, రైతు శ్రమ, ప్లాస్టిక్ ప్రమాదం, కిశోర వయసులో చెలరేగే ప్రేమ వ్యామోహాలు, మీడియా పాత్ర, ర్యాగింగ్, దేశభక్తి, జంతువుకన్నా మనిషి హీనంగా దిగజారడం మున్నగు వాటితో పాటు పౌరాణిక ఇతివృత్తాలనూ రసరమ్యంగా ప్రదర్శించారు. ప్రదర్శనల్లో తమదైన వ్యంగ్య, ప్రయోగరీతులకు సాన పెట్టారు. ప్రేక్షకుల ఆలోచనలకు పదును పెట్టారు. ప్రధాన జాతీయ నాటక స్రవంతిలో తెలుగు నాటకం ఇక వెనుకబడదనే ఆశాభావాన్ని కలిగించారు.

బాలల నాటికలు పరిశీలించినపుడు ఎక్కువ ఇతివృత్తాలు అనాథ బాలల గురించి, బాల కార్మికుల గురించి, కార్పొరేట్ చదువుల ఒత్తిడి గురించి, ఇంటర్నెట్ బ్లూవేల్ గేమ్స్ ప్రమాదాల గురించి, అమ్మా- చదువు ప్రాధాన్యతల గురించి, మంచి-చెడు స్నేహాల గురించి, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య పాటింపు, మత సామరస్యం, నైతికవర్తనం గురించి అంశాలు తీసుకొని, వాటికి న్యాయం చేయటానికి శక్తి కొలదీ ప్రయత్నించారు. బాలల అభినయ ప్రతిభాసామర్థ్యం పలు నాటికల్లో పెద్దలకు ధీటుగా కొట్టొచ్చినట్లు కనపడింది. అవకాశాలు లభించాలేగానీ మేం వెనుకబడం అని చెప్పకనే చెప్పినట్లయింది.



బడితోనే భవిత నాటికలో ఓ సన్నివేశం



ఆసరా నాటికలో ఓ దృశ్యం

నాటకం అనేది సమిష్టికృషి గనుక ఈ బాలల యువ నాటికల పోటీని కేవలం ప్రదర్శనల స్థాయికే పరిమితం చేయడం ముదావహం. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సమిష్టిగా ఒక కళారూపాన్ని ఎంచుకోవడం, సాధనతో తీర్చిదిద్దుకోవడం, ఆహార్య సామగ్రి (వేషభాషణలు)ని సమకూర్చుకోవడం, కష్టపడటం, కలసి రైళ్ళల్లో, బస్సుల్లో ప్రయాణించడం, భోజనాలు చేయడం, ఒకరి ప్రదర్శనలు మరొకరు చూసి నేర్చుకోవడం ... ఇలా నాటక కళా నైపుణ్యాలను 'పంచుకోవడం- పెంచుకోవడం' అన్నది ఓ విజ్ఞానదాయకమైన వాతావరణాన్ని తలపిస్తుంది. కుల, మత, ప్రాంత, లింగ వివక్ష లేని ఈ సహజమైన స్నేహపూర్వక భావం, క్రమశిక్షణ, వారిని భవిష్యత్‌లో నిజమైన భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడుతుందనడంలో అనుమానం అక్కర్లేదు.

అన్నిటికంటే ముఖ్యంగా తాము ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు (చదువుల ఒత్తిడి, లైంగిక వేధింపులు తదితర) రంగస్థలంపై చర్చించడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. ఆత్మస్థైర్యం పెరిగి, ఆత్మహత్యలను దూరం చేస్తుంది. గతంలో లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు గురయ్యే పాత్రల్లోనూ, బాలురతో కలసి నటించడంలోనూ గ్రామీణ బాలికలు వెనుకబడేవారు. పెద్దల ఆమోదమూ లభించేది కాదు. ఇప్పుడు ఏపాత్రనైనా బాలికలు ధైర్యంగా నటించడం గొప్ప ముందడుగు. అభినయానికి ముందు ఐదు దశలు దాటాయి. 1.ఆలోచించడం, 2.అర్థం చేసుకోవడం, 3.అవగాహన పెంచుకోవడం 4.ఆస్వాదించడం, 5.అనుభూతి చెందడం. ఏదేని కథాంశాన్ని (ఇతివృత్తాన్ని) పాత్రను జీర్ణం చేసుకోవడానికి ఈ ఐదు దశలు అనివార్యం.అనుభూతి చెందకుండా (ఫీల్ కాకుండా) హృదయపూర్వక అభివ్యక్తీకరణ సాధ్యం కాదు. చతుర్విధ అభినయాలు (ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్విక) అభివ్యక్తీకరణకు సానపడ్తాయి. రసరమ్య ప్రదర్శనను ఆవిష్కరిస్తాయి. ప్రేక్షకులకు అదే స్థాయి రసానుభూతిని సజీవంగా అందిస్తాయి. నాటకం మాత్రమే ఇది చేయగలదు. ఈ రంగస్థల మథనం తొలుత నాటక కళాకారుని అంతరంగంలో ప్రారంభమై సమిష్టిగా కలబోసుకొనే ప్రేక్షక హృదయ మందిరాల ద్వారా దిగంతాలకు వ్యాపిస్తుంది. ఇదో అవస్థ, ఇదో పవిత్రమైన బాధ్యతాయుత సాధన. అందుకే గురుదేవ్ రవీంద్రనాథ్ టాగూర్ సత్యం, సౌందర్యాల రసవత్ సమ్మేళనమే నాటక కళ అని ఉద్బోధించారు. ఈ నాటకకళలో చిన్నారులు ఎంతగా వడివడిగా అడుగులు వేస్తే.. అంతగా మన భవిత సుందరం కావడం నిస్సందేహం. బాలల, విద్యార్థుల నాటకాలకు ఇలా నంది వేదిక కావడం సంతోషమే!

- కె.శాంతారావు,
99597 45723



కళ్లు తెరవండి నాటికలో ఓ ఘట్టం

విశాఖలో తొలి సమీకృత క్రీడా గ్రామం

- రూ.350 కోట్లతో టెండర్లకు రంగం సిద్ధం
- అంతర్జాతీయ క్రీడల ఆతిథ్యానికి ప్రణాళికలు
- క్రికెట్ మినహా, అన్ని రకాల ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలకు అవకాశం

ప్రజాశక్తి– విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ నగర శివారు గండిగుండంలో అత్యాధునిక సదుపాయాలతో సమీకత క్రీడా గ్రామాన్ని (ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ విలేజ్) ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. దాదాపు రూ.350 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించే ఈ ప్రాజెక్టులో ఇక నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రీడా గ్రామ నమూనాల ఖరారు తర్వాత నిర్మాణ పనుల కోసం టెండర్లు పిలవనున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. రాష్ట్ర విభజన తరువాత ఆంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌లో వేదికల కొరత ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి కేంద్రంగా అనేక అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించేవారు. మన రాష్ట్రానికి ఆ తరహా సదుపాయాలు లేవు. ఈ నేపథ్యంలో విశాఖ నగర శివారు గండిగుండంలో 78.20 ఎకరాల్లో సమీకత క్రీడా గ్రామాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇందు కోసం అయ్యే నిధులను విశాఖ నగరాభివద్ధి సంస్థ (వుడా) సమీకరించనుంది. క్రీడా గ్రామ నమూనాను ఎనిమిది ప్రఖ్యాత నిర్మాణాకతి (ఆర్కిటెక్చర్) సంస్థలు సిద్ధం చేయగా, వీటిలో మూడింటిని ప్రాథమికంగా కమిటీ ఎంపిక చేసింది. ఇందులో ఒక నమూనాను త్వరలో ఖరారు చేసి.. క్రీడా గ్రామ నిర్మాణ పనుల కోసం టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి. ఈ సమీకత క్రీడా గ్రామంలో క్రికెట్ మినహా అన్ని ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఆయా క్రీడల్లో శిక్షణతోపాటు జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా దీన్ని తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. ప్రతి క్రీడ కోసం రెండు సింథటిక్ ట్రాకులు సిద్ధం చేయనున్నారు. ఒకటి శిక్షణ నిమిత్తం, మరొకటి పోటీల కోసం ఉపయోగిస్తారు. ఇక్కడ ఇండోర్ క్రీడలైన బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, వాలీబాల్, కరాటే, జిమ్నాస్టిక్స్ టేబుల్ టెన్నిస్, రింగ్ టెన్నీస్, కబడ్డీ, చెస్‌లతో పాటు అవుట్ డోర్ క్రీడలైన ఆర్చరీ, షూటింగ్, అథ్లెటిక్స్, సైక్లింగ్ ఇలా అన్ని రకాల క్రీడల కోసం ఏర్పాట్లు చేయనున్నారు. ఏడాది పొడవునా ఈ క్రీడా గ్రామంలో వివిధ పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నారు. ఇందులో కొంత స్థలాన్ని వాణిజ్య అవసరాల కోసం వినియోగించేలా ఆకతి రూపొందిస్తున్నారు. హోటల్ టవర్, సమావేశ మందిరం, పార్కింగ్ వంటి తదితరాల ఏర్పాటుతో నిర్వహణ పరంగా ఇబ్బందులు తలెత్తే వీలుండకూదదని అధికారులు భావిస్తున్నారు.


విశాఖ సమీకృత క్రీడా గ్రామం నమూనా

సమిష్టి విజయం

సఫారీజట్టు పర్యటనలో టీమిండియా వన్డే సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకోవడంతో భారతజట్టుపై ప్రశంసల జల్లు కురుస్తోంది. 25 ఏళ్లలో సాధించలేని సిరీస్ విజయాన్ని కోహ్లి సారథ్యంలో భారతజట్టు చేజిక్కించుకుంది. ఇది ఒకందుకు హర్షించదగ్గదే అయినప్పటికీ.. సఫారీ జట్టులో సీనియర్ క్రీడాకారుల గైర్హాజరీలో ఈ విజయం సాధించారని చెప్పక తప్పదు.


విరాట్ కోహ్లి

(ప్రజాశక్తి - స్పోర్ట్స్ డెస్క్)

ఇప్పటికే టెస్ట్ సిరీస్‌ను 2-1తో కోల్పోయిన టీమిండియా వన్డేల్లో మాత్రం నెంబర్‌వన్ టీమ్‌లా ఆడింది. దీంతో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఆరు వన్డేల సిరీస్‌ను టీమిండియా గెలచుకొని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన ఐదో వన్డేలో 73 పరుగులు తేడాతో సఫారీజట్టుపై ఘన విజయాన్ని సొంతం చేసుకొంది. మరో వన్డే మిగిలి ఉండగానే టీమిండియా సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనలో సాధించలేని విజయాన్ని కోహ్లి విరాట్ సారథ్యంలో సాధ్యపడింది. దక్షిణాఫ్రికా పర్యటనలో బ్యాట్స్‌మన్‌లకంటే బౌలర్ల ప్రతిభ కారణంగానే ఈ విజయం సాధించారని చెప్పక తప్పదు. 25 ఏళ్ల తర్వాత సఫారీ గడ్డపై ఆ దేశ జట్టును చిత్తుగా ఓడించి వన్డే సిరీస్‌ను టీమిండియా కైవసం చేసుకుంది. అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి నెం.1 స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

రెస్ట్ బెంచ్‌కు అవకాశం....

దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్ విజయాన్ని చేజిక్కించుకోవడంతో ఆరోవన్డేలో టీమిండియా సారథి కోహ్లి బెంచ్‌కు పరిమితమైన క్రీడాకారులకు అవకాశమివ్వనున్నాడు. ఈ సందర్భంగా కోహ్లి మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఐదు వన్డేల్లో ఒకటి, రెండు మార్పులు తప్ప పెద్దగా బెంచ్‌కు పరిమితమై క్రీడాకారులలకు అవకాశం ఇవ్వలేదు. దీంతో వారందరికీ శుక్రవారం జరిగే చివరివన్డేలో స్థానం కల్పించనున్నట్లు తెలిపాడు. రెస్ట్ బెంచ్ క్రీడాకారులైన మనీష్‌పాండే, కేదర్ జాదవ్, దినేష్ కార్తీక్, అక్షర్‌పటేల్, మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్‌లలో ఒకరిద్దరు మినహా మిగతా వారెవ్వరూ ఒక్క వన్డే కూడా ఆడలేదు.

సీనియర్ క్రీడాకారుల దూరంతో సిరీస్ కోల్పోయాం : మార్క్రమ్

సఫారీ జట్టు టెస్ట్ సిరీస్‌లో పూర్తిస్థాయి జట్టుతో ఆడి టెస్ట్ సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకుంది. కానీ వన్డే సిరీస్‌నుంచి సీనియర్ క్రీడాకారులు గాయాల కారణంగా దూరమవ్వడంతో సిరీస్‌ను కోల్పోయామని ఆ జట్టు సారథి మార్క్రమ్ తెలిపాడు. తొలి మూడు వన్డేలకు ఎబి డివిలియర్స్ దూరమవ్వగా... డుప్లెసిస్, డికాక్‌లు తొలి వన్డే అనంతరం సిరీస్‌నుండి వైదొలిగారు. ఆ జట్టు ప్రధాన పేసర్ డెల్ స్టెయిన్ సైతం తొలి టెస్ట్ ఆడిన అనంతరం గాయం తిరగబెట్టడంతో టెస్ట్, వన్డే సిరీస్‌నుండి తప్పుకున్నాడు. దీంతో ఆ జట్టుకు సీనియర్ క్రీడాకారుల్లో హషీమ్ ఆమ్లా, డుమినీలు మాత్రమే మిగిలారు. నాల్గో వన్డేలో పునరాగమనం చేసిన డివిలియర్స్ పుటెన్సీతో ఆ వన్డే గెలిచి ఊపుమీద కనిపించినా... ఐదో వన్డేలో అనూహ్యంగా ఓటమిపాలై సిరీస్‌ను కోల్పోయామన్నాడు.


రబాడ

రబాడకు జరిమానా!

దక్షిణాఫ్రికా ఫాస్ట్‌బౌలర్ రబాడకు ఫీల్డ్ అంపైర్లు 15% ఫీజులో కోత విధించారు. మంగళవారం భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన ఐదో వన్డేలో ధావన్‌ను ఔట్ చేసిన రబాడ... శిఖర్‌ను పెవిలియన్‌కు వెళ్ళమంటూ వేలితో సంజ్ఞ చేయడంతోపాటు దురుసుగా ప్రవర్తించిన కారణంగా ఈ జరిమానాకు గురయ్యాడు. ఇప్పటికే తన దురుసు ప్రవర్తనతో రెండుసార్లు డిమెరిట్ పాయింట్ పొందిన రబాడా ఐదో వన్డేలో అదే విధంగా ప్రవర్తించడంతో మరో డిమెరిట్ పాయింట్, తన ఫీజులో 15శాతం కోత విధించారు. ఐదో వన్డేలో భారత ఓపెనర్ ధావన్ ఔట్ అయిన తర్వాత రబడా ఐసీసీ ఆటగాళ్ల ప్రవర్తన కోడ్‌ని ఉల్లంఘించాడు. ధావన్ పెవిలియన్‌కి వెళు ంటే.. అతనికి చేయి ఊపుతూ, పలు అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆర్టికల్ 2.1.7 'అంతర్జాతీయ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ ఔట్ అయినప్పుడు చేతులతో సైగలు చేయడం... కోపం తెప్పించే విధంగా ప్రవర్తించడం' ప్రకారం ఫీల్డ్ అంపైర్లు ఇయాన్ గౌల్డ్, షాన్ జార్జ్, థర్డ్ అంపైర్ అలీందార్, ఫోర్త్ అంపైర్ బొన్‌గాని జెలె రబాడా చేసింది తప్పని నిర్ధారించారు.

చివరి పంచ్ ఆంధ్రాదే!


ఆంధ్ర కెప్టెన్ విహారి

చెన్నై : ఆంధ్రప్రదేశ్-ముంబయి జట్ల మధ్య జరిగిన విజయ్ హజారే చివరి మ్యాచ్‌లోనూ ఆంధ్రజట్టు గెలుపొందింది. బుధవారం ముంబయి తలపడి 29 పరుగులు తేడాతో సంచలన విజయం సాధించింది. తొలుత టాస్‌ఓడి బ్యాటిం గ్ చేసిన ఆంధ్రజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 344 పరుగుల భారీ స్కోర్ సాధించింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముం బాయి జట్టు 9 వికెట్ల నష్టానికి 315 పరుగులు మాత్రమే చేసింది. ఆంధ్ర కెప్టెన్ విహారి 118 బంతుల్లో 169 పరుగులు చేయగా... ఓపెనర్ భరత్ 105 చేశారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 254 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. ఈ విజయంతో ఆంధ్రజట్టు గ్రూప్-సి నుండి 24 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఫిబ్రవరి 21 నుండి క్వార్టర్‌ఫైనల్ నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

ఐపిఎల్ తొలిమ్యాచ్ ముంబయి X చెన్నై

ముంబయి : ఐపిఎల్ 2018 ప్రారంభమ్యాచ్ ముంబయిలో జరగనుంది. తొలి మ్యాచ్‌లో గత ఏడాది ఛాంపియన్ ముంబాయి ఇండియన్స్ జట్టు చెన్నై సూపర్‌కింగ్స్‌తో తలపడుతుంది. ఇరుజట్ల మధ్య జరిగే ఈ మ్యాచ్ వాంఖడే స్టేడియంలో ఏప్రిల్-7న జరగనుంది. సెమీఫైనల్లో ఓడి జట్లు కూడా ఇదే మైదానంలో మే 22, 27 తేదీల్లో పోటీపడతాయి. ఐపిఎల్-2018లో 42 మ్యాచ్‌లు రాత్రి 8 గంIIలకు... 12 మ్యాచ్‌లు సాయంత్రం 5.30 జరుగనున్నాయి.

స్పీడ్ స్కేటింగ్‌లో డచ్‌కు స్వర్ణం


స్పీడ్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన టెర్మోర్స్ (నెదర్లాండ్)

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : వింటర్ ఒలింపిక్స్‌లో బుధవారం జరిగిన మహిళల 1000 మీటర్ల స్పీడ్ స్కేటింగ్ విభాగంలో డచ్ అథ్లెట్ జోరిన్ టెన్‌మోర్స్ ఒలింపిక్ రికార్డ్ (1:13.56) సాధించింది. ఫైనల్‌కు చేరిన ఐదుగురు స్కేటర్లతో తలపడి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఫైనల్ పోటీలో జపాన్‌కు చెందిన ప్రపంచరికార్డ్ హోల్డర్ నొవా కొడైరాను రెండోస్థానానికి నెట్టివేసింది. ఆమెపై ఈ స్కేటర్ 0.38 సెకన్ల తేడాతో విజయం సాధించి బంగారుపతకాన్ని సొంతం చేసుకుంది. రజిత, కాంస్య పతకాలు జపాన్‌కు చెందిన నొవో కొడైరా, మిహో టకాగీలకు లభించాయి. పురుషుల 1000 మీటర్ల స్నోబోర్డింగ్ (హాఫ్ పైప్) విభాగంలో అమెరికాకు చెందిన షాన్ వైట్‌కు బంగారు, జపాన్‌కు చెందిన ఆయుము హిరానోకు రజిత, ఆస్ట్రేలియాకు చెందిన స్కోటీ జేమ్స్‌కు కాంస్య పతకాలు లభించాయి. లూజ్ డబుల్స్ విభాగంలో జర్మనీ జోడీకి బంగారు, కాంస్య పతకాలు లభించగా... ఆస్ట్రియాకు చెందిన పెంజ్ పీటర్/ఫిచ్లర్ జార్జ్‌లకు రజిత పతకాలు లభించాయి.


స్నోబోర్డింగ్‌లో బంగారు పతకం సాధించిన షాన్‌వైట్ (అమెరికా)

నేడు కృష్ణా-గోదావరి జలాలపై సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా-గోదావరి జలాల వినియోగంలో రాష్ట్రాల మధ్య ఏర్పడిన విభేదాలపై నేడు ఢిల్లీలో కీలక సమావేశం జరుగనుంది. కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శులు, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, ఇతర అధికారులు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జలాల వినియోగంపై ఇరు రాష్ట్రాలూ తమ తమ వాదనల్ని వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కృష్ణా-గోదావరి జలాలలో తమ వాటాపై గట్టిగా పోరాటం చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించగా, న్యాయంగా తమకు రావాల్సిన వాటాల కోసం పోరాడేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమయ్యింది. నదీ జలాల్లో న్యాయంగా దక్కాల్సిన వాటాపై రాజీపడొద్దని ఇప్పటికే ప్రభుత్వం అధికారుల్ని ఆదేశించింది. ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం లేవనెత్తున్న అంశాలపై గట్టిగా తమ వాదనలు వినిపించాలని సూచించింది. పట్టిసీమ విషయంలో తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న 45 టిఎంసీల కేటాయింపులపై రాజీ పడొద్దని అధికారుల్ని ఆదేశించింది. వాస్తవానికి 1980లో గోదావరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ (జిడబ్ల్యుడిటి) పోలవరం ద్వారా 80 టిఎంసీలను వాడుకునేందుకు అనుమతి ఇచ్చింది. మహారాష్ట్ర, కర్నాటలకు కూడా ఇందులో వాటాలు కూడా ఇచ్చారు.

బడ్జెట్‌లో ఆర్టీసికి రూ.900 కోట్లు

- నగదు బహుమతిని పెంచేందుకు చర్యలు : మంత్రి అచ్చెన్నాయుడు
- ఆర్టీసి కెఎంపిఎల్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ ఏడాది బడ్జెట్‌లో ఎపిఎస్ ఆర్టీసికి రూ.900 కోట్లు కేటాయించేందుకు కృషి చేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఆర్టీసిలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి అందించే కెఎంపిఎల్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆర్టీసి హౌస్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంధన వాడకాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఇంధన ఆదా ద్వారా కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు న్నారు. మంచి సామర్థ్యం ఉండి ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందిని తిరిగి సంస్థలోకి తీసుకునేందుకు చర్యలు తీసుకు ంటామన్నారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లను ప్రోత్సహించడం ద్వారా సిబ్బంది స్ఫూర్తి పొందాలన్నారు. డ్రైవరు, కండక్టరు సమర్థవంతంగా పనిచేస్తే అధిక కెఎంపిఎల్ సాధించవచ్చన్నారు. నగదు బహుమతిని పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావాలన్నారు. ఎండి కృషి వల్ల గతేడాది రూ.300 కోట్ల నష్టాన్ని తగ్గించుకోగలిగామన్నారు. ఆర్టీసిలో మొత్తం ఖర్చులో 31 శాతం ఇంధనానికే ఖర్చు చేస్తున్నామని, పల్లెవెలుగు మీద ఆయిల్ ట్యాక్స్ మినహాయింపు విషయమై సిఎంతో చర్చించి నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. కార్మికుల కష్ట సుఖాల్లో సంస్థ ముందుండాలన్నారు.


ఉత్తమ డ్రైవర్లకు ఆర్టీసి కెఎంపిఎల్ అవార్డుల అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజా రవాణా పెంచడం ద్వారా ప్రమాదాల నివారణ: డిజిపి

ప్రజా రవాణాని పెంచడం ద్వారా ప్రమాదాల్ని తగ్గించవచ్చని డిజిపి, ఆర్టీసి ఎండి ఎం మాలకొండయ్య తెలిపారు. ఇంధనాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరముం దని, ఇంధనాన్ని ఆదా చేసి, ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. సగం ఎసి, సగం సూపర్‌లగ్జరీ బస్సుల్ని త్వరలో తీసుకొస్తామన్నారు. కండక్టర్లు అంబాసిడర్లుగా ఉండాలని, డ్రైవర్లు, మెకానిక్‌లు కీలక పాత్ర పోషించాల న్నారు. అనంతరం 114 మందికి ఆయన అవార్డుల్ని అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ ఉన్నతాధికా రులు సుబేన్‌గుప్త, అచ్యుతకుమార్, ఆర్టీసి ఇడిలు కోటేశ్వర రావు, వెంకటేశ్వరరావు, జయరావు, ఆర్థిక సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులు, వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తా

కొండాపురంలో జగన్

ప్రజాశక్తి–కొండాపురం(నెల్లూరు)

రైతులు, వృద్ధుల సమస్యలు పరిష్కరిస్తానని వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలోకి ప్రవేశించింది. అనంతరం కృష్ణారెడ్డిపాళెం, కుడుములదిన్నెపాడు, తాళ్లపాడు క్రాస్, చిన్న అన్నలూరు గ్రామాల్లో పాదయాత్ర సాగింది. కొండాపురం మండలం శెట్టిపాళెంకు మధ్యాహ్నం మూడు గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, వైసిపి నాయకులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర పొడవునా అందరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. వృద్ధులకు పెన్షన్ ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలు కనిపించినప్పుడు వారిని పలుకరిస్తూ యోగక్షేమాలు విచారించారు. ముస్లిం మహిళలు జగన్‌ను కలసి ఉదయగిరిలో 250 ముస్లిం మైనార్టీ కుటుంబాలు నివసిస్తున్నట్లు తెలిపారు. తాము చెక్కతో ఫోర్కులు, స్పూన్లు తయారు చేస్తున్నామని చెప్పారు. తమకు శాశ్వత ఉపాధిని కల్పించాలని వారు కోరారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కలిగిరి మండలంలో ఉత్తరకాలువ పనులపై ఆరా తీశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ యుటిఎఫ్ నాయకులు జగన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పాదయాత్రలో భాగంగా తూర్పు జంగాలపల్లిలో రాత్రి బస చేశారు. జగన్ వెంట వైసిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ, నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి గౌతమ్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు ఉన్నారు.


నెల్లూరు జిల్లా కొండాపురంలో అభివాదం చేస్తున్న జగన్

నేడు మహిళా సదస్సు

కొండాపురం మండలం రేణమాలలో గురువారం మహిళా సదస్సు నిర్వహించనున్నారు. అక్కడ నిర్వహిస్తున్న మహిళా సదస్సులో జగన్ పాల్గొంటారు. ఈ సదస్సుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పార్టీ నాయకులు ఇప్పటికే పూర్తి చేశారు.

ఎమ్మెల్యే 'చింతమనేని'కి మూడేళ్ల జైలు

- వేర్వేరు సెక్షన్ల కింద శిక్ష, జరిమానా
- మాజీమంత్రి వసంత్‌కుమార్‌పై దాడి కేసులో భీమడోలు కోర్టు తీర్పు
- వెంటనే బెయిల్ మంజూరు


పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు కోర్టు నుంచి బెయిలుపై బయటకు వస్తున్న దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, భీమడోలు

ప్రభుత్వ విప్, పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.దీపదైవకృప బుధవారం తీర్పునిచ్చారు. అప్పట్లో చర్చనీయాంశమైన ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2011 నవంబర్ 26న దెందులూరు జెడ్‌పి హైస్కూల్‌లో రచ్చబండ సభకు అప్పటి మంత్రి, ఉంగుటూరు ఎంఎల్ఎ వట్టి వసంతకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మంత్రి వసంత కుమార్‌ను బెదిరించారని, మిగిలిన ప్రజాప్రతినిధులను దుర్భాషలాడటమే కాకుండా సభలో గందరగోళం సృష్టించారని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిని అడ్డుకున్నారని, మంత్రి గన్‌మెన్ ఎం.సుబ్బారావు దెందులూరు పోలీసుస్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశారు. ప్రభాకర్‌ను అదేరోజు అరెస్టు చేశారు. దీనిపై పోలీసులు 15 మందిపై కేసు నమోదు చేశారు. సభకు హాజరైన కొందరు ఉన్నతోద్యోగులు, వసంతకుమార్ బుధవారం భీమడోలు కోర్టుకు హాజరై సాక్ష్యాలు చెప్పారు. విచారణ జరిపిన భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.దీపదైవకృప తీర్పు చెప్పారు. చింతమనేని మినహా ఇతరులను నిర్దోషులుగా పేర్కొన్నారు. ఎ1 ముద్దాయి చింతమనేనికి 353 సెక్షన్ కింద ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమానా, 506-2 సెక్షన్ కింద రెండు సంవత్సరాల జైలు, రూ.వెయ్యి జరిమానా, 7(1) సెక్షన్ కింద ఆరు నెలల జైలు, రూ.500 జరిమానా విధించారు. శిక్ష ఏకకాలంలో ఉంటుందని, జరిమానా చెల్లించకపోతే మరో నెలరోజులు జైలు శిక్ష అదనంగా ఉంటుందని పేర్కొన్నారు. కేసుపై అప్పీలుకు నెల రోజుల గడువు ఇచ్చారు. కేసు తదుపరి వాయిదాను మార్చి 14కు వేశారు. అనంతరం ఇద్దరు పూచీకత్తులపై చింతమనేనికి బెయిల్ మంజూరు చేశారు. చింతమనేనికి జైలు శిక్ష పడిందనే విషయం తెలియగానే ఆయన అభిమానులు పెద్దసంఖ్యలో కోర్టు వద్దకు చేరుకున్నారు. బెయిల్‌పై చింతమనేని బయటకు రాగానే చుట్టుముట్టారు. భారీ ర్యాలీగా అక్కడ నుంచి తరలివెళ్లారు. చింతమనేని ప్రభాకర్‌పై పదుల సంఖ్యలో కేసులు ఉన్నా, శిక్షపడటం ఇదే తొలిసారి కావడంతో అంతటా చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబుతో వివిఎస్ లక్ష్మణ్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాజీ క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ సచివాలయంలో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమరావతిలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు అంశంపై వారు చర్చించారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిఎంను లక్ష్మణ్ కలిసి అకాడమీ ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి కోసం కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

జల క్రీడల్లో ఉపాధి ఆధారిత శిక్షణ

పర్యాటక శాఖ కార్యదర్శి మీనా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరుద్యోగ యువతకు జల క్రీడల్లో ఉపాధి ఆధారిత శిక్షణను అందించనున్నట్లు పర్యాటక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవాలోని జాతీయ జల క్రీడల సంస్థతో ఎపి టూరిజం అథారిటీ (ఎపిటిఎ) ప్రత్యేక ఒప్పందాన్ని చేసుకుందన్నారు. పర్యాటక రంగ పరంగా జల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో నిపుణుల కొరత తలెత్తుతుందని, దాన్ని అధిగమించే క్రమంలో నిరుద్యోగులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. తొలి దశలో అనంతపురం టూరిజం హబ్ నుంచి 15 మందిని ఎంపిక చేస్తామని, దశల వారీగా అన్ని టూరిజం హబ్‌ల నుంచి ఎంపిక చేసి ఉపాధి చూపుతామని పేర్కొన్నారు.

సామాన్యుల కొనుగోలు శక్తి పెరగాలి

జెఎన్‌టియు విశ్రాంత ప్రొఫెసర్ అమిత్ బాదురి

ప్రజాశక్తి- ఎఎన్‌యు (గుంటూరు)

భారతదేశంలో పెట్టుబడి సంచయనం ఉండాలంటే సామాన్యుల కొనుగోలు శక్తి పెరగాలని, సహజ వనరులన్నీ ప్రభుత్వ అధీనంలో ఉండాలని న్యూఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌టియు) ఆర్థికశాస్త్ర విశ్రాంత ప్రొఫెసర్ అమిత్‌బాదురి స్పష్టం చేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నత వర్గాలకే ప్రయోజనాలు చేకూర్చేలా సన్నగిల్లిందని పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సెంటర్ ఫర్ సైంటిఫిక్ సోషలిజం ఆధ్వర్యంలో 'ప్రాథమిక పెట్టుబడి సంచయం-భారత ప్రజాస్వామ్యం' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సుకు సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎన్.అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అమిత్‌బాదురి మాట్లాడుతూ.. పాలకులు రాజకీయ లబ్ది కోసం కార్పొరేట్ సంస్థలకు లబ్ది చేకూరుస్తూ ఎన్నికలప్పుడు వారి వద్ద నిధులు పొందడం పరిపాటైం దని చెప్పారు. ఈ క్రమంలో సామాన్యుల అభ్యున్నతిని విస్మరిస్తున్నారన్నారు. బ్యాంకు రుణాలు సైతం ఉన్నత వర్గాలకు అందుతున్నాయని, వారు చెల్లించకుంటే మొండి బకాయిల పేరుతో రద్దు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇటువంటి మొత్తాలు జాతీయ ఆదాయంలో 10 శాతం ఉంటాయని, అయితే పేదలకు ఇచ్చే సబ్సిడీలు మాత్రం జాతీయ ఆదాయంలో ఐదు శాతమేనని విశదీకరించారు. పైగా ఉన్నత వర్గాలకిచ్చే రుణాలు పెట్టుబడిగా కాకుండా విలాసాలకు ఉపయోగిస్తున్నారని, దీనివల్ల పెట్టుబడి సంచయనం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో వస్తూత్పత్తి వల్ల కార్మికుల సంఖ్య తగ్గి కొనుగోలు శక్తి కొందరికే పరిమితమవు తుందని, ఇదీ పెట్టుబడి సంచయానికి అడ్డంకని తెలిపారు. సహజ వనరులు గతంలో ప్రభుత్వాల చేతిలో ఉంటే ఇప్పుడు వ్యక్తిగత ఆస్తులుగా మారుతున్న క్రమంలో పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్పులొస్తున్నాయని వివరించారు. వ్యవసాయ దేశంగా ఉన్న భారతదేశంలో క్రమంగా వ్యవసాయ భూమి తగ్గుతోందని, భూములను పెద్దపెద్ద కంపెనీలకు ఇస్తున్నాయని చెప్పారు. 16, 17 శతాబ్దాల్లో ఐరోపా దేశాల్లో ఉన్ని ఉత్పత్తులతో పెట్టుబడి పెరిగిందని, తర్వాత వచ్చిన పారిశ్రామికీకరణతో పెట్టుబడి పోగుబడిందని, అందుకు భిన్నంగా భారతదేశంలో నేటి పరిస్థితులు ఉన్నాయని వివరించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68